www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 9-9-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 145 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 9.54 తదుపరి సప్తమి; నక్షత్రం: విశాఖ సా. 6.04 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా. 10.24-12.08; దుర్ముహూర్తం: మ. 12.36-1.25, మ. 3.03-3.51; అమృతఘడియలు: ఉ. 8.19-10.06; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.18 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నక్సల్స్‌పై ఆఖరి పోరాటం

సన్నాహాలు ముమ్మరం చేసిన కేంద్రం

ఛత్తీస్‌గఢ్‌కు అదనంగా 4 వేల బలగాలు

4 సీఆర్పీఎఫ్ బెటాలియన్ల తరలింపు

ఆపరేషన్ ప్రహర్‌లో పుంజుకోనున్న వేగం



2

మళ్లీ భగ్గుమన్న మణిపూర్!

దాడులు, ఘర్షణల్లో ఆరుగురి మృతి

గవర్నర్‌ను కలిసిన సీఎం బీరేన్ సింగ్

రాష్ట్ర సర్కారుకు తగిన అధికారాలు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి



బెజవాడలోని జక్కంపూడి కాలనీలో జేసీబీ పైనుంచి వరద బాధితులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

వాహనాల రిపేర్ ఖర్చు కొంత భరిస్తాం

ఇళ్లలో పరికరాలకూ మరమ్మతులు

తక్కువ ఖర్చైతే మేమే పెట్టుకొంటాం

మరీ ఎక్కువైతే కొంత ప్రభుత్వం, కొంత ఓనర్లు భరించే యోచన

కంపెనీలు, బ్యాంకర్లతో చర్చలు

ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టత

వరద రోడ్ల శుభ్రతపై డ్రోన్లతో తనిఖీ

సీఎం చంద్రబాబు వెల్లడి

6

విపత్తుపై యుద్ధం!

బుడమేరు ముంపు.. కృష్ణా వరద.. భారీ వర్షాలు.. ఒకే సమయంలో ముప్పేట దాడి

సవాలును స్వీకరించిన రాష్ట్ర సర్కారు

బెజవాడ చరిత్రలో ఎరుగని ముప్పు

హుద్‌హుద్‌ను మించిన పెను విపత్తు

'వార్‌జోన్' తరహాలో సహాయ చర్యలు

సర్వ శక్తులు, సకల వనరులతో రంగంలోకి

8 రోజులుగా విజయవాడలోనే చంద్రబాబు

15 మంది మంత్రులు, ఐఏఎస్‌లు వరదలోనే

యుద్ధ ప్రాతిపదికన బుడమేరు గండ్ల పూడ్చివేత

ప్రకాశం బ్యారేజీ మరమ్మతులు కొలిక్కి

చివరి బాధితుడికీ సాయమే లక్ష్యంగా చర్యలు

విజయవాడ అంటే.. మండే ఎండలు, ఉక్కపోత! భారీ వర్షం పడితే.. అక్కడక్కడ జలమయమయ్యే రోడ్లు! అప్పుడప్పుడు కృష్ణా నది పొంగితే కృష్ణలంక, రామలింగేశ్వర నగర్ వంటి ప్రాంతాల్లో చేరే వరద నీరు! అంతే తప్ప.. పీకల్లోతు వరదలను ఈ నగరం ఎన్నడూ ఎరుగదు! ఇంతటి విపత్తు గతంలో తలెత్తలేదు. ఒకవైపు సహాయ చర్యలు... మరోవైపు ఆగని వర్షం! వీటన్నింటినీ మించి విపక్షం బురద రాజకీయం! ఇదో పెను సవాల్! అయినా.. సర్కారు ఎక్కడా తగ్గలేదు. సర్వశక్తులు ఒడ్డుతూ, అన్ని వనరులు సమకూర్చుకుంటూ సహాయ ప్రక్రియ చేపట్టింది.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒకవైపు భారీ వర్షాలతో నగరంలో విరిగి పడిన కొండ చరియలు! మరోవైపు... ప్రధాన రహదారులను ముంచెత్తిన నీరు! గత శనివారం బెజవాడలో ఇదీ పరిస్థితి! అధికార యంత్రాంగం దీనిపై దృష్టి సారించి దిద్దుబాటు చర్యలు చేపడుతుండగానే... పులిమీద పుట్రలా గత ఆదివారం బుడమేరు ముంచెత్తింది. తొలిసారి విజయవాడ ఉత్తర భాగం వారం రోజులుగా వరద నీటిలో ఉంది. అనుకోని ఉపద్రవం, అందుకోలేనంత ముంపులో జనంతో తొలి రెండురోజులు మాత్రం సహాయ చర్యల్లో తడబాటు కనిపించింది. మూడో రోజు నుంచి మెల్లగా మార్పు మొదలైంది. సవాళ్ల మధ్య రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. సీఎం చంద్రబాబుతోపాటు రాష్ట్ర సచివాలయం మొత్తం విజయవాడ కలెక్టరేట్‌కు

మిగతా 11వ పేజీలో...



వరద నష్టం రూ.6,882 కోట్లు

6

కేంద్రానికి రాష్ట్రం ప్రాథమిక నివేదిక

రోడ్లు, భవనాల శాఖకు రూ.2165 కోట్లు

ఇరిగేషన్‌కు 1,569 కోట్ల నష్టమని వెల్లడి

వరద మరణాలు 45

ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే 35 మంది మృతి

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం

11

1,81,538 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 19,688 హెక్టార్లలో ఉద్యాన పంటలు మునక

నేటి నుంచి నష్టం అంచనా

2.32 లక్షల నివాసాల్లో సర్వే.. వ్యాపార సంస్థల నష్టం కూడా

కుటుంబ సభ్యులెవరున్నా నమోదు.. ధ్రువీకరణ కోసం ఆధార్ తప్పనిసరి

ఎన్యూమరేషన్ సమయంలో లేకుంటే తర్వాత కూడా నమోదుకు అవకాశం

17 వేల ఎన్యూమరేషన్ బృందాలు.. మొత్తం మూడు రోజుల్లో సర్వే పూర్తి

6

బ్యారేజీపై కుట్ర!

బోట్లను కావాలనే వదిలేశారా?



నందిగం సురేశ్, తలశిల అనుచరుల పాత్ర?

అందులో మూడు బోట్లు ఒకరివే

ఇనుప గొలుసుతో మూడూ అనుసంధానం

ప్లాస్టిక్ వైరుతో చెట్టుకు లంగరు

స్థానికులు హెచ్చరిస్తున్నా నిర్లక్ష్యం

అంతకుముందు నదికి ఆవల లంగరు

ఇటీవలే గొల్లపూడి వైపునకు మార్పు

లోతుగా విచారణ జరుపుతున్న పోలీసులు

(విజయవాడ/అమరావతి-ఆంధ్రజ్యోతి)

కృష్ణా నది వరద పోటుపై ఉన్న సమయంలోనే ప్రకాశం బ్యారేజీని మూడు ఇనుప బోట్లు 'కలిసికట్టు'గా ఢీకొట్టడం వెనుక భారీ కుట్ర దాగిఉందా? బ్యారేజీ గేట్లను దెబ్బతీసేందుకే... ఉద్దేశపూర్వకంగా బోట్లను అలా 'వదిలేశారా?' ఈ అనుమానాలను బలపరిచే అనేక అంశాలు బయటపడుతున్నాయి. తొలుత ఇది ప్రమాదంగా భావించినప్పటికీ... అది జరిగిన తీరు, బోట్ల యజమానుల నేపథ్యాన్ని పరిశీలిస్తే దీని వెనుక 'కుట్ర' దాగి ఉందని ప్రభుత్వానికి పోలీసులు ప్రాథమికంగా నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. వైసీపీకి చెందిన మాజీ ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం అనుచరుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల ఒకటో తేదీ రాత్రి

మిగతా 11వ పేజీలో...

స్లూయిజ్ గేట్ల చైన్లు 'డ్యామేజ్'!

ప్రకాశం బ్యారేజీపై కుట్రలో మరో కోణం

దెబ్బతిన్న పది స్కోర్ స్లూయిజ్ గేట్ల చైన్‌లు.. వాటి ద్వారా 2 లక్షల క్యూసెక్కులు పంపే వీలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒకవైపు బ్యారేజీని ఢీకొట్టిన బోట్లు... మరోవైపు లింకులు తెగిన స్కోర్ స్లూయిజ్ గేట్లు! వెరసి... ప్రకాశం బ్యారేజీకి భారీ డ్యామేజీ కల్గించడమే లక్ష్యంగా కుట్ర జరిగిందని జలవనరుల శాఖ అనుమానిస్తోంది. ప్రకాశం బ్యారేజీకి ఉన్న 70 గేట్ల గురించి అందరికి తెలుసు. కానీ... ఈ గేట్లకు అటూఇటుగా ఉండే స్కోర్ స్లూయిజ్‌ల గురించి ఇంజనీర్లకు మాత్రమే తెలుసు. బ్యారేజీకి ఒకవైపు నాలుగు, మరోవైపు ఆరు స్లూయిజ్ గేట్లు ఉంటాయి. ఈ పది గేట్లనూ తెరిస్తే.. ఏకంగా 2 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని అదనంగా నదిలోకి వదిలేయవచ్చు. బ్యారేజీలో నీటి నిల్వలు తగ్గిపోయినప్పుడు.. కింద కూరుకుపోయిన ఇసుకతో, ఇతర వ్యర్థాలను తొలగించేందుకు (నదిలో కిందికి వెళ్లిపోయేలా) ఈ స్లూయిజ్ గేట్లను ఉపయోగిస్తారు. ఈ నెల రెండో తేదీన వరుసగా ఐదు ఇనుపబోట్లు బ్యారేజీని ఢీకొట్టడంతో కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. బ్యారేజీ వద్ద చిక్కుకున్న బోట్లను తొలగించే చర్యలు చేపట్టిన ఇంజనీర్లు... స్కోర్ స్లూయిజ్‌లను పరిశీలించారు. అత్యంత విచిత్రంగా... పది స్లూయిజ్‌లకు బిగించిన

మిగతా 11వ పేజీలో...

వరదపై ఆగని జగన్ బురద

వలంటీర్లు ఉంటే వరదను సమర్థంగా ఎదుర్కొనేవారట!

రాష్ట్రంలో ప్రభుత్వం అనేది అసలు ఉందా?

ప్రభుత్వం మారకపోతే, వైసీపీ తరఫున పోరు

ఎక్స్ వేదికగా జగన్ ట్వీట్

6

జగన్ వ్యాఖ్యలపై విరుచుకుపడ్డ నెటిజన్లు

ఆయన నిర్వాకమే వరదంటూ మండిపాటు

ఈ ప్రభుత్వంవల్ల కాదు.. మనమే వెయ్యి కోట్లు విడుదల చేద్దామంటూ బ్రహ్మాజీ కౌంటర్ ట్వీట్

అయితే, ఆ ట్వీట్ తాను చేయలేదన్న నటుడు

దుష్ప్రచారాన్ని సహించొద్దు

6

సోషల్ మీడియాలో పోస్టులపై ప్రభుత్వం సీరియస్

మితిమీరితే ఊరుకోబోనని ముఖ్యమంత్రి హెచ్చరిక

దువ్వాడ ఫ్యామిలీ డ్రామాలో మరో రచ్చ

3

శ్రీనివాస్ నివాసంలోకి ఎంట్రీ ఇచ్చిన మాధురి

లోపలికెళ్లేందుకు వాణి, ఆమె కుమార్తెల యత్నం

కోర్టు ఆర్డర్ కావాలంటూ అడ్డుకున్న పోలీసులు

ఇల్లు తన పేరున రిజిస్ట్రేషన్ అయిందన్న మాధురి

అప్పులు తీర్చేందుకే మాధురికి ఇల్లు అమ్మేశా: దువ్వాడ శ్రీనివాస్

మరో ముప్పు

తరుముకొస్తున్న తీవ్ర వాయు'గండం'!

విజయవాడ వరదలతో ఇప్పటికే కుదేలు

భారీ వర్ష సూచనతో ప్రజల్లో భయం

యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన సీఎం

నేటి మధ్యాహ్నానికి పూరీ వద్ద తీరం దాటే అవకాశం

నేటి రాత్రి వరకు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాలకు రెడ్ ఎలర్ట్

కృష్ణా నదికీ పెరిగిన వరద

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరద ముంపు నుంచి విజయవాడ పూర్తిగా కోలుకోక ముందే బంగాళాఖాతంలో మళ్లీ వాయుగుండం ఏర్పడింది. దీని ప్రభావంతో రెండు రోజులుగా కోస్తాలో అనేక ప్రాంతాల్లో ముసురు పట్టి ఎడతెరపి లేకుండా వర్షాలు పడుతుండగా.. రానున్న 48 గంటల పాటు ఉత్తర కోస్తాలో అత్యంత భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. రాయలసీమలోనూ మోస్తరు వర్షాలు పడే అవకాశముందని తెలిపింది. శ్రీకాకుళం,

మిగతా 12వ పేజీలో...



శ్రీకాకుళం జిల్లా బుడతవలస గెడ్డలో కొట్టుకుపోయిన వ్యాన్‌ను ట్రాక్టర్ సహాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

ఉత్తరాంధ్రలో కుండపోత

ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు

వేలాది ఎకరాల్లో నీట మునిగిన పంటలు

వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బహుదా, తాండవ నదులకు వరద పోటు

విశాఖలో ఎడతెరిపి లేకుండా జోరు వర్షం

జారిపడుతున్న కొండచరియలు

ఘాట్ రోడ్లలో రాకపోకలపై 2 రోజులు నిషేధం

ఏలేరు నుంచి 5,500 క్యూసెక్కులు విడుదల

ముంపుబారిన కొల్లేటి లంక గ్రామాలు

విశాఖ- కౌలాలంపూర్ విమానం రద్దు

ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక

2

నేడు విద్యా సంస్థలకు సెలవు

బాబు అరెస్టుకు ఏడాది

వైసీపీ పతనాన్ని వేగవంతం చేసిన చర్య

ఐదేళ్లూ టీడీపీ, బాబుపై రాజకీయ కక్ష సాధింపులే

'స్కిల్' అక్రమ కేసుపెట్టి అన్యాయంగా జైలుకు

ఇప్పుడు సీఎంగా జనంలో చంద్రబాబు

విపక్ష నేత హోదా సైతం గల్లంతై కోర్టు చుట్టూ తిరుగుతున్న జగన్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టయ్యి సోమవారం నాటికి సరిగ్గా ఏడాది! స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో మోపిన అక్రమ కేసులో గత ఏడాది సెప్టెంబరు తొమ్మిదో తేదీ తెల్లవారుజామున నంద్యాలలో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. పదకొండో తేదీన ఆయనను రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. ఏభై మూడు రోజులు జైల్లో ఉన్న అనంతరం ఆయన బెయిల్‌పై విడుదల అయ్యారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో అక్రమాలు

మిగతా 3వ పేజీలో...

రాజ్యసభలో ఎన్డీయేకు స్వల్ప ఆధిక్యం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు ఆరుగురు నామినేటెడ్ సభ్యుల మద్దతుతో రాజ్యసభలో స్వల్ప ఆధిక్యం లభించింది. బీజేపీకి సొంతంగా 96 మంది ఎంపీలుండగా మొత్తం ఎన్డీయే ఎంపీల సంఖ్య 113. తాజాగా ఆరుగురు నామినేటెడ్ ఎంపీల మద్దతుతో ఎన్డీయే బలం 119కి పెరిగింది. నామినేటెడ్ ఎంపీలు సాధారణంగా ప్రభుత్వానికి మద్దతుగా ఉంటారు. రాజ్యసభలో మొత్తం ఎంపీల సంఖ్య 234. సగం సంఖ్య 117 కాగా ఎన్డీఏ బలం రెండు ఎక్కువగా 119కి చేరినట్లైంది. వక్ఫ్ సవరణ బిల్లు సహా పలు కీలక బిల్లులు ఆమోదం పొందాల్సిన తరుణంలో ఎన్డీయేకు మెజార్టీ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీకి 27 మంది సభ్యులున్నారు. మిత్రపక్షాలకున్న 58 మంది ఎంపీలతో కలిపి కాంగ్రెస్ బలం 85కు చేరింది. వైసీపీకి రాజ్యసభలో 9 మంది ఎంపీలుండగా బీజేడీకి ఏడుగురు, ఏఐఏడీఎంకేకు నలుగురు ఎంపీలున్నారు. ముగ్గురు ఇండిపెండెంట్లు, చిన్న పార్టీలకు సంబంధించిన ఇతర ఎంపీలు కూడా ఉన్నారు. జమ్మూకశ్మీర్‌లో నాలుగు ఎంపీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ కారణంగా సభలో సభ్యుల సంఖ్య 241కి పరిమితమైంది. మొత్తం 11 ఖాళీలుండగా మరో నాలుగు ఏపీలో, ఒకటి ఒడిశాలో ఖాళీగా ఉన్నాయి. 4నామినేటెడ్ ఎంపీల స్థానాలు కూడా ఖాళీగా ఉన్నాయి. బీజేడీకి గుడ్‌బై చెప్పిన రాజ్యసభ ఎంపీ సుజీత్ కుమార్ ఇటీవలే బీజేపీలో చేరారు. ఒడిశా అసెంబ్లీలో బీజేపీకి తగినంత బలం ఉండటంతో ఉప ఎన్నికల్లో సుజీత్ గెలుపు సునాయాసమే. వైసీపీ రాజ్యసభ ఎంపీలు మోపిదేవి వెంకట రమణ, మస్తాన్ రావు గత నెల తమ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. వారిద్దరూ టీడీపీలో చేరే అవకాశముంది. రాజ్యసభలో బీజేపీకి మద్దతిస్తున్న పార్టీలివే: జేడియూ, జేడీఎస్, ఎన్సీపీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అథావలే), శివసేన, ఆర్ఎల్‌డీ, నేషనల్ పీపుల్స్ పార్టీ, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్, తమిళ మనిల కాంగ్రెస్.

బెజవాడకు వరదలు జగన్ మేడ్ డిజాస్టర్

ఆధునికీకరణ పనులను రివర్స్ పాలనలో నిలిపేశారు : మంత్రి లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'బెజవాడకు వరదలు జగన్ మేడ్ డిజాస్టర్. బురద రాజకీయానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన జగన్ బెంగళూరు ప్యాలెస్‌లో రిలాక్స్ అవుతూ అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నారు' అని మంత్రి లోకేశ్ మండిపడ్డారు. ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా జగన్‌ను ఉద్దేశించి స్పందించారు. 'ప్రతిపక్ష హోదా డిమాండ్ చేస్తున్న మీకుకు ఆ హుందాతనం ఉందా? పాస్‌పోర్టు సమస్య లేకపోతే మీరు ఎప్పుడో లండన్‌కు ఎగిరిపోయేవారు. 74 ఏళ్ల వయసులో క్షణం తీరిక లేకుండా వరద బాధితులకు సాయం అందిస్తున్న చంద్రబాబుపై విమర్శలు చేయడానికి మీకు మనసెలా వచ్చింది? విపత్తులు వచ్చి ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సొంత డబ్బుతో కనీసం పులిహోర ప్యాకెట్ అందజేసిన చరిత్ర కూడా మీకు లేదు. పైగా మీరు ప్రకటించే సెల్ఫ్ చెక్స్ కథ..! అందరికీ తెలిసిందే. నాడు చంద్రబాబు బుడమేరు ఆధునికీకరణకు రూ.464 కోట్లు కేటాయించి పనులు ప్రారంభిస్తే... మీ రివర్స్ పాలనలో పనులు నిలిపివేసి విపత్తుకు కారణమయ్యారు. బుడమేరు పొంగడానికి ప్రధాన కారణమయ్యారు. ఇది జగన్ మేడ్ డిజాస్టర్. ఆధునికీకరణ, మరమ్మతు పనులు ఆపేశారు. సుమారు రూ.500 కోట్ల విలువైన 600 ఎకరాలు వైసీపీ నాయకులు కబ్జా చేశారు. 2022లోనే గండి పడినా పట్టించుకోలేదు. ఐదేళ్లలో సరైన నిర్వహణ లేదు. విజయవాడ నగరంలో స్ట్రోమ్ వాటర్ డ్రైన్ పనులు ఆపేశారు. మీ పాలన వైఫల్యాలే నేడు ప్రజల కష్టాలకు కారణం. అన్ని సమస్యలను అధిగమిస్తాం. చివరి వరద బాధితుడికి సాయం అందించేవరకు విశ్రమించం' అని లోకేశ్ పేర్కొన్నారు.

కృష్ణానదికి పెరిగిన వరద

కొల్లూరు, సెప్టెంబరు 8: కృష్ణానదికి వరద పోటెత్తుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి ఆదివారం సాయంత్రానికి 5.5 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాలు మళ్లీ వరద గుప్పిట్లో చిక్కుకోనున్నాయి. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళీ ఆదేశాలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వరద హెచ్చరికలతో లంక గ్రామాల్లోని ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని మైకుల ద్వారా ప్రచారం చేశారు. ఇప్పటికే చిలుమూరు, కొల్లూరు, దోనేపూడి, భట్టిప్రోలు మండలంలో ని వెల్లటూరు, ఓలేరు వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ప్రభుత్వ సిబ్బంది వరద విధుల్లో పాల్గొంటున్నారు. కృష్ణానదికి ఈ నెల 1న పోటెత్తిన భారీ వరదతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని 22 లంక గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వాణిజ్య పంటలు తుడిచిపెట్టుకుపోయాయి.



సౌదీ అరేబియాలో

గల్ఫ్‌లో ఘనంగా వినాయక చవితి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

విఘ్నాలు తొలగించాలంటూ గల్ఫ్ దేశాల్లోని వేలాది మంది తెలుగు ప్రవాసీయులు వినాయకుడిని పూజిస్తూ వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటున్నారు. భారతీయులు నివాసముంటున్న దాదాపు అన్ని అపార్ట్‌మెంట్లలో గణపతికి పూజలు చేస్తున్నారు. దుబాయిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీ ఎత్తున వినాయక విగ్రహాల విక్రయాలు జరిగాయి. వినాయక విగ్రహాల కొనుగోలుకు ఈ స్థాయిలో రద్దీని తాను మొదటిసారిగా చూస్తున్నానని దుబాయిలో సుదీర్ఘకాలంగా నివాసముంటున్న తెలుగు ప్రవాసీ ప్రముఖుడు బాలుసాని వివేకానంద తెలిపారు. శని, ఆదివారాలలో దుబాయిలోని రెండు దేవాలయాల్లోనూ గణపతి పూజలకు భారీగా భారతీయ ప్రవాసీలు హాజరయ్యారు. దుబాయి, మస్కట్, మనమాలలోని దేవాలయాలతో పాటు.. అజ్మాన్ మైత్రి ఫాంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను వేలాది మంది భక్తులు సందర్శించి పూజలు చేస్తున్నారు. సౌదీఅరేబియాలోని దమ్మాం, రియాధ్, జెద్దా నగరాలతో పాటు.. తెలుగు ప్రవాసీ సంఘం సాటా ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దమ్మాంలో జరిగిన గణపతి ఉత్సవాల్లో లడ్డూ వేలం పాట నిర్వహించగా.. ఏపీలోని ఒంగోలుకు చెంది న ఈశ్వరరావు 3 వేల రియాళ్లకు లడ్డూను దక్కించుకున్నారు. బహ్రెయిన్, ఒమాన్, కువైట్‌లలోనూ చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

నక్సల్స్‌పై ఆఖరి పోరాటం

ఛత్తీస్‌గఢ్‌కు అదనంగా 4 వేల బలగాలు



- ఆపరేషన్ ప్రహార్‌లో పుంజుకోనున్న వేగం

(సెంట్రల్ డెస్క్)

ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజాన్ని అంతం చేస్తామని కంకణం కట్టుకున్న కేంద్ర ప్రభుత్వం ఆదివారం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఝార్ఖండ్‌లోని మూడు బెటాలియన్లు, బిహార్‌లోని ఒక పటాలానికి చెందిన సీఆర్పీఎఫ్ బలగాలను ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రీజియన్‌కు తరలించాలని నిర్ణయించింది. ఈ నాలుగు బెటాలియన్లకు చెందిన సుమారు 4 వేల మంది సీఆర్పీఎఫ్ జవాన్లు.. ఇప్పటికే 40కి పైగా ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్(ఎఫ్‌వోబీ)లను ఏర్పాటు చేసుకుని, యాంటీ-నక్సల్స్ ఆపరేషన్లలో కీలక భూమిక పోషిస్తున్న సీఆర్పీఎఫ్-కోబ్రా బలగాలతో కలిసి.. 'ఆపరేషన్ ప్రహార్'లో పాల్గొంటారని ఉన్నతాధికారులు తెలిపారు. మావోయిస్టులకు కంచుకోటగా బస్తర్ రీజియన్‌లోని పది జిల్లాలు ఉండేవి. గడిచిన నాలుగేళ్లలో ఆ సంఖ్య ఏడు జిల్లాలకు పరిమితమైంది. గడిచిన ఎనిమిది నెలల కాలంలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 153 మంది నక్సల్స్ అంతమొందగా.. మావోయిస్టులకు కంచుకోటగా పేరున్న అబుజ్‌మడ్ అడవుల్లోనికి కూడా బలగాలు చొచ్చుకువెళ్లాయి. ఇటీవల కాంకేర్ జిల్లా పోలీసులు నిర్వహించిన ఆపరేషన్‌లో.. అబుజ్‌మడ్ ప్రవేశ ప్రాంతంలో జరిపిన కాల్పుల్లో 17 మంది నక్సల్స్ మృతిచెందారు.

కొత్త బలగాలతో మరింత బలం

ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ అడవుల్లో సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, జిల్లాల స్థాయిల్లో డీఆర్జీ, ఏఆర్ బలగాలు.. ఇలా 60 వేలకు పైగా జవాన్లు, కానిస్టేబుళ్లు నక్సల్స్ ఆపరేషన్లలో పాల్గొంటున్నారు. కొత్తగా వస్తున్న 4 వేల మంది సీఆర్పీఎఫ్ జవాన్లు కూడా యాంటీ-నక్సల్స్ ఆపరేషన్లలో సుదీర్ఘ అనుభవం ఉన్నవారేనని ఉన్నతాధికారులు చెబుతున్నారు. "కొత్తగా వచ్చే 4 వేల బలగాలతోపాటు.. డాగ్ స్క్వాడ్స్, డ్రోన్లు(యూఏవీలు), అధునాతన కమ్యూనికేషన్ సెట్లు ఉంటాయి. 2026 టార్గెట్ నేపథ్యంలో.. వీలైనంత త్వరగా దట్టమైన అడవుల్లోనూ హెలిప్యాడ్లు, రోడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి" అని అధికార వర్గాలు తెలిపాయి. అయితే.. 2005లో ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రారంభమైనప్పటి నుంచి తాజా ఆపరేషన్ ప్రహార్ వరకు బలగాల వైపు కూడా భారీగానే ప్రాణనష్టం ఉందని, హెలిప్యాడ్లు, రోడ్ల ఏర్పాటుతో ఇప్పుడు ఆ నష్టాన్ని నివారించవచ్చని విశ్రాంత సీఆర్పీఎఫ్ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బలగాలు మాత్రం వీటినేమి లెక్కచేయకుండా అడవుల్లో ముందుకు సాగుతున్నాయి. వర్షాకాలంలో నక్సల్స్ కదలికలు ఎక్కువగా ఉండవని, షెల్టర్ జోన్లలో తలదాచుకుంటారని, వారిని గుర్తించేందుకు ఇదే సమయమని ఛత్తీస్‌గఢ్ పోలీసులు చెబుతున్నారు.

> "2026కల్లా ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజాన్ని కూకటి వేళ్లతో పెకిలించేస్తాం.."
>
> – గత నెల 24ల నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల సీఎస్‌లు, డీజీపీల సదస్సులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

తగ్గుతున్న నక్సలిజం?

	2004-14	2014-24
నక్సల్స్ దాడులు	16,274	7,696
నక్సల్స్ హింసతో మరణాలు	6,568	1,990
నక్సలిజం విస్తరణ	10 రాష్ట్రాలు	38 జిల్లాలు
ఛత్తీస్‌గఢ్‌లో.. ఈ ఏడాది గణాంకాలు		
ఎన్‌కౌంటర్లలో నక్సల్స్ మరణాలు		159
అరెస్టయిన నక్సల్స్ సంఖ్య		753

అబుజ్‌మడ్‌పై పట్టు సాధ్యమేనా?

ఛత్తీస్‌గఢ్ బలగాలు తెలంగాణకు చెందిన గ్రేహౌండ్స్ సహాయం లేకుండానే.. ఇటీవల అబుజ్‌మడ్‌లో భారీ ఆపరేషన్ నిర్వహించిన విషయం తెలిసిందే.! నక్సల్స్ కంచుకోట అయిన అబుజ్‌మడ్‌లోకి ప్రవేశించి, ఆపరేషన్ నిర్వహించడం ఇదే మొదటిసారి. అయితే.. నారాయణ్‌పూర్, బీజాపూర్, దంతేవాడ జిల్లాల్లో 4 వేల చదరపు కిలోమీటర్ల మేర అబుజ్‌మడ్ అడవులు విస్తరించాయని విశ్రాంత అధికారులు చెబుతున్నారు. ఇక తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కొండపల్లి కూడా పోలీసులకు ఓ సవాలుగా ఉంది. ఈ ప్రాంతంలో సీఆర్పీఎఫ్‌కు చెందిన 7 క్యాంపులు ఉన్నాయి. తెలంగాణ క్యాడర్‌కు చెందిన కీలక మావోయిస్టు నేతలు కొండపల్లిలోనే ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. కొండపల్లి వెళ్లడం మాత్రం ప్రాణాలతో చెలగాటమనే అభిప్రాయాలు సీఆర్పీఎఫ్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాంతం చుట్టూ మావోయిస్టులు మందుపాతరలను అమర్చారని, ఎక్కడికక్కడ బూబీట్రాప్‌లను ఏర్పాటు చేశారని చెబుతున్నారు.

మళ్లీ భగ్గుమన్న మణిపూర్!

దాడులు, ఘర్షణల్లో ఆరుగురి మృతి



కుకీల దాడి బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తున్న మణిపూర్ సీఎం బీరేన్ సింగ్

ఇంఫాల్, సెప్టెంబరు 8: మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. కుకీ-మైతేయి వర్గాల మధ్య ఘర్షణలతో గతేడాది అట్టుడికిన ఈశాన్య రాష్ట్రంలో మళ్లీ అగ్గి రాజుకుంది. రాకెట్, డ్రోన్ బాంబు దాడులతో ఈసారి మరింత హైటెన్షన్ నెలకొంది. శనివారం జిరిబామ్ జిల్లాలో ఓ ఇంట్లోకి చొరబడిన అనుమానిత కుకీ సాయుధులు నిద్రిస్తున్న వ్యక్తిని కాల్చి చంపగా.. ఇది కాస్త ఇరు వర్గాల ఘర్షణకు దారి తీసింది. అనంతరం జరిగిన కాల్పుల్లో మరో నలుగురు సాయుధులు చనిపోయారు. అంతకుముందు రోజే జరిగిన రాకెట్ దాడుల్లో బిష్ణుపూర్ జిల్లాలో ఓ వృద్ధుడు మరణించగా.. ఆరుగురు గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. భద్రతను మరింత కట్టుదిట్టం చేసి.. డ్రోన్లను తిప్పకొట్టడానికి యాంటీ డ్రోన్ సిస్టమ్‌లతో మోహరించారు. కాగా, ఘర్షణల నేపథ్యంలో సీఎం బీరేన్ సింగ్ పలువురు ఎమ్మెల్యేలు, అసెంబ్లీ స్పీకర్‌తో కలసి గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను కలిసి చర్చించారు. శాంతిభద్రతలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం తగిన అధికారాలివ్వాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిసింది. కేంద్రం, మణిపూర్ ప్రభుత్వంతో రెండు కుకీ తీవ్రవాద సంస్థల మధ్య జరిగిన సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ ఒప్పందాన్ని కూడా రద్దు చేయాలని సీఎం కోరినట్లు సమాచారం.

లోకం తీరు



దేశంలో ఎంపాక్స్ అనుమానిత కేసు

- ఇటీవల విదేశం నుంచి వచ్చిన యువకుడిలో లక్షణాలు
- ఐసొలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నామన్న కేంద్రం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: ఇటీవల విదేశాల నుంచి వచ్చిన ఓ యువకుడికి ఎంపాక్స్(మంకీ పీవర్) సోకినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. రోగిని ఓ ఆస్పత్రిలో ఐసొలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారని, అతని పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపింది. అతను విదేశాల నుంచి వచ్చాక ఎవరెవరిని కలిశాడో వారిని గుర్తిస్తున్నారని(కాంటాక్ట్ ట్రేసింగ్) వివరించింది. రోగి నుంచి సేకరించిన స్వాబ్ నమూనాలను టెస్టింగ్‌కు పంపించారు. అతనిలో ఎంపాక్స్ లక్షణాలు స్పష్టంగా ఉండటంతో రిజల్ట్ పాజిటివ్‌గా వస్తుందని భావిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఎంపాక్స్ విస్తరించకుండా కేంద్రం అన్ని చర్యలు తీసుకుందని ఆరోగ్య శాఖ తన ప్రకటనలో తెలిపింది. అయితే, రోగి వివరాలు, అతన్ని ఎక్కడ ఐసొలేషన్‌లో ఉంచారన్న వివరాలను కేంద్రప్రభుత్వం వెల్లడించలేదు. కాగా, ఎంపాక్స్ ఇటీవలి కాలంలో ఆఫ్రికా ఖండ దేశాల్లో విజృంభించింది. ఆ ఖండం నుంచి స్వీడన్, థాయ్‌లాండ్ దేశాలకూ పాకింది. ప్రజారోగ్యం పరంగా ఎంపాక్స్ అంతర్జాతీయంగా ఆందోళనకరస్థాయిలో విస్తరిస్తోందని(పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ) డబ్ల్యూహెచ్‌వో గత నెలలో ప్రకటించింది. ఇదిలా ఉండగా, భారత్‌లో గతంలోనూ ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. అయితే, ఈ ఏడాది మార్చి తర్వాత ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.

ఉత్తరాంధ్రలో కుండపోత

- ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. కుండపోతగా కురుస్తున్న వర్షంతో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. నదులతో పాటు వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీవర్షాల నేపథ్యంలో సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. విశాఖపట్నంలో కొండవాలు ప్రాంతాలకు ముప్పు ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గోపాలపట్నంలోని రామకృష్ణానగర్‌లో మట్టి పెళ్లలు జారిపడే ప్రమాదం ఉండటంతో నాలుగు ఇళ్లల్లో వారిని ఖాళీ చేయించి సమీపంలో పాఠశాలకు తరలించారు. మరో పది ఇళ్లకు ప్రమాదం ఉండటంతో వారిని కూడా ఖాళీ చేయించారు. బీచ్‌రోడ్‌లో సీతకొండ వద్ద రాళ్లు పడటంతో రాకపోకలు నిలిపివేశారు. కైలాసపురంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఆనందపురంలో పాఠశాలకు ఆనుకుని గోడ కూలిపోయింది. మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో నీటిమట్టం 55 అడుగులకు చేరడంతో సోమవారం ఉదయం ఒక గేటు ఎత్తనున్నట్టు అధికారులు తెలిపారు. విశాఖపట్నం, గంగవరం, భీమునిపట్నం ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. అనకాపల్లి జిల్లాలో రైవాడ, పెద్దేరు, కోనాం, కల్యాణపులోవ, తాండవ జలాశయాలకు వరద తాకిడి పెరిగింది. దీంతో స్పిల్‌గేట్లు ఎత్తి, అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో శారదా, పెద్దేరు, బొడ్డేరు, వరహా, సర్పా, తాండవ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పాయకరావుపేట, రాంబిల్లి, అనకాపల్లి, తదితర మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో వరి, ఇతర పంటలు నీట మునిగాయి. ఇప్పటికే ఛిద్రమైన రహదారులు.. వర్షాలతో మరింత దారుణంగా తయారయ్యాయి. అల్లూరు జిల్లాలో మత్స్యగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. అరకులోయ మండలం మాడగడలో ఆరు ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. చింతపల్లి- లంబసింగి ఘాట్ మార్గంలో కొండచరియలు విరిగి పడ్డాయి. దీంతో జిల్లాలో రెండు రోజుల పాటు ఘాట్ మార్గాల్లో రాకపోకలను నిషేధిస్తూ కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రోడ్లు, పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ఒడిశా ప్రాజెక్ట్‌ల్లో గేట్లు ఎత్తివేసి అదనపు నీటిని విడిచిపెట్టడంతో వంశధార, నాగావళి, బహుదా, మహేంద్రతనయ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. విజయనగరం జిల్లాలో వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి.

ముంపులో కొల్లేరు గ్రామాలు

కొల్లేరు ప్రాంతంలో అనేక గ్రామాలను వరద నీరు చుట్టివేసింది. కైకలూరు, మండవల్లి, ఏలూరు రూరల్ మండలాల్లో వరద తీవ్రత ఎక్కువగా ఉంది. ఎగువ నుంచి బుడమేరు, తమ్మిలేరు నుంచి భారీగా వరద నీరుచేరడంతో ఈ ముంపు మరింత పెరిగి గ్రామాలు పూర్తిగా మునిగిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక, పోలవరంలో గోదావరి నీటిమట్టం ఆదివారానికి ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 30.730 మీటర్లు, దిగువన 21.950 మీటర్లు నమోదైనట్లు ఈఈ మల్లికార్జునరావు తెలిపారు. గోదావరిలోకి అదనంగా వస్తున్న 6,11,196 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు.

ఆరు విమానాలు ఆలస్యం..

భారీవర్షాలతో ప్రతికూల వాతావరణం నెలకొనడంతో విశాఖ విమానాశ్రయానికి వచ్చి, వెళ్లాల్సిన ఆరు విమానాలు ఆలస్యంగా నడిచాయి. ఆదివారం ఉదయం బెంగళూరు-విశాఖపట్నం విమాన సర్వీసులు రెండు, విశాఖపట్నం-హైదరాబాద్, హైదరాబాద్-విశాఖపట్నానికి రాకపోకలు సాగించాల్సిన నాలుగు సర్వీసులు ఆలస్యమయ్యాయి. అదేవిధంగా విశాఖపట్నం నుంచి కౌలాలంపూర్ (మలేషియా) వెళ్లాల్సిన విమాన సర్వీసు రద్దయినట్టు విమానాశ్రయ డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు.

ఏకలవ్య విద్యార్థులకు అవస్థలు

సీతంపేట ఐటీడీఏకు కూతవేటు దూరంలో మల్లి పీవీటీజీ రెసిడెన్షియల్ పాత భవనంలో ఉన్న ఏకలవ్య పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తరగతి గదులన్నీ కారిపోతున్నాయి. మరోవైపు వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు వారి గదుల్లో గొడుగులు వేసుకుని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

ఏలేరుకు భారీగా వరద

కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఏలేరు జలాశయానికి భారీగా వరద నీరు చేరడంతో 5,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఆదివారం పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు రిజర్వాయర్‌ను పరిశీలించి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఏలేరు నుంచి విడుదల చేస్తున్న నీటి శాతాన్ని పెంచడంతో జిల్లాలోని ఏలేశ్వరం, పిఠాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట, సామర్లకోట, పెద్దాపురం మండలాల్లోని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బుడమేరు ముంపులో మూడు గ్రామాలు

ఏలూరు జిల్లాలో నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి 4,773 క్యూసెక్కుల నీటిని, కొంగువారిగూడెం ఎర్రకాల్వ ప్రాజెక్టు నుంచి 3,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తమ్మిలేరు వరద కారణంగా ఏలూరులోని శనివారపుపేట కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపివేశారు. బుడమేరు వరద కారణంగా పెదపాడు మండలంలో గోగుంట, కొణికి, కడిమిగుంట గ్రామాలు ముంపులో చిక్కుకున్నాయి. ఆయా గ్రామాల నుంచి 90 కుటుంబాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

8 రోజులుగా బస్సులోనే..

- విజయవాడ కలెక్టరేట్‌లో నిలిపిన బస్సులోనే బాబు స్నానాదులు
- రోజులో ఒకసారైనా ముంపు ప్రాంతాల సందర్శన

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

బుడమేరు వరద విజయవాడను ముంచెత్తిన రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నగరానికి మకాం మార్చారు. అప్పటినుంచి, గత ఎనిమిది రోజులుగా విజయవాడ కలెక్టరేట్ ఆవరణలో నిలిపిన బస్సులోనే ఆయన బస చేస్తున్నారు. ఇంత వరదను గతంలో చూడని విజయవాడ వాసులు గట్టి షాక్‌కు గురై ఉన్న తరుణంలో.. వారికి అండగా మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్నే కలెక్టరేట్‌కు తీసుకువచ్చారు. వరద బాధితుల సహాయార్థం

ఏకంగా సీఎంవోయే ఆయన వెంట తరలివచ్చింది. విజయవాడ కలెక్టరేట్‌లోని బస్సులోనే ఆయన స్నానపానాదులు, నిద్ర, అధికారులతో సమీక్షలు! అక్కడి నుంచే వరద ప్రాంతాలకు చంద్రబాబు పర్యటన, సహాయక చర్యలపై నిరంతర పర్యవేక్షణ! నిజానికి బస్సు వంటి ఇరుకు ప్రదేశంలో రోజుల తరబడి ఉండటం ఇబ్బందికరమైనా, ఆయన సర్దుకొని అంతే ఉంటున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ విశ్రాంతి లేకుండా పనిచేస్తూనే ఉన్నారు. ప్రతి రోజూ తప్పనిసరిగా మూడు, నాలుగు గంటలపాటు ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడుతూ సహాయం అందుతున్న తీరును పర్యవేక్షిస్తున్నారు. ముంపు సంభవించిన మొదటిరోజు ఆయన తెల్లవారుజాము నాలుగు గంటలవరకూ బాధిత ప్రాంతాల సందర్శనలోనే ఉన్నారు. కేవలం రెండు గంటలు పడుకొని మళ్లీ ఉదయం ఆరు గంటలకు సిద్ధమై తన పని మొదలుపెట్టారు. వినాయక చవితి పండగ రోజు కూడా ఆయన కలెక్టరేట్‌లోని బస్సులోనే ఉన్నారు. విజయవాడలోని ముంపు ప్రాంతాలను ఆ రోజు కూడా సందర్శించారు. ఒక జేసీబీ యంత్రం ఎక్కి నేరుగా బాధితులను కలిశారు.

సీఎం షెడ్యూల్ ఇలా..

బస్సులో ఆయన షెడ్యూల్ ఉదయాన్నే ప్రారంభం అవుతుంది. మొదట అన్ని పత్రికలు చదువుతున్నారు. ఆ తర్వాత ఇంటలిజెన్స్ అధికారులతో సమావేశమై ముఖ్యమైన విషయాల గురించి తెలుసుకొంటున్నారు. అనంతరం తన కార్యాలయంలోని అధికారులతో సమావేశమై ముందురోజు అనుకొన్న వాటిలో ఏవి అయ్యాయి... ఏవి కాలేదో సమీక్షిస్తున్నారు. ఆ తర్వాత ముఖ్య శాఖల అధికారులతో సమావేశమై సహాయ చర్యలు, కేంద్రానికి పంపాల్సిన నివేదికలు, క్షేత్రస్థాయిలో నష్టంపై చేపట్టాల్సిన సర్వే, బాధితుల కోసం తెప్పించాల్సిన సరుకులు, వాహనాలు తదితర అంశాలను సమీక్షిస్తున్నారు. అక్కడినుంచి ఆయన క్షేత్ర స్థాయి పర్యటన మొదలవుతుంది. తిరిగి వచ్చిన తర్వాత అధికారులతో సమావేశమవుతారు. వినాయకచవితి పూజకోసం విడిగా ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా కలెక్టరేట్ ఆవరణలోనే ఒక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ముఖ్యమంత్రి రోజూ అక్కడే పూజలు చేస్తున్నారు. కనకదుర్గ గుడి అర్చకుల సహకారంతో పూజామందిరం నిర్వహిస్తున్నారు.




కలెక్టరేట్‌లోనే వినాయక పూజలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు



పూజలందుకుంటున్న బెల్లం గణపతి

విశాఖపట్నం, సెప్టెంబరు 8: విశాఖ నగరంలోని గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలో లంబోదర ట్రస్టు ఆధ్వర్యంలో 75 అడుగుల బెల్లం వినాయకుడు పూజలందుకుంటున్నారు. రాజస్థాన్ నుంచి తెప్పించిన 20 టన్నుల బెల్లంతో ఈ భారీ గణనాథుడిని ఏర్పాటు చేశారు. వినాయక చవితిని పురస్కరించుకుని శనివారం ఉదయం విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు తొలిపూజ చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బెల్లం గణపతిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.





ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.కోటి చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విఘ్నేశ్వరుడికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూజలు

మంగళగిరి, సెప్టెంబరు 8: మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మట్టితో తయారుచేసిన గణపతి విగ్రహానికి జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నాలు లేకుండా రాష్ట్ర అభివృద్ధికి భగవంతుడి ఆశీస్సులు ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు పిడుగు హరిప్రసాద్, పార్టీ కార్యక్రమాల నిర్వహణా కమిటీ కన్వీనర్ కల్యాణం శివశ్రీనివాస్, చేనేత వికాస విభాగం ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆఫీస్‌లో అట్టహాసంగా చవితి వేడుకలు

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో వినాయకచవితి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పార్టీ కార్యాలయం ముందు గణనాథుడి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, పార్టీ నేతలు వినాయక వ్రతాన్ని నిర్వహించారు.



ధ్వజారోహణంలో భాగంగా మూషిక ధ్వజ పటాన్ని ఎగురవేస్తున్న అర్చకులు

కాణిపాకంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 8: చిత్తూరు జిల్లా కాణిపాకంలో వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం ధ్వజారోహణంలో భాగంగా మూషిక ధ్వజపటాన్ని ఎగురవేశారు. ఇక్కడి బ్రహ్మోత్సవాలను కామికా ఆవాహన పద్ధతిలో నిర్వహిస్తారు. రాత్రి హంస వాహనంపై ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, అగరంపల్లె, కారకాంపల్లె, వడ్రాంపల్లె, తిరువణంపల్లె గ్రామాలకు చెందిన శ్రీకరుణీక వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు.

వినాయక మండపాలకు పైసా కూడా చెల్లించనక్కరలేదు

- పది రోజుల క్రితమే ఆదేశాలు జారీ చేశాం
- నా పాత వీడియోతో వైసీపీ దుష్ప్రచారం
- గత ప్రభుత్వంలో మండపాల ఏర్పాటుకు ఐదు శాఖల అనుమతి
- ఈ ఇబ్బంది లేకుండా ప్రస్తుతం సింగిల్ విండో విధానం
- మైక్ పర్మిషన్‌కు రూ.100 చలానానూ తొలగించాం: హోం మంత్రి అనిత



అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వినాయక మండపాల ఏర్పాటుకు సంబంధించి అనుమతుల కోసం ప్రభుత్వానికి పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. పది రోజుల క్రితమే దీనిపై నిర్ణయం తీసుకొని అన్ని ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు కూడా జారీ చేశామని, ప్రభుత్వపరమైన అనుమతుల కోసం ఏ శాఖ కూడా ఎవరి నుంచీ డబ్బులు వసూలు చేయబోదని ఆమె తెలిపారు. ఆదివారం విజయవాడలోని కలెక్టరేట్ ప్రాంగణంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. విగ్రహాల ఎత్తునుబట్టి అనుమతుల కోసం చెల్లింపులు చేయాలని ఆమె గతంలో చెప్పిన విషయాన్ని వైసీపీ నేతలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడాన్ని ప్రస్తావించగా తీవ్రంగా స్పందించారు. 'విగ్రహాల ఎత్తును బట్టి అనుమతుల కోసం డబ్బులు వసూలు చేయాలని వైసీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకొని 2022లో ఆదేశాలు జారీ చేసింది. వినాయక మండపాల ఏర్పాటు కోసం గతంలో విడివిడిగా ఐదు శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి వచ్చేది. ఈ శ్రమ తగ్గించడం కోసం మా ప్రభుత్వం సింగిల్ విండో విధానం తీసుకువచ్చింది. ఒక చోట దరఖాస్తు చేస్తే అన్ని అనుమతులు ఒకేచోట ఇచ్చేలా కొత్త విధానం తీసుకువచ్చాం. ఆ సందర్భంలో అధికారులు పాత జీవోను నాకు ఇస్తే నేను అందులో ఉన్న రేట్లను చదివాను. ఇది జరిగి ఇరవై రోజులైంది. తర్వాత ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి వచ్చింది. మండపాలకు ఎలాంటి చార్జీలు వసూలు చేయవద్దని ఆయన నిర్ణయం తీసుకొన్నారు. ఈసారి ఏ మండపం నుంచి చార్జీలు వసూలు చేయడం లేదు. మైక్ పర్మిషన్‌కు రూ.100 చలానా కట్టే పద్ధతి గతం నుంచి ఉంది. ప్రస్తుతం దానిని కూడా తీసివేశాం. అయినా వైసీపీ నేతలు ఇంకా ఆ చార్జీల వసూలు జరుగుతున్నట్టుగా పాత వీడియోతో ప్రచారం చేస్తున్నారు' అని అనిత చెప్పారు.

కొనసాగుతున్న ఆహారం పంపిణీ

విజయవాడ నగరంలో కొన్ని ప్రాంతాల్లో ముంపు తగ్గకపోవడంతో బాధితులకు ఆహారం పంపిణీ కొనసాగిస్తున్నట్లు మంత్రి తెలిపారు. 'ఆదివారం ఉదయం మూడు లక్షల అల్పాహార ప్యాకెట్లు, 1.6 లక్షల మంచినీళ్ల బాటిళ్లు, 1.8 లక్షల పాల ప్యాకెట్లు, 1.5 లక్షల బిస్కట్ ప్యాకెట్లు పంపిణీ చేశాం. భోజనం ఎవరు కావాలని అడిగినా పంపిస్తున్నాం. సోమవారం నుంచి నష్టం సర్వే ఇంటింటా జరుగుతుంది. దాని తర్వాత పరిహారంపై ప్రభుత్వ ప్రకటన ఉంటుంది' అని అనిత వివరించారు.

బెంగుళూరులో కూర్చుని బురద చల్లుతున్న జగన్

వరద బాధితులకు సొంతంగా ఒక పులిహోర ప్యాకెట్ కూడా ఇవ్వని జగన్ బెంగుళూరులో కూర్చుని రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతి రోజూ బురద చల్లుతున్నారని అనిత విమర్శించారు. ఆయన విజయవాడ వచ్చి రెండు రోజుల్లో పదేసి నిమిషాలు బాధితుల వద్ద గడిపారన్నారు. ద్వేషంతో రగిలిపోతూ తన పత్రిక, టీవీలో దుష్ప్రచారం చేయిస్తున్నారని తెలిపారు.

బాబు అరెస్టుకు ఏడాది

(మొదటి పేజీ తరువాయి)

జరిగాయన్న అభియోగంతో నాటి వైసీపీ ప్రభుత్వం ఆయనను అరెస్టు చేయించింది. జైల్లో ఆయనకు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. ఆయన గదిలో ఏసీ పెట్టడానికి కూడా ఆయన పార్టీకి చెందిన నేతలు పెద్ద పోరాటం చేయాల్సి వచ్చింది. ఆరోగ్య కారణాలకుతోడు ఈ కేసులో బలమైన సాక్ష్యాలు చూపలేకపోయారన్న అభిప్రాయంతో హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. చంద్రబాబు తన రాజకీయ జీవితంలో జైలువాసం గడపడం ఇదే ప్రథమం. రాజకీయ వైరుధ్యాలు ఎన్ని ఉన్నా గతంలోని ఆయన ప్రత్యర్థి ప్రభుత్వాలు ఆయనను అరెస్టు చేసే సాహసం చేయలేకపోయాయి. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆ దిశగా అడుగులు వేయడం ఆ తర్వాత ఎన్నికల్లో ఆయన పార్టీ ఘోర పరాజయానికి బాటలు వేసింది. అప్పటికే పతన దిశలో ఉన్న వైసీపీ మరింత వేగంగా పతనమై అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం పదకొండు సీట్లకు పరిమితమైంది. ఆ పార్టీ అధినేత జగన్‌కు అసెంబ్లీలో విపక్ష నేతహోదా కూడా లభించలేదు. ఈ పరిణామాలన్నింటి వెనుక చంద్రబాబు అరెస్టు కీలక పాత్ర పోషించిందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

టీడీపీ దూకుడుకు దడిచి..

లోకేశ్ పాదయాత్ర, చంద్రబాబు ప్రాజెక్టుల యాత్ర వంటి కార్యక్రమాలతో నాడు టీడీపీ దూసుకుపోయింది. ఈ దూకుడును తగ్గించడానికి చంద్రబాబు అరెస్టు ఉపకరిస్తుందని వైసీపీ నాయకత్వం ఆలోచన చేసింది. కానీ తుది ఫలితం వేరుగా వచ్చింది. ఈ అరెస్టు జన సామాన్యంలో చంద్రబాబు పట్ల సానుభూతి పెల్లుబుకడానికి దారితీసింది. ఆయన జైలు నుంచి విడుదలైన రోజు రోడ్డు మార్గంలో విజయవాడకు వస్తుండగా, స్వాగతం పలకడానికి దారి పొడవునా ప్రజలు వేల సంఖ్యలో ఎదురుచూశారు. విజయవాడ నగరంలో తెల్లవారుజామున చలిలో కూడా మహిళలు, యువత ఆయనకు ఎదురేగి స్వాగతం పలికారు. ఆయన అరెస్టుకు తెలంగాణ, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాల్లో కూడా భారీగా నిరసనలు వ్యక్తమయ్యాయి. హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శనలను అడ్డుకోవడానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రయత్నం, ఆ తర్వాత అక్కడ జరిగిన ఎన్నికల్లో టీడీపీ సానుభూతిపరులు మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకడానికి దారితీసింది. దీంతో బీఆర్ఎస్ ఓటమి చవిచూసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు స్థిరపడ్డ అన్ని దేశాల్లో కూడా చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ప్రదర్శనలు జరిగాయి. ఒక్క అమెరికాలోనే ఎనభై నగరాల్లో ప్రదర్శనలు జరిగాయని అంచనా. ఏభైకు పైగా దేశాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయని టీడీపీ ప్రవాసాంధ్ర విభాగం నమోదు చేసింది.

జైలులోనే పొడిచిన పొత్తు...

చంద్రబాబు అరెస్టు అనేక రాజకీయ పరిణామాలకు దారితీసింది. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరం జైల్లో చంద్రబాబు పరామర్శకు వెళ్లి... తాము, టీడీపీ కలిసి పోటీ చేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత బీజేపీ కూడా ఈ పార్టీలతో చేతులు కలపడంతో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఏర్పడింది. బీజేపీ తటస్థంగా ఉంటుందని ఆశించిన వైసీపీకి ఆశాభంగం మిగిలింది. అరెస్టు జరిగిన ఏడాది తర్వాత చూస్తే... చంద్రబాబు జనంలో ఉన్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి కోర్టు చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. విజయవాడను వరద ముంచెత్తడంతో చంద్రబాబు తాత్కాలికంగా తన కార్యక్షేత్రాన్ని విజయవాడకు మార్చుకొని పనిచేస్తున్నారు. ముంపు ప్రాంతాల్లో తిరుగుతూ నిత్యం జనంలో ఉంటున్నారు. విదేశాలకు వెళ్లాలని అనుకొన్న జగన్‌కు కోర్టు నుంచి అనుమతులు రాకపోవడంతో, ఆ ప్రయత్నాల్లో ఆయన ఉన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు డిప్లొమాటిక్ పాస్‌పోర్టు ఉంటుంది. దిగిపోయిన తర్వాత దానిని వెనక్కు ఇచ్చేయాల్సి ఉంటుంది. సాధారణ పాస్‌పోర్టు కొత్తగా ఆయనకు ఐదేళ్ల కాల వ్యవధికి ఇవ్వాలని కింది సీబీఐ కోర్టు ఆదేశించింది. దానిని ఏడాదికి మాత్రమే మంజూరు చేస్తూ విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు ఇచ్చిన ఆదేశాలపై జగన్ హైకోర్టుకు వెళ్లారు. ఈ నెల మూడో తేదీనే లండన్ వెళ్లాలని అనుకొన్న ఆయన.. కోర్టు వ్యవహారం తేలకపోవడంతో ఎదురుచూపుల్లో ఉన్నారు.

అదుపు తప్పి కాల్వలోకి ఆర్టీసీ బస్సు

- వంతెనకు, చెట్టుకు మధ్య ఊగిసలాట
- ప్రమాద సమయంలో 25 మంది ప్రయాణికులు
- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం.. ఆరుగురికి తీవ్రగాయాలు
- గమనించి కాపాడిన టీడీపీ శ్రేణులు
- అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో ఘటన



వంతెనపై నుంచి కిందకు వేలాడుతున్న ఆర్టీసీ బస్సు, బస్సులో నుంచి ప్రయాణికులను బయటకు తీసుకువస్తున్న టీడీపీ కార్యకర్తలు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 8: అల్లూరి సీతారామ రాజు జిల్లా రాజవొమ్మంగి మండలం చెరుకుంపాలెం పంచాయతీ పరిధి బోర్నగూడెం గ్రామశివారులో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి వంతెనపై నుంచి కిందకి పడిపోయి ఓ చెట్టును ఆనుకుని ఆగింది. ఆ కింద ఉన్న కాలవ వర్షాల కారణంగా ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. ఆ సమయంలో బస్సులో 25 మంది ప్రయాణిస్తున్నారు. ఒకవేళ ఆ చెట్టు ఆపకపోతే పెనుప్రమాదమే సంభవించేది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి అనకాపల్లి జిల్లా నర్సీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆదివారం ఉదయం 11.30 గంటలకు అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం చెరుకుంపాలెం పంచాయతీ బోర్నగూడెం గ్రామశివారులో కాలవపై ఉన్న బ్రిడ్జి వద్ద అదుపు తప్పి కాలువలోకి దూసుకువెళ్లింది. పక్కనే ఒక చెట్టుకు బస్సు ఆనుకుని కిందకు వేలాడుతూ ఉండడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో ఏడుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. అదే సమయంలో టీడీపీ రాజవొమ్మంగి మండల అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దంతులూరి శివరామచంద్రరాజు, అరకు మాజీ ఎమ్మెల్యే దొన్ను దొర, టీడీపీ కార్యకర్తలతో కలిసి ఓ కార్యక్రమానికి వెళ్తున్నారు. బస్సు పడిపోవడం గమనించి వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. టీడీపీ కార్యకర్తలు మరిశెట్ల శ్రీను, చెక్క లోవరాజు, అదేపల్లి శివ, పెద్దాడ నూకరాజు ప్రమాదకర పరిస్థితిల్లో కూడా బస్సులోకి వెళ్లి ప్రయాణికులను వెనుకనున్న కిటికీల్లోంచి బయటకు తీశారు. వారిని ఆటోల్లో సమీపంలోని జడ్డంగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన ఆరుగురిని మెరుగైన వైద్యంకోసం రాజమహేంద్రవరం, ఏలేశ్వరం, నర్సీపట్నం ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. బ్రేకులు ఫెయిలవడంతో బస్సు అదుపు తప్పిందని డ్రైవర్ తెలిపాడు. కాగా ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు చెప్పారు.



వాణిని లోపలకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

దువ్వాడ ఫ్యామిలీ డ్రామాలో మరో రచ్చ

టెక్కలి, సెప్టెంబరు 8: వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఫ్యామిలీ డ్రామా మరోసారి రచ్చయింది. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం అక్కవరం సమీపంలోని దువ్వాడ నివాసంలో ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న దివ్వల మాధురి శనివారం ఉదయం కనిపించడం ఉద్రిక్తతకు దారితీసింది. తమకు కోర్టు ఆర్డర్ ఉందంటూ వాణి, ఆమె కుమార్తెలు కూడా ఆ ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కోర్టు ద్వారా ఆర్డర్ వస్తే తప్ప ఇంటి లోపలకు పంపలేమని స్పష్టంచేశారు. రాత్రి వరకూ ఈ హైడ్రామా కొనసాగింది. వాణి నిచ్చెన తెచ్చి పైకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు మరోసారి అడ్డుకున్నారు. దీంతో అక్కడున్న సీసీ కెమెరాలను వాణి ధ్వంసం చేశారు. పై అంతస్తులో ఉన్న మాధురి ఈ తతంగాన్ని వీడియో తీశారు. ఈ క్రమంలో మాధురి, వాణి మధ్య మాటల యుద్ధం సాగింది. మాధురిని ఆ ఇంటి నుంచి బయటకు పంపాలని వాణి, ఆమె కుమార్తెలు డిమాండ్ చేశారు. అయితే ఎమ్మెల్సీ దువ్వాడ కాశీబుగ్గ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆ ఇంటిని మాధురి పేరున రిజిస్టర్ చేశారు. దీంతో ఈ ఇల్లు తనదేనని, లోపలకు ఎవరు వచ్చినా ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ వ్యవహారంలో నెల రోజులుగా న్యాయపోరాట దీక్ష చేస్తున్న వాణి శనివారం అర్ధరాత్రి అక్కడి నుంచి.. సొంతింటికి వెళ్లిపోయారు. ఇదిలాఉండగా హైకోర్టు న్యాయవాది ఆజాద్‌తో కలిసి మాధురి దువ్వాడ నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నేరుగా శ్రీనివాస్‌తో ఫోన్ లైవ్‌లో మాట్లాడించారు. దువ్వాడ మాట్లాడుతూ 'ఈ ఇల్లు నా స్వార్జితం. నా రాజకీయ ఖర్చులకు, ఇంటి నిర్మాణానికి, ఇతరత్రా ఖర్చులకు మాధురి వద్ద నాలుగు విడతలుగా రూ.2 కోట్లు తీసుకున్నాను. ఇటీవల మరో రూ.50లక్షలు తీసుకున్నాను. చింతాడ పార్వతీశానికి రూ.60లక్షలు బాకీ ఉన్నాను. అందుకే ఈ ఇల్లు మాధురికి అమ్మేసి ఆమె పేరున రిజిస్ట్రేషన్ చేశాను' అని వెల్లడించారు. అక్కడే పార్టీ కార్యాలయం, పైన ఉండేందుకు ఓ గది ఏర్పాటు చేసుకున్నానని తెలిపారు. వాణికి ఈ ఇల్లు ఇస్తే తాను చెట్టుకింద ఉండాలా అని ఆయన ప్రశ్నించారు అందుకే మాధురికి బకాయిలు తీర్చేందుకు ఇల్లు ఆమె పేరున రిజిస్ట్రేషన్ చేశానని చెప్పారు. తన వ్యాపారాలన్నీ ప్రస్తుతం ఆగిపోయాయని, తన కారణంగా రోడ్డున పడిన మాధురికి అప్పు తీర్చేందుకు ఈ ఆస్తి రాసిచ్చినట్లు దువ్వాడ వెల్లడించారు. మాధురి మాట్లాడుతూ 'ఈ ప్రాపర్టీ నాది. నా అనుమతి లేకుండా ఎవరూ లోపలకు రాకూడదు. ఈ నివాసానికి రెండేళ్ల పాటు రాని వాణి ఇప్పుడెందుకు రావాలి. రాజకీయంగా శ్రీనివాస్‌ను పతనం చేయాలన్నదే వాణి కుతంత్రం' అని ఆరోపించారు. ఇటీవల దువ్వాడ శ్రీనివాస్, మాధురి ఫోన్‌కాల్ ఆడియో బహిర్గతమైన విషయంపై స్పందిస్తూ అది కల్పితమన్నారు. తన ఇంటిని దువ్వాడ కార్యాలయానికి అద్దెకు ఇస్తానని వివరించారు.

త్వరలో రాజమండ్రి-ఢిల్లీ విమాన సర్వీసులు

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడి

కోరుకొండ, రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 8: తూర్పుగోదావరి జిల్లా మధురపూడి విమానాశ్రయం నుంచి మరిన్ని పట్టణాలకు కనెక్టివిటీ సర్వీసులు ప్రారంభించనున్నట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఆదివారం మధురపూడికి విచ్చేసిన ఆయన విమానాశ్రయ విస్తరణ, కొత్త టెర్మినల్ భవనంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఢిల్లీ, తిరుపతి, వారాణసీ, షిరిడీ తదితర ప్రదేశాలకు మధురపూడి నుంచి కనెక్టివిటీ సర్వీసులు కలపాలని ప్రజలు కోరుతున్నారని చెప్పారు. త్వరలోనే ఢిల్లీకి కనెక్టివిటీ సర్వీసులు ప్రారంభించనున్నామని తెలిపారు.

నదికి, కాలువకు తేడా తెలియని వ్యక్తి జగన్

నదికి, కాలువకు తేడా తెలియని వ్యక్తి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో మాట్లాడుతూ విజయవాడ ముంపు విషయంలో వైసీపీ ఫేక్ ప్రాపగండా చేస్తోందని మండిపడ్డారు. బుడమేరులో గేట్లు ఎత్తేశారని చెప్పారని, అవి ఎక్కడున్నాయో జగన్ చూపించాలని సవాల్ విసిరారు.

పీసీసీకి కొత్త కార్యవర్గం

13 మంది ఉపాధ్యక్షులు, 37 మంది ప్రధాన కార్యదర్శులు

ఎల్లుండి పీసీసీ విస్తృత భేటీ: షర్మిల

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ కాంగ్రెస్ కమిటీకి ఏఐసీసీ కొత్త కార్యవర్గాన్ని ప్రకటించింది. భారీ సంఖ్యలో 13 మంది ఉపాధ్యక్షులను, ఏకంగా 37 మంది ప్రధాన కార్యదర్శులను నియమించింది. 25 జిల్లాలకు, 10 నగరాలకు కొత్త సారథులను ఖరారుచేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం ఈ మేరకు ప్రకటన చేశారు. నూతన పీసీసీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం(11న) విజయవాడలో జరుగుతుందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటించారు. ఈ భేటీలో పార్టీ బలోపేతంపై చర్చిస్తామని వెల్లడించారు.

ఉపాధ్యక్షులు వీరే..

కోట సత్యనారాయణ, వలిబోయిన గురునాథం, శ్రీపతి ప్రకాశం, కె.వేణుగోపాల్‌రెడ్డి, ఎం.సూర్యనాయక్, ఉడతా వెంకటరావు యాదవ్, కొరివి వినయకుమార్, మట్టా వెంకటశివప్రసాద్, కొలనుకొండ శివాజీ, ఎస్.మార్టిన్ లూథర్, కొత్తూరి శ్రీనివాస్, వేగి వెంకటేశ్, డి.రాంభూపాల్‌రెడ్డి.

చరిత్ర నిద్రా సముద్రంపై మహాస్వప్నం!



మహాస్వప్న తెలుగు కవిత్వం పైన వేసిన ముద్ర సామాన్యమైనది కాదు. దిగంబర కవిత్వ సంకలనాలలో అతను రాసిన కవితలు ఆరంటే ఆరే! ఆ ఆరు కవితలతోనే కవిగా చిరస్థాయి నందుకున్నాడు. ఒక లేబిల్‌కో బ్రాండ్‌కో కట్టుబడే కవిత్వం కాదు అతడి కవిత్వం. మహాస్వప్నని ఏ ఇతర కవి తోనూ పోల్చలేం. పదునైన వాక్యాలూ, అంతే తీవ్రమైన భావజాలం అతడి కవిత్వంలో కానవచ్చే సాధారణ లేదా విశిష్ట గుణం!

దిగంబర కవిగా రూపు దాల్చకముందు అతడి నామధేయం కమ్మిశెట్టి వేంకటేశ్వరరావు. ఆ పేరు తోనే అతడి ఏకైక కవితాసంపుటి 'అగ్ని శిఖలు – మంచు జడులు' వెలువడింది. ఆ తర్వాత దిగంబర కవిగా రూపాంతరం చెందాడు. 'దిక్'లుగా పిలువబడిన ఆ కవితలతో మహాస్వప్న మహోన్నత శిఖరమై నిలిచాడు. మహాస్వప్న 'అగ్ని శిఖలు – మంచు జడులు', దిగంబర కవితలకి మధ్య 'రాత్రి' కవితా సంకలనం లోని అతని కవితలు దిగంబర కవిత్వానికి పూర్వ రంగంగా నిలుస్తాయి. ఇదే సూత్రీకరణ నగ్నముని అనబడు మానేపల్లి హృషి కేశవరావుకి కూడా వర్తిస్తుంది. దిగంబర కవిత్వానికి కథానాయకుడూ, 'రాత్రి' కవితా సంకలనానికి కర్త, కర్మ, క్రియ నగ్నమునే!

కమ్యూనిస్ట్ మానిఫెస్టోని శ్రీశ్రీ ఎలాగైతే కవిత్వంగా మలిచాడో అలాగే మహాస్వప్న కూడా దిగంబర కవిత్వం ఎజెండాని అద్భుతమైన కవితగా మలిచాడు. ఆ కవిత శీర్షిక 'గ్లానిర్భవతి భారత'. ఆ కవితలో "మానవత రెండు కళ్ళు మూసుకపోయినప్పుడు/ విప్పుకుంటున్న మూడో కన్నునై/ కాలం వాయులీనం మీద కమానునై/ చరిత్ర నిద్రా సముద్రం మీద తుఫానునై/ నేను వస్తున్నాను దిగంబర కవిని/ రాత్రి ఉదయిస్తున్న రవిని" ... "రక్త ధునులు గడ్డకట్టి/ జీవనదులింకి/ మానవత మసిపాతలా మారిపోయినప్పుడు/ మాసిపోయినప్పుడు/ నేను వస్తున్నాను దిగంబర కవిని/ స్తంభించిన కవితా స్తంభం బ్రద్దలై పుట్టుకొస్తున్న ఉగ్రనగ్న నరకేసరిని" – అంటూ దిగంబర కవి రాకడ సమయాన్నీ, సందర్భాన్నీ, దిగంబర కవిత్వం పోకడనీ స్పష్టం చేశాడు మహాస్వప్న.

దిగంబర కవిత్వ ఆవిర్భావ సన్నివేశాన్ని స్మరించినప్పుడు యూరప్‌లో జెనీవా కేంద్రంగా 1916, 1923 ప్రాంతాల్లో పరిఢవిల్లిన 'డాడాయిజం' గుర్తుకు రాక మానదు. మొదటి ప్రపంచ యుద్ధ పర్యవసానంగా అన్ని విలువల్నీ, సంస్కారాల్నీ, సభ్యతల్నీ తిరస్కరిస్తూ వెల్లువెత్తిన ఉద్యమం అది. హ్యూగో బాల్ దాన్ని ముందుండి నడిపించాడు. ఒక్క కవిత్వం లోనే కాకుండా చిత్రకళ, సంగీతం లాంటి ఇతర కళల్ని కూడా డాడాయిజం ప్రభావితం చేసింది. డాడాయిస్టులు వాళ్ళ కవితల్ని 'డాడా' అన్నారు. మన దిగంబరులు 'దిక్'లన్నారు! అక్కడ హ్యూగో బాల్ నిర్వహించిన పాత్రని ఇక్కడ నగ్నముని నిర్వహించాడు.

1960వ దశకం రాజకీయ భ్రష్టత్వం, విలువల పతనం, అరాచకత్వం నిస్సిగ్గుగా బట్టబయలైన సంధికాలం! తక్షణ చర్యగా దిగంబర కవిత్వం తెలుగునాట మొదలైంది. ఆ పరిణామ క్రమంలో నగ్నముని, మహాస్వప్న లాంటి గొప్ప కవులు ఆవిర్భవించారు. దిగంబర కవిత్వం ఒక చారిత్రక సందర్భమే కాదు. చారిత్రక అవసరం కూడా. దిగంబర కవిత్వం కూడా డాడాయిజం మాదిరి కుళ్ళిన సమాజానికి షాక్ ట్రీట్మెంట్‌గా మొదలైన కవిత్వోద్యమమే! విరసం పుట్టుకకి బీజం పడింది కూడా దిగంబర కవిత్వం తోనే!

వేళ్ళ మీద లెక్కబెట్టగలిగినన్ని కవితలే రాసి వుంటే ఉండొచ్చు గాక! తదనంతర కాలంలో తన ఆకాంక్షలూ ఆశయాలూ కేవలం భ్రమలుగా తేలిపోయాయని, తానొక భగ్నస్వప్నమై మిగిలానని అతడు పశ్చాతాప్త పడితే పడి ఉండొచ్చు గాక! బ్రతుకు వృథా, కవిత్వం వృథా అనే వ్యాకులతకి లోనై అజ్ఞాతాన్ని వరిస్తే వరించి ఉండొచ్చు గాక! – ఐనా కూడా, దిగంబర కవుల్లోనే కాదు, ఏ ఇతర కవి సమూహాలలోనైనా, అప్పుడైనా ఇప్పుడైనా ఎన్నదగిన ప్రథమ శ్రేణి కవి మహాస్వప్న!

'నట సామ్రాట్' అనే కవితలో తనని తాను ఇలా పరిచయం చేసుకుంటాడు మహాస్వప్న: "పాతికేళ్ల నాడు ఈ కల/ కళ్ళు తెరచింది నెల్లూరు జిల్లా లింగసముద్రంలో/ కావలి, హైదరాబాద్ లోని ఆకాశాన్ని, భూమినీ చదువుకున్నాడు. .... ఈ ప్రపంచం వేసుకున్న ముసుగుని చీల్చడానికే పుట్టానంటాడు." అదే కవితలో ఇంకా యిలా అంటాడు– "మహాశయా/ తెల్లగా తెల్లవారింది/ నాటకానికి తెర జారింది/ ప్రపంచంలా పరచుకున్న/ జీవితం మీద/ నగ్న సూర్యోదయమైంది/ నీ పాత్ర చిలుం పట్టింది తోముకో నిజం లాగా/ ధ్వజం లాగా నిటారుగా లే/ భయం వీడి నగ్నంగా బజార్లోకి రా!" అని.

మహాస్వప్నది తనదైన విస్పష్ట గళం. తన కాలం కంటే ముందు నడిచాడు. 2024ల నాటి ఆధునిక కవిత్వాన్ని 1960 ల్లోనే వినిపించిన ద్రష్ట మహాస్వప్న! 'హటాత్తుగా బట్టలన్నీ విప్పేసి' అనే కవితలో ఇలా అంటాడు: "ట్రాఫిక్ బంద్/ సందులు గొందులకి జ్వరాలు/ బజార్లు బజార్లకే మూర్ఛలు/ అంతా నిశ్శబ్దం/ నా దగ్గిరకొకడైనా రాడు/ నేనంటే నగరానికి మహాభయం/ నాకు తెలుసు మీరు నన్ను చూళ్ళేరని/ నాకు తెలుసు మీరు నన్ను వినలేరని."

గాంధీ మహాత్ముడిని స్మరిస్తూ, 'మేం మనుషులం కాదు ఇంకేదో పేరుంది మాకు' అనే కవితలో తన ఆగ్రహాన్ని ఇలా ప్రకటిస్తున్నాడు: "దగాలు వంచనలు కుహనాసత్యాలు/ జరా రుజా దురాక్రమణలో నిజరూపాల్ని కోల్పోయిన మానవజాతి/ వినిపించే నాగరికతా సిఫిలిస్సంగీతం/ ఎంత భ్రమపడ్డావ్ మా దుస్తుల్ని చూసి/ ఎంత శ్రమపడ్డావ్ మమ్మల్ని నమ్మి/ మేం మనుషులం కాదు ఇంకేదో పేరుంది మాకు/ ఇన్ని కోట్ల గాడ్సేల ఘాతుక హస్త్రాల నడుమ/ నలువైపుల హోరుమని విరుచుకు పడుతున్న చీకటి సముద్రాల నడుమ/ నిశ్చలంగా వెలిగే నీ చిరునవ్వు... / బాపూ, మోసపోలేదు కదా నువ్వు."

మానవుడి అస్తిత్వ వేదనని అతడు పలికించిన తీరు అబ్బురపరుస్తుంది. తప్పిపోయిన మనిషి ఆత్మ హాహాకారాన్ని 'ఆపండి ఆర్కెస్ట్రాని – ఆర్పండి కాగాడాల్ని' అనే కవితలో పతాక స్థాయికి చేరిన ఫ్రీక్వెన్సీలో వినిపించాడు: "నేను పుట్టకముందే/ మిట్ట మధ్యాహ్నం మండుటెండలో/ మార్కెట్లో పెట్టి అమ్మారు శిరాన్ని ఖండించి/... .../ నిర్జీవంగా/ నిస్సహాయంగా/ వొరిగిపోయాను ఈ ఫుట్‌పాత్ మీద/ ఆపండి ఆర్కెస్ట్రాని/ ఆర్పండి కాగడాల్ని!// ఇంక మోయలేను ఈ దేవుళ్ళనీ ఉద్గ్రంథాల్నీ/ ఇంక మోయలేను ఈ జైళ్ళనీ సంకెళ్ళనీ శాసనాల్నీ/ ఇంక మోయలేను ఈ యుద్ధాల్నీ బీటలెత్తిన చరిత్రనీ/... .../ చెప్పు/ ఇప్పుడైనా నిజం చెప్పు/ పోనీ దయుంచి/ ఈ దిక్కుమాలిన శవం మీద ఆకాశాన్ని కప్పు" అంటూ! అలాగే, 'మురిగిన సూర్యుణ్ణి నంజుకుంటూ మృత్యువుని కాస్త కాస్తగా కొరుక్కుతిన్నాను' కవితలో ఆధునిక మానవ జీవన బీభత్సాన్ని, భయద జీవన మృత్యు సంగీతాన్ని విరచించాడు మహాస్వప్న. "వెన్నెల మీద వుమ్మేసి చంద్రుణ్ణి నక్షత్రాల్నీ/ గ్రహాల్నీ రాళ్ళతో కొట్టాను/ భూగోళాన్ని శిశ్నశిఖరాగ్రం మీద నిలబెట్టాను/ చెట్ల గుబురుల్లో గూబలా తీతువులా కీచురాయిలా/ గీ పెట్టి భయపెట్టింది నేనే/ పాతాళవాణిలో భూతాలు పాడిన గీతాల్ని ప్రసారం చేసింది నేనే/ భగ భగ మంటల్లో నగరం తగలబడి పోతున్నట్టు/ నిర్వికల్ప సమాధిలో నిదర్శించి నిర్వాణానందంలో తాండవం చేసింది నేనే" అంటాడు.

వేళ్ళ మీద లెక్కబెట్టగలిగినన్ని కవితలే రాసి వుంటే ఉండొచ్చు గాక! తదనంతర కాలంలో తన ఆకాంక్షలూ ఆశయాలూ కేవలం భ్రమలుగా తేలిపోయాయని, తానొక భగ్నస్వప్నమై మిగిలానని అతడు పశ్చాతాప్త పడితే పడి ఉండొచ్చు గాక! బ్రతుకు వృథా, కవిత్వం వృథా అనే వ్యాకులతకి లోనై అజ్ఞాతాన్ని వరిస్తే వరించి ఉండొచ్చు గాక! – ఐనా కూడా, దిగంబర కవుల్లోనే కాదు, ఏ ఇతర కవి సమూహాలలోనైనా, అప్పుడైనా ఇప్పుడైనా ఎన్నదగిన ప్రథమ శ్రేణి కవి మహాస్వప్న!

■ రవూఫ్

raoufpoettelugu@gmail.com

సోమవారం 9 సెప్టెంబరు 2024

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

కాళోజీ జయంతి వేడుక

పద్మవిభూషణ్ కాళోజీ 110 జయంతి వేడుకలు తెలంగాణ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9 ఉదయం 10.30 గంటలకు రవీంద్ర భారతి మినీ కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్‌లో జరుగుతాయి. సభాధ్యక్షులు నామోజు బాలాచారి; ముఖ్య అతిథి ఎ. వాణీప్రసాద్; విశిష్ట అతిథి అలేఖ్య పుంజాల, గౌరవ అతిథి తిప్పర్తి యాదయ్య; ఆత్మీయ అతిథి బైసా దేవదాసు. 'కాళోజీ జీవితం – రచనలు' అంశంపై జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ నల్లగుంట్ల యాదగిరి రావు ప్రధాన ప్రసంగం చేస్తారు. కవి సమ్మేళనం ఉంటుంది.

సోమశిల తిరుపాల్

'కరీంనగర్ కథలు' పరిచయ సభ

రంగినేని సుజాతా మోహన్ రావు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, సిరిసిల్ల ఆధ్వర్యంలో 'కరీంనగర్ కథలు' పుస్తక పరిచయ సభ సెప్టెంబర్ 14 ఉదయం 10.30 నిమిషాలకు రంగినేని ట్రస్ట్, కరీంనగర్ రోడ్, సిరిసిల్లలో జరుగుతుంది. సభాధ్యక్షులు రంగినేని మోహన్ నావు; ముఖ్య అతిథి సి. మృణాళిని; విశిష్ట అతిథి అల్లం రాజయ్య; వక్త సి. కాశీం. కథా సంకలనం ప్రస్తావన నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం. వివరాలకు: 92906 87853.

రంగినేని నవీన్ కుమార్

గూడురు సీతారాం కథా పురస్కారం

మానేరు రచయితల సంఘం, గూడూరి సీతారాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గూడూరి సీతారాం కథా పురస్కారం 2023 ప్రదాన సభ సెప్టెంబర్ 14 సాయంత్రం 4 గంటలకు డా. సినారె విజ్ఞాన మందిరం, జిల్లా గ్రంథాలయం, సిరిసిల్లలో జరుగుతుంది. సూర్యా ధనంజయ్ 'ఝాళి' గోర్ బంజారా సాకి, పిన్నంశెట్టి కిషన్ 'మా లేంబాళవాటిక కథలు' పుస్తకాలకు రచయితలు పురస్కారం స్వీకరిస్తారు. సభాధ్యక్షులు టి.వి. నారాయణ; ముఖ్య అతిథులు నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం; పురస్కార ప్రదాత గూడూరి వేణు.

గూడురి ప్రవీణ్

వర్గీకరణ సంఘీభావ కవిత్వం

ఎస్సీ ఎస్టీల్లో వెనకబడ్డ కులాలు, జాతులకు విద్య ఉద్యోగాల్లో ప్రాధాన్యతతో కూడిన పంపిణీ న్యాయం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారముందని సుప్రీమ్ కోర్టు ఇటీవల తీర్పులో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు సంఘీభావంగా వచన, పద్య కవితలను అక్టోబర్ 15లోగా చిరునామా: అడ్రస్: ప్లాట్ – 297, రోడ్ – 21, సెక్రటేరియట్ కాలనీ, సియుసి పోస్ట్, గచ్చిబౌలి, హైదరాబాద్ – 500046 కు పంపగోరుతున్నాం. వాట్సప్ నంబర్: 9441091305. ఈమెయిల్: joopakasubadra@gmail.com

జూపాక సుభద్ర

'కవిసంధ్య' నిర్వహణలో ఎక్కడా ప్రయాస లేదు, అంతా ఆనందమే!

శిఖామణి

మూడు ప్రశ్నలు



మీరు నిర్వహించే ద్వైమాసిక కవిత్వ పత్రిక 'కవిసంధ్య' యాభై సంచికల ప్రయాణాన్ని పూర్తి చేసుకుంది. ఈ పత్రిక పెట్టాలన్న ఆలోచన ఎలా వచ్చింది?

2014లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ విడిపోయింది. నేను 2015 డిసెంబర్‌లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి పదవీ విరమణ చేశాను. మీరన్నట్టు అప్పటికి రెండు దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌లో 'కవిసంధ్య' సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత కవిసంధ్య తన కార్యక్షేత్రాన్ని నా పుట్టిన ఊరైన యానాంకు మార్చుకుంది. యానాంలో కవిసంధ్య తొలి సాహిత్య కార్యక్రమంగా దుర్ముఖినామ ఉగాది ఉత్సవాలు నిర్వహించ తలపెట్టింది. ఈ సందర్భంగా 'కవిసంధ్య' పేరుతో ఒక కవిత్వ బులెటిన్ తెస్తే ఎలా వుంటుందనే పురుగు లాంటి ఆలోచన బుర్రలో కలిగింది. నా ఆలోచనను యానాం కవిమిత్రుల ముందుంచాను. అప్పటికి ఉగాది రెండు మూడు రోజులే వుంది. మా యానాం మిత్రులు పెద్దగా వుత్సాహం చూపకపోగా నిరుత్సాహ పరిచారు. ఒకటి రెండు రోజులకు మించి సమయంలేదు– పైగా నువ్వు హైదరాబాద్‌లో, కార్యక్రమం యానాంలో, ఇంతతక్కువ వ్యవధిలో బులెటిన్ సాధ్యం కాదని తేల్చేశారు. వారికి ఒక ఉపాయం చెప్పి ఆ విధంగా ముందుకు పొమ్మన్నాను. ఫలితంగా 2016 ఏప్రిల్ 8న దుర్ముఖి నామ ఉగాది వేడుకల సందర్భంగా 'కవిసంధ్య' ఏప్రిల్–మే ద్వైమాసిక సంచికగా యుగకర్త కందుకూరి వీరేశలింగం పంతులు ముఖ చిత్రంతో 16 పేజీల కవిత్వ పత్రికగా వెలువడింది. ఇంతకీ నేను చెప్పిన ఉపాయమల్లా "సమయం లేదంటున్నారు కనుక యానాం కవుల కవితలు తలా ఒకటి సేక రించండి, యానాం వచ్చాక మిగతా సంగతి నేను చూసుకుంటాను" అని అన్నాను. ఆ రకంగా మొదటి సంచిక యానాం కవుల సంచికగా వెలువడింది. ఉగాది మరుసటి రోజున ఆర్ట్స్ కాలేజీలో భాస్కర రెడ్డిగారి అధ్యక్షతన పత్రిక కొనసాగింపుపై సమావేశం జరిగింది. పత్రిక నిర్వహణపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. వాటి సారాంశం: రచనలు వస్తాయి – చందాలు రావు, పత్రిక అంటే ఒక కార్యాలయం, చిన్నపాటి సిబ్బంది అవసరం; మూలనిధి ఎలా? కొసమెరుపు: సంపాదకుడు హైదరాబాద్‌లో, పత్రికా నిర్వహణ యానాంలో అని సవాలక్ష సందేహాలు, ప్రశ్నలూ... అన్నిటికీ సర్దుబాటు సమాధానాలు చెప్పి, మొదటి మూడు సంచికలు నా ఖర్చుతో తెస్తాను, నాలుగో సంచిక నాటికి పరిస్థితి చూద్దాం అన్నాను. నాలుగో సంచిక ఖర్చు నేను భరిస్తాను అన్నాడు మధునాపంతుల. ఏమనుకున్నాడో ముమ్మిడి చిన్నారి జేబులోంచి అయిదు వందలనోటు తీసి అందిం చారు. తొలి, రెండు, మూడు సంచికలు యానాం ఎక్సల్ నెట్ సెంటర్‌లో మిత్రుడు సత్తిబాబుగారు లే అవుట్ చేశారు. ఇదీ కవిసంధ్య తొలి అడుగు. ఇప్పుడు 50వ మైలు రాయికి చేరింది.

ఒక కవి గారిని పత్రికకు రచన అడిగితే మీరు అడగవలసిన పద్ధతిలో అడగలేదంటాడు. మరొక కవి ఇన్ని సంచికల్లో నా రచన ఒక్కటీ అచ్చు కాలేదంటాడు, పత్రికలకు రచనలు పంపడం రచయితల బాధ్యత కాదా! సంపాదకులు బొట్టుపెట్టి అడగాలా? భారతి పత్రిక చలానికి తిప్పి పంపిన కథ, ఆయన భారతికి అడిగితే పంపింది కాదని మన కవులు, రచయితలు ఎప్పటికి గుర్తెరుగుతారో.

ఈ కాలంలో కవిత్వమే ప్రధానంగా పత్రిక నడపటం ఎలాంటి పని అని అడిగితే ఏం చెబుతారు?

ఇప్పుడు అన్ని పత్రికలూ కవితలకు చోటు తగ్గించే ధోరణితో ఉన్నాయి. దాంతో కవులకు స్పేస్ల కొనుక్కోవడం తప్పటం లేదు. కవిత్వానికి స్థల నిర్దేశం చేయడం పోలీసింగ్ లాంటిది. జీవితానికి మల్లే కవిత్వానికి పోలీసింగ్ మంచిది కాదు. గతంలో, వేకువ, కంజిర, సంతకాలు, జముకు, చైతన్య కవిత వంటి పత్రికలు వచ్చి ఆగిపోయాయి. 'కవితా!' పత్రిక కొనసాగుతుంది. అందుకే ఇప్పుడు కవిత్వానికి ఒక పత్రిక చాలా మంచి పని, అవసరమైన పని అని చెప్తాను.

సన్మాహక సభలో మిత్రులు అన్నట్టు రచనలు వచ్చినంతగా చందాలు రావన్నది అనుభవం మీద తెలిసింది. తొలి సంవత్సరంలో తిరుపతి సాహితీ మిత్రులు ఇచ్చిన ప్రోత్సాహం మరువ లేనిది. రచనలు అడిగినంత చనువుగా చందాలు, రెన్యువల్స్ కూడా అడగలేక పోయాను. ఒక కవి గారిని పత్రికకు రచన అడిగితే మీరు అడగవలసిన పద్ధతిలో అడగ లేదంటాడు. మరొక కవి ఇన్ని సంచికల్లో నా రచన ఒక్కటీ అచ్చు కాలేదంటాడు, పత్రికలకు రచనలు పంపడం రచయితల బాధ్యత కాదా! సంపాదకులు బొట్టుపెట్టి అడగాలా? భారతి పత్రిక చలానికి తిప్పి పంపిన కథ, ఆయన భారతికి అడిగితే పంపింది కాదని మన కవులు, రచయితలు ఎప్పటికి గుర్తెరుగుతారో.

ఇక ప్రయాస అంటారా... పత్రిక తయారీ హైదరాబాద్‌లో... ప్రింటింగ్ విజయవాడలో... పోస్టింగ్ యానాంలో... ఒక అరడజను మిత్రులు మా అన్నయ్య దుర్గా ప్రసాద్, మా మేనబావ ఆదినారాయణతో కలుపుకుని కవిసంధ్య ఆఫీసులో నేలమీద కూచుని పత్రికలను పోస్టింగ్‌కు సిద్ధంచేసేవాళ్ళం. అది ఒక కుటుంబ కార్యక్రమంలా సాగేది. ఒకసారి విజయవాడ నాగేంద్ర ప్రెస్‌లో కవిసంధ్య పత్రికల కట్టలు వున్న సంచిని ఎత్తబోతే నడుం కరుక్కుమంది. అది చూసి నాగేంద్ర ప్రెస్ పద్మగారు ఎందుకీ ప్రయాస, ఎక్కడి రేట్లు అక్కడే వుంటాయి. శుభ్రంగా హైదరాబాద్‌లో అచ్చేసి, అక్కడే పోస్ట్ చేసుకోమని హితవు పలికితే... ఇక అప్పట్నుండీ అన్నీ హైదరాబాద్‌లో... కరోనాలో అది అనివార్యం కూడా అయింది. నాకు కవిసంధ్య నిర్వహణ పత్రికలను మోయడం మా మనవడు విరాంశ్‌ను ఎత్తుకున్నంత సంతోషం. ఇది ఆనందమే కాని ప్రయాస కాదు. ఎందుకంటే ఇష్టమైన పని కష్టమనిపించదు కనక.



'కవి సంధ్య' మొదటి సంచిక



50వ సంచిక

ఈ యాభై సంచికల పనిలో మీరు మరిచిపోలేని జ్ఞాపకాలు, సన్నివేశాలు? పత్రిక భవిష్యత్తు గురించి మీ ఆలోచనలు?

చాలానే వున్నాయి. రెండు మూడు చెబుతాను. పత్రిక ప్రారంభించాక కొత్తలో ప్రముఖ రచయిత్రి, నా కవిత్వాభిమాని అబ్బూరి ఛాయాదేవిగారు పదివేల రూపాయలు చెక్కు పంపించారు. తీరాచూస్తే అది కవిసంధ్య పేరు మీద వుంది. అప్పటికి కవి సంధ్యకు ఇంకా బ్యాంకు అకౌంట్ తెరవలేదు. అదే విషయం ఆమెకు చెబితే నా పేరు మీద మరొక చెక్కు పంపారు. కవిసంధ్య పేరుమీద వున్న చెక్కును తిరిగి మీకు పంపిస్తాను అంటే, వద్దు అకౌంట్ తెరిచాక అది కూడా బ్యాంకులో వేసుకోండి అన్నారు ఛాయమ్మ గారు అమ్మ మనసుతో. పేర్లు చెప్పడానికి ఇష్టపడని అజ్ఞాత సౌజన్యమూర్తులు మరికొందరు కవిసంధ్యకు వున్నారు.

నాకు కవిగా పదుల సంఖ్యలో చిన్నా పెద్దా పురస్కారాలు వచ్చాయి. అయితే ప్రముఖ పద్యకవి అనుమాండ్ల భూమయ్యగారు ఇటీవల తామిచ్చే పద్యకవి సత్కార సభలో కవిసంధ్య పత్రికా సంపాదకుడిగా నన్ను సత్కరించడం కవిసంధ్యకు, సంపాదకుడిగా నాకు దక్కిన తొలి సత్కారం.

ఇక భవిష్యత్తు ఆలోచనలు అంటారా... కవిసంధ్య 50 సంచికలను మనసు ఫౌండేషన్ రాయుడుగారి సౌజన్యంతో డిజిటలైజేషన్ చేసి భవిష్యత్తరాలకోసం భద్రపరచాలనే ఆలోచన వుంది. ఆన్‌లైన్ పత్రికగా తెచ్చే ఆలోచన వుంది. వచన కవిత్వం త్వరలో వందేళ్ళు పూర్తి చేసుకోబోతున్న తరుణంలో 'వందేళ్ల వచన కవిత' పేరుతో ఒక బృహత్ సంకలనం తెచ్చే ఆలోచన వుంది. పత్రికలో ఇపుడున్న శీర్షికలతో పాటు కవుల కవిత్వానుభవాలు, మన అనువాదకులు, నచ్చిన పుస్తకం వంటి శీర్షికలు ప్రవేశపెట్టే ఆలోచన వుంది.

(సెప్టెంబరు 14న హైదరాబాద్ రవీంద్రభారతిలో 'కవిసంధ్య' యాభయ్యవ స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ)

✆ 98482 02526

పరిమితి లేని వసంతం



ముఖం మీదొక దిగులు అల
ఎండ పొడలా కదిలినప్పుడు
మెదడు తడితో కలిసినప్పుడు
ఉదాసీనత గోడనంటిన నీలలా నీలో ఇమిడి ఉంటుంది
జేవురు రంగు ఆకాశం నీ కంటి జీరలో చేరి ఉంటుంది

అప్పుడు
తూచలేని భయాలెన్నో
నీ గాలాడని ప్రపంచాన్ని చుట్టి ఉంటాయి
అబద్ధాల వింత పొగలు మసి రంగులో తిరుగుతుంటాయి

బతుకనే ఖనిజం కోసం
ఎన్ని లోయల్ని తవ్వాలో తెలియక
నువ్వు తికమకలాడినప్పుడు
గుబులు దుంగల మీద కాలుంచి తూలినప్పుడు
పరిమితి లేని వసంతం లాంటి ప్రపంచమేదో
నీ కోసం ఉండకపోదని అనుకొని ఉంటావు
ఉందో లేదో తెలియని అలాంటి లోకం కోసం
అరచేతుల దిండ్ల మీద తలుంచి చూసి ఉంటావు

ఏ దిగులూ నిరంతరం కాదు కనుక
అది విడిదింటికెళ్ళినట్టు వెళ్ళిపోయాక
మిగిలిన ఋతువుల్లో వసంతాన్ని చూడటమే
మనిషి పని


■ రఘు

✆ 96761 44904

నా మొదటి పుస్తకం

నేను ప్రచురించిన, నా పేరుతో వచ్చిన మొదటి పుస్తకం, సాహిత్యానికి సంబంధించిన పుస్తకం 'అతడు – ఆమె: మనం' అనే సాహిత్య విమర్శ పుస్తకం. ఆ పుస్తక రచన, ప్రచురణ అన్నీ ఆ రోజుల్లో అనుకోకుండా జరిగి పోయాయి. ఆ పుస్తకం 1983లో ప్రచురించాను. 1981, 82 సంవత్సరాలలో ఆంధ్రజ్యోతిలో ఉప్పల లక్ష్మణరావు ఆత్మకథ 'బతుకు పుస్తకం' ధారావాహికంగా ప్రచురించారు. అందులో ఆయన తన నవల 'అతడు – ఆమె' గురించి నిరాశా జనకంగా రాశారు. ఆ పుస్తకానికి సరైన సమీక్షలు, విమర్శలు రాలేదని, సరైన చర్చ జరగలేదనీ దిగులు పడ్డారు.

మొదటిసారి బిడ్డను చేతిలోకి తీసుకున్న అనుభూతి! – ఓల్గా



82లో 'బతుకు పుస్తకం' పూర్తయ్యాక నేను కొందరు మిత్రులతో కలిసి బరంపురం వెళ్ళి లక్ష్మణరావు గారింట్లో నాలుగు రోజులున్నపుడూ ఆయన 'అతడు – ఆమె'ను తెలుగు పాఠకులు, విమర్శకులు చర్చించలేదని అన్నారు. అది నాకు చాలా ఇష్టమైన నవల. దాని గురించి నేను ఎందుకు రాయకూడదూ అనుకున్నాను.

'అతడు – ఆమె' గురించి విమర్శ గానీ, ప్రశంస గానీ రాయాలంటే జాతీయోద్యమం గురించి, కమ్యూనిస్టు ఉద్యమపు తొలినాళ్ళ గురించి, స్త్రీ పురుష సంబంధాల గురించీ చాలా అధ్యయనం చేయాలి. అప్పుడు నేను లెక్చరర్‌గా పని చేస్తున్న వి.యస్.ఆర్ కళాశాలలో ఎంతో మంచి లైబ్రరీ ఉండేది. ఆరు నెలల పాటు ఆ లైబ్రరీలో కూచుని 'అతడు – ఆమె: మనం' రాయటం పూర్తి చేశాను. అంతలో బరంపురం నుంచి 'బతుకు పుస్తకం' ఆవిష్కరణ సభలో మాట్లాడమని పిలుపు వచ్చింది. ఆ సభలో గంట సేపు 'అతడు – ఆమె' నవల గురించి మాట్లాడాను. లక్ష్మణ రావు గారు పొంగిపోయారు. మరో మూడు నెలలకు 'అతడు – ఆమె: మనం' పుస్తకం ఆయన చేతిలో ఉంచి నమస్కరించాను. తన జీవిత కాలంలో 'అతడు – ఆమె' గురించి అంత మంచి, పెద్ద పుస్తకం చూడగలనని అనుకోలేదని లక్ష్మణరావు గారు చాలా సంతోషించారు. ఆయను సంతోషపెట్టానని నేనూ.



ఉప్పల లక్ష్మణరావుతో ఓల్గా

ఐతే పుస్తకం రాయటం నా చేతిలో పని – కానీ ప్రచురించటం ఎలా? నాకు అనుభవం లేదు. దిగంబర కవిత్వం ప్రచురణ బాధ్యతలు సుగమ్ బాబు, దేవిప్రియ చూశారు. నా రాజకీయ రచన 'సాంస్కృతిక విప్లవం – మావో' పుస్తక ప్రచురణ కూడా నా ప్రమేయం లేకుండా జరిగింది. కానీ 'అతడు – ఆమె: మనం' రాసే నాటికి నేను తెనాలిలో చాలా ఒంటరితనంలో ఉన్నాను. డబ్బు సమస్య కాదు. పదేళ్ళ నుంచీ లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. కానీ ప్రింటింగ్ ఎవరు చేస్తారు? ఎవరు ఆ బాధ్యత తీసుకుంటారు? విజయవాడలో నేను 'కరుణక్కా' అని పిలిచే డాక్టర్ కరుణ గారు శ్రీశ్రీ విశ్వేశ్వరరావు గారి గురించి చెప్పినట్టు గుర్తు. ఆయన అప్పుడే ప్రింటింగ్ ప్రెస్ పెట్టారు. నా పుస్తకమే మొదటి పుస్తకంగా ఆయన చేతిలోకి వెళ్ళింది. నాకు ప్రూఫ్ రీడింగ్, కవర్ పేజీ ముద్రణ ఇవేమీ తెలియవు. అన్నీ విశ్వేశ్వరరావు గారి బాధ్యతేనని చెప్పాను.

ఆయన పుస్తకాన్ని ముద్రించి నా చేతిలో పెట్టారు. అప్పటికి నాకు ఇద్దరు పిల్లలున్నా, మొదటిసారి బిడ్డను చేతిలోకి తీసుకున్న అనుభూతి– ఆ పుస్తకం చదివి కరుణక్క ఎంత మంచి ఉత్తరం రాసిందో! డాక్టర్ హేమా పరిమి ఎంత ప్రేమగా ఆలింగనం చేసుకుందో. చదివినవారంతా ప్రశంసల వర్షం కురిపించారు. కృష్ణాబాయి గారు "దీనికే నీకు పిహెచ్‌డి డిగ్రీ ఇవ్వొచ్చు" అన్నారు.



అదంతా నవల గొప్పదనమే గాని నా గొప్పదనం కాదని నాకు తెలుసు. ఆ పుస్తకం ఎన్నో ముద్రణలు పొందింది, ఇప్పటికీ మార్కెట్‌లో ఉంది. అందులో కొంత భాగాన్ని 'అతడు – ఆమె'ను పునర్ముద్రించినపుడు ఆ నవల 'వెనక మాట'గా ప్రచురించారు విశాలాంధ్రవారు. అన్ని విధాలా నాకు సంతోషాన్నీ, చిన్నపాటి గర్వాన్నీ కలిగించిన పుస్తకం నా మొదటి పుస్తకమే. ఆ తర్వాతంతా వివాదాలమయమే నా సాహిత్య జీవితం.

అప్పుడు తెలియదుగానీ 'interdiciplinary' పద్ధతిలో సాహిత్య విమర్శ తెలుగులో మొదలుపెట్టింది ఆ పుస్తకమే నని ఇపుడనిపిస్తుంది.

ఒక చిన్న పిడకల వేట– ఆ పుస్తకంలో లోపాలు చూపాలనే పట్టుదలతో ఒక విప్లవ మేధావి అన్నట్టుగా నాకు విజయవాడ మిత్రులు చెప్పారు. నేను ఆ పుస్తకంలో ఒక గొప్ప సన్నివేశాన్ని వివరిస్తూ "అది చదువుతున్నపుడు లక్ష్మణరావుగారి పాదాలకు నమస్కరించాలనిపిస్తుంది" అని ఉద్వేగంగా రాశాను. నన్ను నేను నిలువరించుకోలేక రాసిన మాట అది. విమర్శలో అది కూడదేమో– కానీ విమర్శ ఉద్వేగం గురించి రాలేదు. "పాదాలకు నమస్కరించటం ఫ్యూడల్. ఓల్గా దానిని ప్రోత్సహిస్తుందా," అని అన్నారట. అది విని నేను మిత్రులతో మరి గద్దర్ అమర వీరులకు "పాద పాదాన పరి పరి దండాలు" అని పాడటం, మనందరం ఉద్వేగంగా వినటం ఇదంతా ఫ్యూడలే కదా అన్నాను. అందరం నవ్వుకున్నాం. నిజమే కొన్ని పాత వ్యక్తీకరణలు అంత త్వరగా వదిలించుకోలేం. ■

ఎపిలోగ్



ఆఖరి కన్నీటిబొట్టుని అనుకుని
ఓ ధైర్యవచనం ఉండే ఉంటుంది
దుఃఖాన్ని చెరిపేస్తూ, సాంత్వనగా

చెప్పడానికేమీ లేదనుకున్నపుడు
ఇంద్రియాలన్నీ పుష్పించేలా
ఒక తొలకరి వాన పడుతుంది

ముగింపు నచ్చని పుస్తకం చివర
ఓ ఖాళీ పేజీ ఉండే ఉంటుంది
నచ్చిన వాక్యం రాసేందుకు వీలుగా


రాయడానికింకేమీ లేదనుకున్నపుడు
తీరంలో శిలల శిరస్సునుండి
ఆదిమ సంగీతం వినిపిస్తుంది

అంతటా అరుచి ప్రోది అయినపుడు
ఇష్ట స్మృతుల పునరాగమనంతో
స్వప్నవృష్టిలో తడవాలన్న ఇచ్ఛ
దేహదాహంగా వ్యక్తమవుతుంది


మాటలన్నీ ఇంకిపోయాయనుకున్నపుడే
సీతాకోకల గుంపొకటి వచ్చి
నిశ్శబ్దాన్ని పటాపంచలు చేస్తుంది

■ మల్లారెడ్డి మురళీ మోహన్

✆ 88611 84899



ఇంట్లో లక్షల రూపాయల విలువైన వస్తువులు నీటిపాలై కొందరు..
అప్పులు తెచ్చి లక్షల్లో పెట్టుబడులు పెట్టి నడుపుతున్న షాపుల్లోని సరుకు మొత్తం వరదపాలై మరికొందరు..
పైసాపైసా కూడబెట్టి చేస్తున్న వ్యాపారం అంతా బడమేరు పాలై ఇంకొందరు..
వరదలా పొంగే దుఃఖంతో కన్నీరు మున్నీరవుతున్నారు. అజిత్‌సింగ్‌నగర్, అంబాపురం, పాయకాపురం, కండ్రిక.. ఇలా వరద ప్రాంతాల్లో ఎవరిని కదిపినా కన్నీటి కష్టాలే వినిపిస్తున్నారు. సంవత్సరాల తరబడి పొదుపు చేసుకున్న సొమ్ముతో కూడబెట్టుకున్న వస్తువులు.. అప్పులుచేసి ప్రారంభించిన వ్యాపారాలు అన్నీ నీటిపాలయ్యాయి. తమను ప్రభుత్వం ఆదుకుంటుందని వీరంతా కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



ప్రకాశం బ్యారేజీ వద్ద పెరిగిన వరద



పాయకాపురంలో వరద పోయి మిగిలిన బురద



బుడమేరు గండ్లు పూడ్చివేత అనంతరం ఇలా..

ఆగక వచ్చే కన్నీరే..

బుడమేరు మిగిల్చిన నష్టాన్ని చూసి విలవిల్లాడుతున్న బాధితులు

లక్షల్లో పెట్టుబడి పెట్టి నడిపే దుకాణాల్లో సరుకు నీటిపాలు

- ఇళ్లలోని లక్షల విలువైన వస్తువులు వరద పాలు
- నేటి నుంచి నష్టం అంచనా
- శరవేగంగా పారిశుద్ధ్య పనులు



వాంబేకాలనీలో మంత్రులు అనగాని, అనిత, ఎంపీ చిన్ని



వరదలో కొట్టుకొచ్చిన వాటిని తొలగిస్తున్న సీపీఎం బృందం

ఆకలి పోరాటం..



వైఎస్సార్‌కాలనీలో ట్రాక్టర్‌ను చుట్టుముట్టి...



న్యూ ఆర్‌ఆర్‌పేటలో కూరగాయల కోసం క్యూలో..



రైస్‌బ్యాగ్‌ల కోసం వాంబేకాలనీలో..

దిగువ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు శేషు కుమార్. అంబాపురం మెయిన్ రోడ్డులో సాయిదీప్ ఫర్నీచర్ వర్క్స్ యజమాని. 2023 డిసెంబరులో ఈ షాపు ప్రారంభించారు. ఇంటిపై సుమారు రూ.30 లక్షలు బ్యాంకు లోను తీసుకుని, దాచు కున్న మరో రూ.10 లక్షలు కలిపి సుమారు రూ.40 లక్షలతో ఈ షాపుతోపాటు సింగ్‌నగర్ ప్రాంతంలో మరో షాపు ప్రారంభించారు. ఇటీవల వరదలకు రెండు షాపులు నీటిలో మునిగిపోయాయి. ఆదివారం నీరు కాస్త తగ్గడంతో షాపు వద్దకు వచ్చి తడిసిన వస్తువులను చూసి కన్నీటిపర్యంతమయ్యారు. మొత్తం పెట్టుబడి వరదపాలైందని, అప్పు మాత్రం మిగిలిందని విలపించారు.



చిట్టినగర్‌లో విషణ్ణవదనంలో మహిళ



నేటి నుంచి ఆస్తినష్టం అంచనా..

వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం నుంచి ఆస్తి నష్టం అంచనా ప్రారంభించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమవుతోంది. సుమారు 2.32 లక్షల కుటుంబాల్లో జరిగిన నష్టాన్ని ఆయా ప్రాంతాల్లో ఉన్న వ్యాపార సంస్థలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులు 17 వేల ఎన్యూమరేషన్ బృందాలను ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు ఆస్తినష్టం అంచనా సర్వే చేపడుతారు. మరోవైపు ప్రజారోగ్యం విషయంలోనూ అధికారులు శ్రద్ధ పెడుతున్నారు. ఇప్పటికే రోడ్లపై పారిశుద్ధ్య పనులను చేపట్టిన అధికారులు ఇళ్లను శుభ్రపరిచేందుకు ఫైర్ ఇంజన్లను వినియోగిస్తున్నారు. సోమవారం నుంచి వైద్య బృందాలు ఇంటింటి సర్వే చేపట్టనున్నాయి. నాలుగు రోజులపాటు ఈ సర్వే నిర్వహించనున్నారు.



వైఎస్సార్ కాలనీలో..

శరవేగంగా పారిశుద్ధ్య నిర్వహణ

వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 32 వార్డులు.. 149 వార్డు సచివాయాల పరిధిలో వరద ముంపు ప్రభావం ఉంది. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టడంతో ఈ ప్రాంతాల్లో సుమారు 7 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. 110 ఫైర్ ఇంజన్లు, 400 మెషిన్లతో ఇళ్లు, దుకాణాలు శుభ్రపరుస్తున్నారు. ఆదివారం నాటికి 27443 ఇళ్లను శుభ్రపరిచినట్లు అధికారులు తెలిపారు.



చిట్టినగర్‌లో బ్లీచింగ్ జల్లుతూ..



54వ డివిజన్‌లో నీళ్లు పడుతున్న మంత్రి సవిత



ఐఎంఏ ఆధ్వర్యంలో మందుల పంపిణీ

లక్ష మందికి సరుకుల కిట్లు పంపిణీ

మూడ్రోజుల్లో మిగిలిన 2 లక్షల మంది వరద బాధితులకు..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వరద బాధితులకు ప్రభుత్వ సాయం మొదలైంది. 3 లక్షల మందికిపైగా బాధితులకు నెలకు సరిపడా నిత్యావసరాలను అందించేందుకు ప్రొక్యూర్‌చేయటంతో పాటు వాటిని ఎన్టీఆర్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు అందించింది. దీంతో కేవలం మూడు రోజులలోనే లక్ష మంది వరద బాధితులకు ఎన్టీఆర్ జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. సోమ, మంగళ, బుధవారాల్లో మిగిలిన 2 లక్షల మంది బాధితులకు నిత్యావసరాల కిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించారు. శనివారం సింగ్‌నగర్ ప్రాంతంలో పంపిణీ చేపట్టగా.. ఆదివారం ఇబ్రహీంపట్నం మండల ప్రాంతంలో పంపిణీ చేశారు.

కిట్‌లో ఏమేమి ఉన్నాయంటే..

నిత్యావసరాల కిట్లలో 25 కేజీల రైస్ బ్యాగ్, కేజీ కందిపపప్పు, కేజీ పంచదార, కేజీ అయిల్, 2 కేజీల బంగాళ దుంపలు, 2 కేజీల ఉల్లిపాయలు ఉన్నాయి. ఇవన్నీ కుటుంబానికి కిట్ ప్రాతిపదికన అందిస్తున్నారు. మొత్తం 1100 ఎండీయూ వాహనాలను వినియోగిస్తున్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు ప్రాతిపదికన పంపిణీ చేయాలని అధికారులు నిర్దేశించారు.

భయం భయంగానే..

బాపులపాడు మండలంలో అడుగున్నర పెరిగిన వరద

- బ్యారేజీ నుంచి 4.28 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..
- కొనసాగుతున్న పునరావాస శిబిరాలు





ఉంగుటూరు మండలం కొయ్యగూరపాడు, ఎలుకపాడు, ఓంద్రంపాడు గ్రామాల్లోకి చేరిన వరదనీరు, బందరు మండలం చిన్నాపురంలో నీటమునిగి దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : కృష్ణాజిల్లాను భారీవర్షాలు, వరద వీడటం లేదు. కృష్ణానదికి వరద ఉధృతి ఆదివారం నుంచి మళ్లీ పెరుగుతోంది. శుక్రవారం ప్రకాశం బ్యారేజీ నుంచి 1.60 లక్షల క్యూసెక్కులను మాత్రమే దిగువకు విడుదల చేయగా, ఆదివారం సాయత్రానికి 4.28 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో లంక గ్రామాలను, పంట పొలాలను మళ్లీ వరద నీరు ముంచెత్తుతుందనే భయం కృష్ణానదీ పరివాహకప్రాంత ప్రజలను, రైతులను వెంటాడుతోంది. మచిలీపట్నం, గుడివాడ నియోజకవర్గాల్లో నీటమునిగిన గ్రామాల్లోని పంట పొలాలను, జలదిగ్బంధనంలో ఉన్న గ్రామాలను మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు.

- కృష్ణానదిలో వరదనీటి ప్రవాహం పెరగడంతో పంటలు ఏవీ చేతికొచ్చే పరిస్థితి లేదు. అరటిచెట్ల ఆకులు పసుపురంగులోకి మారిపోతున్నాయి.
- మచిలీపట్నం మండలం హంస్సేన్‌పాలేనికి చెందిన కలిదిండి ఫణికృష్ణ (40) శనివారం గన్నవరంలోని తన స్నేహితుడి ఇంటికి కారులో వెళ్లాడు. శనివారం సాయంత్రం తిరుగు ప్రయాణంలో కేసరపల్లి-కంకిపాడు మధ్య బుడమేరు వరదనీటి ప్రవాహంలో కారు చిక్కుకుపోయింది. ఫణికృష్ణ గల్లంతయ్యారు.
- ఉంగుటూరు మండలంలో కొయ్యగూరపాడు, తరిగొప్పుల, ఉంగుటూరుల వద్ద కాజ్‌వేలపై రెండు అడుగులకుపైగా వరద నీరు ప్రవహిస్తోంది. మండలంలోని పంటపొలాలు నీటిలోనే మునిగి ఉన్నాయి. గన్నవరం మండలంలో కేసరపల్లి, సావరగూడెం, ముస్తాబాద గ్రామాల్లోకి వరదనీరు చేరింది.
- నందివాడ మండలంలోని 23 పంచాయతీల్లో ఆదివారం నాటికి వరద మరింతగా పెరిగింది. పంటపొలాలు నీటిలోనే ఉండిపోయాయి. మంత్రి కొల్లురవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆదివారం జనార్ధనపురం నుంచి పుట్టగుంట వరకు పడవలో, అక్కడి నుంచి ట్రాక్టరుపై మండలం పర్యటించారు.
- గుడ్లవల్లేరు మండలంలో నీటమునిగిన పంటపొలాలను, వడ్లమన్నాడు డ్రెయినేజీని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు ఆదివారం పరి
- బాపులపాడు మండలం రామన్నగూడెం, రంగయ్యప్పారావుపేట, ఓగిరాలల్లో వరద ఉధృతి మరింతగా పెరిగింది. హనుమాన్‌జంక్షన్ నుంచి గుడివాడ వైపునకు వెళ్లే రహదారిపై మండలంలోని ఆరుగొలను వద్ద బుడమేరు నాలుగు అడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపేశారు.



వడ్లమన్నాడు పర్యటనలో కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

12 వరకు భారీ వర్షాలు

మచిలీపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కోస్తాతీరం వెంబడి ఈనెల 12వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ఆదివారం హెచ్చరికలు జారీ చేసింది. ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలోని పలు ప్రాంతాలలో ఒక మోస్తరు వర్షం కురిసింది. గన్నవరంలో అత్యధికంగా 42.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కోడూరులో 3.4 మిల్లీమీటర్లు, జిల్లాసగటు వర్షపాతం 18.1 మిల్లీమీటర్లుగా నమోదైంది. పెనమలూరులో 42.2, మొవ్వలో 34.2 పామర్రులో 31.2, ఉయ్యూరులో 28.6, కంకిపాడులో 28.0, పమిడిముక్కలలో 26.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

2024 మార్చి 21న ఎం.కె.రంజిత్ సిన్హా అండ్ అదర్స్ కేసులో వాతావరణ మార్పుల దుష్ప్రభావాలనుంచి పర్యావరణాన్ని రక్షించుకోవడం 'ప్రాథమిక మానవహక్కు' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు చొరవ ప్రదర్శించి, క్రియాశీలతతో తీర్పును వెలువరించినట్లుగా పర్యావరణ ప్రేమికులు, మేధావులు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంలో న్యాయ వ్యవస్థ క్రియాశీలతను సమగ్రంగా అధ్యయనం చేద్దాం.

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

దిక్సూచి DIKSUCHI

న్యాయ వ్యవస్థ క్రియాశీలత

న్యాయశాఖ క్రియాశీలత అనేది న్యాయసమీక్షాధికారంలో అంతర్భాగం. న్యాయశాఖ క్రియాశీలత అనగా న్యాయవ్యవస్థ తన అధికార విధులను మరింత చొరవగా, క్రియాశీలకంగా, ఉదారంగా వినియోగించడం. న్యాయాన్ని ప్రజలకు అందించే క్రమంలో అనేక నూతన పద్ధతులను, ప్రక్రియలను వినియోగించి సమ న్యాయపాలనకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతుంది. సామాజిక హక్కులను రక్షిస్తూ, సామాన్య ప్రజలకు న్యాయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సుప్రీంకోర్టు, అపెక్స్ జ్యుడీషియల్ బాడీగా దీనికి కేంద్ర బిందువు అయ్యింది.

న్యాయపరమైన కృతశీలత అనేది చట్టాలను చొరవతో, చురుగ్గా వివరించే సందర్భాలను సూచిస్తుంది. న్యాసమీక్ష సాంప్రదాయ సరిహద్దులను దాటి రాజ్యాంగ విలువలను సమర్థించే విషయాల్లో జోక్యం చేసుకుంటుంది.

చేసింది. కేశవానంద భారతి కేసు(1973)లో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు పార్లమెంటు అధికారాలపై పరిమితులు విధిస్తూ పరోక్షంగా న్యాయవ్యవస్థ పరిధిని విస్తృతం చేసింది. ఈ తీర్పులో రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని వెలువరించింది. తరవాత కేసుల్లో కూడా తన తీర్పుల ద్వారా దానిని కొనసాగించింది.

ఎమర్జెన్సీ తరవాత వచ్చిన రాజకీయ-పౌరచైతన్యం వల్ల ప్రజాహిత వ్యాజ్యాలు(పిల్) వాడుకలోకి వచ్చాయి. న్యాయ సహాయాన్ని అందించమని నేరుగా న్యాయవ్యవస్థను కోరేలా ప్రజాహిత వ్యాజ్యాలు ప్రజలను చైతన్య పరిచాయి. శాసన



న్యాయవ్యవస్థ క్రియాశీలత - పరిణామం

గోలక్‌నాథ్ కేసు సుప్రీంకోర్టుకు వచ్చేవరకు ప్రాథమిక హక్కుల సవరణతోపాటు పార్లమెంటు చేసిన చట్టాలన్నింటిపై సుప్రీంకోర్టు ఎలాంటి విభేదాన్ని ప్రకటించలేదు. కానీ 17వ రాజ్యాంగ సవరణ(1964) ద్వారా అప్పుడు ప్రాథమిక హక్కుగా ఉన్న ఆస్తిహక్కును సవరిస్తూ పార్లమెంటు చట్టం చేసింది. అయితే ప్రాథమికహక్కు అయి న ఆస్తిహక్కును సవరించే అధికారం ప్రకరణ-368 కింద పార్లమెంటుకు లేదని గోలక్‌నాథ్ కేసు(1967)లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు నుంచే పార్లమెంటుకు న్యాయవ్యవస్థకు మధ్య ఘర్షణ ప్రారంభమైందని రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ ఘర్షణ పరోక్షంగా న్యాయవ్యవస్థ క్రియాశీలతకు దోహదం

శాఖ, కార్యనిర్వాహక శాఖల బలహీనతే న్యాయశాఖ క్రియాశీలతకు కారణమని రాజ్యాంగవాదుల అభిప్రాయం.

ప్రజాప్రయోజనాల వ్యాజ్యాలు వాడుకలోకి వచ్చినప్పటి నుంచి పౌరులు, స్వచ్ఛంద సంస్థలు మిగిలిన రెండు శాఖల కార్యకలాపాల్లో జోక్యం చేసుకుని 'ప్రజాహితాన్ని' కాపాడమని అర్థించడం న్యాయ వ్యవస్థకు బలాన్నిచ్చాయి. దాంతో కార్యనిర్వాహక శాఖ అధికారాల్లో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవడం మొదలుపెట్టింది. ఉదాహరణకు కావేరి నదీ జలాల సమస్యను చర్చించడానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు సూచించడం. రోడ్లు, వంతెనలు నిర్మించాలని ప్రభుత్వానికి ఆదేశాలివ్వడం, రైళ్ల రాకపోకలకు 'సమయ పాలన' పట్టికలను రూపొందించాలని చెప్పడం, విద్యాసంస్థల్లో అడ్మిషన్లు ఎలా జరపాలో నిర్దేశించడం. ఈవిధమైన తీర్పులన్నింటినీ పరిశీలిస్తున్న రాజ్యాంగ మేధావులు 'న్యాయ వ్యవస్థతో నడుస్తున్న ప్రభుత్వాలు' అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ అతిక్రియాశీలతను కట్టడి చేయడానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎ.కె.మాథుర్, మార్కండేయ కట్జూ 'న్యాయ వ్యవస్థ సహేతుకత'ను ప్రతిపాదించారు. తరచుగా ఈ అతి క్రియాశీలతను వినియోగించడం ఆరోగ్యకరమైన సంకేతం కాదని న్యాయమూర్తి హెచ్.ఆర్.ఖన్నా అభిప్రాయపడ్డారు.

న్యాయశాఖ క్రియాశీలతకు కారణాలు

- శాసనశాఖ, కార్యనిర్వాహక శాఖ తమ విధుల నిర్వహణలో వైఫల్యం చెంది ప్రజల నమ్మకాన్ని కోల్పోవడం.
- ఓటుబ్యాంకు రాజకీయాల వల్ల దీర్ఘకాలిక, నిర్మాణాత్మక, కఠినమైన నిర్ణయాలు చేయకపోవడం వల్ల ప్రజల కనీస అవసరాలు కూడా మెరుగుపర్చని స్థితిలో ప్రభుత్వాలు కొనసాగడం.
- ప్రజాప్రయోజనాల వ్యాజ్యంతో మూడో వ్యక్తి కూడా కోర్టును ఆశ్రయించే అవకాశం లభించింది. దాంతో స్వచ్ఛంద సంస్థలు, పౌర హక్కుల సంఘాలు వందల సంఖ్యలో ప్రజా ప్రయోజనాలున్న కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చాయి.
- న్యాయస్థానాలు స్వయంప్రేరిత కేసులను ప్రవేశపెట్టి ప్రజల హక్కుల కోసం తగిన ఆదేశాలను జారీచేయడం.(ఉదాహరణకు కోర్టుకు వచ్చిన ఉత్తరాల ద్వారా, పేపర్లలో వచ్చిన వార్తల ఆధారంగా తనంత తానుగా ఆ సంఘటనలను విచారణకు స్వీకరించడం).
- దత్త శాసనాధికారాల వల్ల కార్యనిర్వాహక శాఖ అధికారాలు విస్తృతమై అధికార దుర్వినియోగం, జవాబుదారీతనం లోపించడం.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

న్యాయశాఖ క్రియాశీలత - ముఖ్య వివాదాలు

- ఫరీదాబాద్ గనుల్లో పనిచేసే బాల కార్మికుల స్థితిగతులపై బందువా ముక్తి మోర్చా వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు.
- లక్ష్మీకాంత్, యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న మోసాలు, చిన్నపిల్లల దత్తత వివాదంలో సుప్రీంకోర్టు తీర్పులు.
- తాజ్‌మహల్ పరిసర ప్రాంతాల్లో కాలు ష్యం, తద్వారా తాజ్ మహల్‌కు ఉన్న ముప్పుపై కేసులు.
- బిహార్ ఖైదీల కేసు; బిహార్ పశుగ్రాసం కేసు.
- జార్ఖండ్ ముక్తిమోర్చా అవినీతి వివాదం.
- రక్షణశాఖలో కొనుగోలు కుంభకోణాలు మొదలైన వివాదాలు.
- జడ్జిల నియామకం.
- కర్ణాటక ముఖ్యమంత్రి ఎస్.ఆర్.బొమ్మై కేసు(1994)లో 356వ ప్రకరణ దుర్వినియోగాన్ని అరికట్టడానికి కొన్ని సూచనలివ్వడం.
- సతీష్‌శర్మ - పెట్రోల్ బంకుల కేటాయింపుల దుర్వినియోగం.
- గంగానది కాలుష్య నివారణ.
- వాహన కాలుష్యం వల్ల ఢిల్లీవాసుల జీవించేహక్కుకు భంగం కలిగిందంటూ ఒక పౌరుడు వేసిన కేసులో డీజిల్ బస్సులను సీఎన్‌జీ బస్సులుగా మార్చాలని ఆదేశించడం.
- అడవుల్లో చెట్లను విచక్షణారహితంగా నరికివేయడానికి సంబంధించి.
- కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలంటూ ఆదేశించడం.
- ఢిల్లీలో అక్రమ నిర్మాణాలను తొలగించడం.

గుప్తా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1982)లో మహారాష్ట్ర హైకోర్టు తీర్పు చెబుతూ న్యాయస్థానాలు క్రియాశీలకంగా వ్యవహరిస్తాయని పేర్కొంది. ఆదే విధంగా పీయూడీఆర్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1982)ను కూడా ఇక్కడ పేర్కొనవచ్చు. 9వ ఆసియా క్రీడల కోసం చేపట్టిన నిర్మాణాల్లో పాల్గొనడానికి వచ్చిన వారి శ్రమను యాజమాన్యం దోచుకుంటోందని ఒక స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించి కార్మికులకు పని గంటలను నిర్ధారించింది.

1998 ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎం.కె.బెజ్ బారువాను ఆ శాఖ నుంచి మరో శాఖకు బదిలీ చేశారు. ఈ బదిలీ సహజంగా జరిగింది కాదని, ఉద్దేశపూర్వకంగా చేశారని సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. సుప్రీంకోర్టు బెజ్ బారువా బదిలీ విషయంలో కేంద్రప్రభుత్వ చర్యను తప్పుపట్టింది.

- ఐ.ఆర్.కొయల్హా కేసు(2007)లో 9వ షెడ్యూల్‌లోని అంశాలను కూడా న్యాయసమీక్ష చేయవచ్చని తీర్పుచెప్పడం.
- శ్రేయోసింఘాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఐటీ చట్టంలోని సెక్షన్ 66ఏను కొట్టివేయడం(2015).
- ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జిల నియామకాలకు సంబంధించి కొలీజియం వ్యవస్థను పునరుద్ధరించడం(2015)
- రామ్‌సింగ్ కేసు(2015)లో వెనుకబడిన తరగతుల కమిషన్ సిఫార్సులకు వ్యతిరేకంగా జాట్‌లను ఓబీసీల్లో చేర్చడాన్ని కొట్టివేయడం.

లెటర్ రిపీటెడ్ సిరీస్

● రీజనింగ్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

లెటర్ సిరీస్‌కు సంబంధించిన ప్రశ్నల్లో కొన్ని అక్షరాల సమూహాలను ఒక సిరీస్‌గా పేర్కొంటారు. ఈ అక్షర సమూహాలు రకరకాలుగా ఉంటాయి. అనగా 3, 4, 5 లేదా 6 అక్షరాలు గల సమూహాలు రిపీటెడ్‌గా రావడం.

ఉదా: dabc/dabc/dabc/dabc. లేదా

ఒక క్రమపద్ధతిలో అక్షర సమూహాలు విభజించడం.

ఉదా: ab/aabb/aaabbb/aaaabbbb.

గమనించండి: మొదటి సమూహంలో ఒక ab, రెండో సమూహంలో రెండు aలు, రెండు bలు, మూడో సమూహంలో మూడు aలు, మూడు b లు ఇలా ఒక క్రమపద్ధతిని అనుసరించి సిరీస్ ఏర్పడుతుంది. లేదా ఒక్కోసారి చెయిన్ పద్ధతిలో అక్షర సమూహాలు ఉంటాయి.

ఉదా: abc/bca/cab/abc.

మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివర ఉన్నది. అదేవిధంగా రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక సక్రమమైన చెయిన్ పద్ధతిలో ఈ సిరీస్ ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలు ఉండే పద్ధతి

కొన్ని అక్షరాల సమూహాన్ని ఒక సిరీస్‌గా పేర్కొంటారని పైన చెప్పుకున్నాం. ఈ అక్షరాల మధ్య మధ్య కొన్ని అక్షరాలను వదిలేస్తారు. ఆ సిరీస్‌లో వదిలేసిన అక్షరాల సమూహం ఐచ్ఛికాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో ఉంటుంది. కాబట్టి ప్రశ్నగా ఇచ్చిన సిరీస్ ఏ క్రమపద్ధతిని అనుసరిస్తున్నదో తెలుసుకోవాలంటే ఐచ్ఛికాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో గల అక్షరాలను ప్రశ్నలోని ఖాళీల్లో పూరించి సిరీస్‌ని అవగాహన చేసుకోవాలి. సమాధానాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో ఏ ఆప్షన్‌లోని అక్షరాలను ఖాళీల్లో పూరించిన ఆ సిరీస్ క్రమపద్ధతిని అనుసరిస్తుందో ఆ ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించాలి.

ఈ సిరీస్‌కు సంబంధించిన ప్రశ్నలలో అభ్యర్థి ముందుగా ఆ సిరీస్‌లో ఉపయోగించిన అక్షరాలు గమనించాలి. మూడు అక్షరాలు ఉపయోగిస్తే మూడు అక్షరాల సమూహంగా నాలుగు అక్షరాలు ఉపయోగిస్తే నాలుగు అక్షరాల సమూహంగా విభజించే అవకాశం ఉంది. అలా కాని పక్షంలో

1. సిరీస్‌లో మొత్తం 12 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 3 లేదా 4గా విభజించే అవకాశం ఎక్కువ.
2. సిరీస్‌లో మొత్తం 16 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 4గా విభజించే అవకాశం ఎక్కువ.
3. సిరీస్‌లో మొత్తం 15 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 3 లేదా 5గా విభజించే అవకాశం ఎక్కువ
4. సిరీస్‌లో మొత్తం 20 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 4 లేదా 5 విభజించే అవకాశం ఎక్కువ
5. సిరీస్‌లో మొత్తం 14 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 2/3/4/5 గా విభజించవచ్చు.

ఉదా: PQ/PQQ/PQQQ/PQQQQ

ప్రతి సమూహంలో 'Q' ఒక్కొక్కటి పెరిగింది.

6. సిరీస్‌లో 18 ఉంటే(అక్షరాలు, ఖాళీలు కలిసి) 3 లేదా 4 లేదా 6గా విభజించే అవకాశం ఎక్కువ ఒక్కోసారి 3/4/5/6గా కూడా ఉండే అవకాశం ఉంటుంది.

ఉదా: abc/aabc/aabbc/aabbcc.

మొదటి సమూహం నుంచి రెండో సమూహానికి a పెరిగింది. రెండో సమూహం నుంచి మూడో సమూహానికి b పెరిగింది. మూడో సమూహం నుంచి 4వ సమూహానికి c పెరిగింది. ఈ లెటర్ సిరీస్‌కు సంబంధించి ప్రశ్నలు ఏవిధంగా ఉంటాయో, గత వివిధ పోటీ పరీక్షలలో ఇస్తున్న, ముఖ్యమైన సిరీస్ పద్ధతులను అభ్యర్థులకు ఈ చాప్టర్‌పై అవగాహన కలిగించేందుకు దిగువ ఇస్తున్నాం. దిగువ ఇచ్చిన సిరీస్ పద్ధతులను అభ్యర్థులు కనీసం ఐదు లేదా ఆరుసార్లు చదివి జాగ్రత్తగా పరిశీలించి సిరీస్‌లో అక్షరాల విభజన, సిరీస్‌లు ఏర్పడే విధానం, వాటి స్వభావంపై అవగాహన ఏర్పరచుకొని ఈ చాప్టర్‌పై పట్టుసాధించగలరని ఆశిస్తున్నాం.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ఉండే అక్షరాలు P, Q, R, S లేదా a,b,c,d లేదా K,L,M,N అయి ఉంటాయి.

వివిధ రకాలైన సిరీస్ పద్ధతులు

1. ab/ab/ab/ab/ab/ab
   రెండేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
2. PQR/PQR/PQR/PQR
   మూడేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
3. dcab/dcab/dcab/dcab
   నాలుగేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
4. adcbc/adcbc/adcbc
   ఐదేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
5. dacbad/dacbad/dacbad
   ఆరేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
6. abba/baab/abba/baab
   మొదటి సమూహంలో గల అక్షరాలు abba. ఈ సమూహంలో చివరి రెండు అక్షరాలు(ba) రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు(ab) రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఉన్నాయి.
   రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు (ab) మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు (ba) మూడో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఉన్నాయి. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని అనుసరిస్తూ ఈ సిరీస్ ఏర్పడింది.
7. PQ/PPQQ/PPPQQQ/PPPPQQQQ
   మొదటి సమూహంలో రెండు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో ఆరు అక్షరాలు, నాలుగో సమూహంలో ఎనిమిది అక్షరాలు ఉన్నాయి. మొదటి సమూహంలో ఒక PQ, రెండో సమూహంలో రెండు Pలు, రెండు Qలు, మూడో సమూహంలో మూడు Pలు, మూడు Qలు ఉన్నాయి. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
8. abc/aabc/aabbc/aabbcc
   మొదటి సమూహంలో మూడు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో ఐదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. రెండో సమూహాన్ని గమనిస్తే మొదటి సమూహంలో గల అక్షరాలన్ని ఉంటూ a స్థానం వద్ద మరొక a అదనంగా చేరింది. మూడో సమూహంలో రెండో సమూహంలో గల అక్షరాలన్ని ఉంటూ b స్థానం వద్ద మరో b అదనంగా చేరింది. నాలుగో సమూహంలో మూడో సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ c స్థానం వద్ద మరో c అదనంగా చేరింది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

వరదపై ఆగని జగన్ బురద

- వలంటీర్లు ఉంటే సమర్థంగా ఎదుర్కొనేవారట!
- ఎక్స్ వేదికగా జగన్ ట్వీట్.. విరుచుకుపడ్డ నెటిజన్లు
- జగన్ నిర్వాకమే ఈ వరద అంటూ మండిపాటు

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్ వరదపై తన బురద రాజకీయాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. వలంటీర్లు ఉంటే, ముంపును సమర్థవంతంగా ఎదుర్కొనేవారంటూ మరోసారి విషం కక్కారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం అనేది ఉందా... లక్షల మంది ఉద్యోగులున్న ప్రభుత్వ యంత్రాంగం ఏమైపోయిందంటూ ఆదివారం ట్వీట్ చేశారు. ప్రభుత్వం మారకపోతే, వైసీపీ తరఫున పోరాటం చేస్తామన్నారు. నిజానికి, ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం కలిగిననేతగా, భుజం భుజం కలిపి, వరద బాధితులకు సాయమందించాల్సిన తరుణమిది. అది వదిలేసి జగన్ ట్వీట్ చేసిన బురద రాజకీయ వ్యాఖ్యల పట్ల జల వనరుల నిపుణుల నుంచి ప్రభుత్వ అధికారులు, బాధితులు, నెటిజన్లు వరకు.. సర్వత్రా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా మీ నిర్వాకమే..రాజకీయాలకు ఇదా సమయం అంటూ అత్యధిక నెటిజన్లు విరుచుకుపడ్డారు. సోషల్ మీడియాలో విమర్శలు మాని ఆకలి కేకలు పెడుతున్న బాధితులకు సాయం చేయాలంటూ ఘాటుగా సూచించారు.

వైసీపీ ఎత్తులు చిత్తు

వరద బాధితులకు పరామర్శ పేరిట రాద్ధాంతం చేసేందుకు ప్రయత్నించిన జగన్ ప్రయత్నాన్ని ఇటీవల వరదప్రాంతాల్లో మహిళలే వమ్ము చేశారు. తమకు ప్రభుత్వం నుంచి అన్నివిధాలా సాయమందుతోందంటూ స్పష్టంచేశారు. ఎమీరెంత సాయం అందిస్తున్నారంటూ పరామర్శకు వచ్చిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను మహిళలు నిలదీశారు. దీంతో, బయటకు రాకుండా తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమైన జగన్ .. ఎక్స్ వేదికగా మాత్రం బురద రాజకీయాలకు తెరతీశారని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను కించపరిచేలా ఉన్న జగన్ వ్యాఖ్యలను పలువురు తీవ్రంగా తప్పుబడుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వినాయక చవితి సెలవు దినం కూడా ఉద్యోగులు పనిచేసిన విషయం వారు గుర్తుచేశారు.

బ్రహ్మాజీ కౌంటర్ ట్వీట్...

జగన్ ట్వీట్‌కు సినీనటుడు బ్రహ్మాజీ కౌంటర్ ట్వీట్ చేశారు. ఎమీరు కరెక్టు సార్. వాళ్లు చెయ్యలేరు సార్. ఇకనుంచి మనం చేద్దాంసార్. ఫస్ట్ మనం రూ.1000 కోట్లు రిలీజ్ చేద్దాం సర్. మన వైసీపీ కేడర్ మొత్తాన్ని రంగంలోకి దింపుదాం. మనకు జనాలు ముఖ్యం సార్. గవర్నమెంటు కాదు సార్. మనం చేసి చూపిద్దాం సార్. జై జగన్ అన్నా' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే, ఆ ట్వీట్ తాను చేయలేదని, తన ఖాతా హ్యాక్ అయిందని, ఫిర్యాదు కూడా చేశానని బ్రహ్మాజీ వివరణ ఇచ్చారు.

దుష్ప్రచారాన్ని సహించొద్దు..

- సోషల్ మీడియాలో పోస్టులపై ప్రభుత్వం సీరియస్
- మితిమీరితే ఊరుకోబోనని ముఖ్యమంత్రి హెచ్చరిక

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరద సహాయ కార్యక్రమాలపై సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న దుష్ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఆ పోస్టులు పెడుతున్నవారెవరో ఆరా తీయాలని నిర్ణయించింది. మితిమీరితే శిక్ష తప్పదని హెచ్చరిస్తోంది. తాజాగా వరద సాయం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలపై అనుమానాలు రేకెత్తించేలా సోషల్ మీడియాలో పోస్టులు మొదలయ్యాయి. ఇంతవరకూ కేంద్రం సాయం ప్రకటించకపోవడంపై చంద్రబాబు ప్రభుత్వం అసహనంగా ఉందని... దీంతో ఇరు ప్రభుత్వాల మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయని ఈ పోస్టుల్లో పేర్కొంటున్నారు. కొద్ది రోజుల్లో కేంద్ర మంత్రివర్గం నుంచి టీడీపీ బయటకు వచ్చేసి, ఎన్డీయే కూటమికి గుడ్ బై చెబుతుందనే ప్రచారం చేస్తున్నారు. కేంద్ర సాయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల క్రితమే స్పష్టత ఇచ్చారు. తాము నష్టానికి సంబంధించి ప్రాథమిక నివేదిక పంపకుండానే కేంద్రం సాయం ప్రకటించడం సాధ్యం కాదని, తాము ఇంకా నివేదిక పంపలేదని చెప్పారు. ఎమరీ అతిగా ప్రవర్తిస్తున్నారు. వైసీపీ నుంచే ఇటువంటి దుష్ప్రచారం నడుస్తోంది. మరీ మితిమీరిపోతే మేం సీరియస్‌గా తీసుకుంటాం. దానికి తగిన శిక్ష ఉంటుంద్' అని హెచ్చరించారు.

బెజవాడ అనుభవంతో భద్రం!

- భారీ వర్షాలతో ఉత్తరాంధ్రకు వరద ముప్పు
- ప్రాణ, ఆస్తి, పంట నష్టం తగ్గించాలి
- ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజీలు
- ఆహార సరఫరాకు డ్రోన్లు వాడండి
- ఏలేరు ప్రాజెక్టు వద్ద గట్టి చర్యలు
- కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం టెలికాన్ఫరెన్స్



వరద పరిస్థితిని గవర్నర్‌కు వివరిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. విజయవాడ వరదను గమనంలో ఉంచుకుని ముందస్తు చర్యలను వేగంగా తీసుకోవాలని సూచించారు. ప్రభావిత ప్రాంతాల ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజ్‌లు పంపాలని కోరారు. ఆదివారం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. "ఉత్తరాంధ్ర జిల్లాల్లో వరదల ప్రభావం కనిపిస్తోంది. అన్ని జిల్లాల కలెక్టర్లు కూడా అప్రమత్తం కావాలి. నాగావళి, వంశధార నదులకు వరద పెరిగే అవకాశం ఉంది. ఏలేరు రిజర్వాయర్‌కు ఎక్కువ వరద నీరు రావొచ్చు. ప్రాజెక్ట్‌లోకి వచ్చే ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో బ్యాలెన్స్ చేసుకుని, సమర్థవంతంగా వ్యవహరించాలి. కాలువలు, చెరువులు, డ్రెయిన్లకు గండ్లు పడకుండా చూసుకోవాలి. భారీ, అతిభారీ వర్షాలు పడేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో తాగు నీరు, ఆహారం, మెడికల్ క్యాంప్‌లను సిద్ధం చేయాలి. ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ, ప్రాణనష్టం లేకుండా చూసుకోవాలి. ముందస్తు చర్యలతో ఆస్తి నష్టాన్ని తగ్గించాలి. పంట నష్టం అంచనా, బాధితులకు ఆహార సరఫరా, వరద పరిస్థితులను గమనించేందుకు డ్రోన్లు వినియోగించాలి. ప్రభావిత ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి. అక్కడ వారికి అన్ని వసతులు కల్పించాలి. పరిస్థితి తీవ్రతను బట్టి, సహాయం కోసం సెంట్రల్ కంట్రోల్ టీమ్‌ను సంప్రదించాలి. ఏజెన్సీలో వాగులు, వంకలు దాటే సమయంలో ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలి. వినాయకుని నిమజ్జనం కోసం చెరువులు, కాలువల వద్దకు వెళ్లే భక్తులు, ప్రమాదాలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలవారీగా వర్షపాతం వివరాలను సీఎంకు కలెక్టర్లు వివరించారు. బాపట్ల జిల్లాలోని పునరావాస కేంద్రాల్లో పెరుగుతున్న బాధితులను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు పెంచుతున్నామని ఆ జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. రెండువేల మందికి పైగా ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించి, ఆహారం అందిస్తున్నామని ఏలూరు కలెక్టర్ కె. వెట్రి సెల్వి చెప్పారు. విజయనగరంజిల్లాలో భారీ వర్షాలకు అనుగుణంగా రాకపోకలను నియంత్రిస్తున్నామని కలెక్టర్ అంబేడ్కర్ వివరించారు.

పండుగ రోజూ పరామర్శలే

ముఖ్యమంత్రి చంద్రబాబు వినాయకచవితి పండగ రోజు కూడా వరద బాధితులను పరామర్శించేందుకు విజయవాడలో పర్యటించారు. సింగ్‌నగర్‌లో వరదనీరు ఉండటంతో పొక్లెయిన్ ఎక్కి మారుమూల ముంపు ప్రాంతాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఓవైపు వర్షం.. మరోవైపు వరద నీటిలోనే సుమారు మూడు గంటల పాటు సీఎం పర్యటన కొనసాగింది. బాధితులు తమ కష్టాలను ఆయనకు చెప్పుకొన్నారు. తీవ్రంగా నష్టపోయామని, ఇంట్లో ఉన్న వస్తువులు, వాహనాలు అన్నీ దెబ్బతిన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గండ్లు పూడ్చివేయడంతో వరద నీరు ఒకటి రెండు రోజుల్లో తగ్గిపోతుందని, ప్రతి ఒక్క కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని చంద్రబాబు...బాధితులకు భరోసా ఇచ్చారు. అనంతరం కాన్వాయ్‌లో తిరిగి విజయవాడ కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

గవర్నర్‌ను కలిసిన చంద్రబాబు

- ప్రభుత్వ కృషిని ప్రశంసించిన అబ్దుల్ నజీర్

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఇక్కడ కలిశారు. విజయవాడలోని రాజ్ భవన్‌కు వెళ్లిన ఆయన గవర్నర్‌తో సుమారు గంటపాటు భేటీ అయ్యారు. విజయవాడ నగరాన్ని కనీవినీ ఎరుగని రీతిలో వరదలు ముంచెత్తడంతో ఆయన గవర్నర్‌ను కలసి ఈ పరిణామాలను వివరించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా వరదల వల్ల జరిగిన నష్టం, బాధితులను ఆదుకోవడానికి తాము తీసుకొన్న చర్యలను చెప్పారు. ప్రభుత్వం సత్వరం స్పందించి యుద్ధ ప్రాతిపదికన బాధితులను ఆదుకోవడానికి తీసుకొన్న చర్యలను గవర్నర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా బాధ్యత తీసుకొని సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించడాన్ని మెచ్చుకొన్నారు. త్వరలోనే ముంపు ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనగలవన్న ఆశాభావాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు.

నేటి నుంచి నష్టం అంచనా

- 2.32 లక్షల నివాసాల్లో సర్వే
- వ్యాపార సంస్థల నష్టం కూడా
- కుటుంబ సభ్యులెవరున్నా నమోదు
- ధ్రువీకరణ కోసం ఆధార్ తప్పనిసరి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన వెల్లడి

విజయవాడ/అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో ఆస్తి నష్టాన్ని అంచనా వేసే కార్యక్రమం సోమవారం ప్రారంభం కానుంది. 2.32 లక్షల గృహాలతోపాటు వాణిజ్య, వ్యాపార సంస్థలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయనున్నారు. దీనికిగాను రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో 17 వేల బృందాలను ఏర్పాటు చేశారు. నష్టం అంచనా నమోదుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఈ బృందాలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ) ఆర్‌పీ సిసోడియా నేతృత్వంలో ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన మీడియాతో మాట్లాడుతూ ఎన్యూమరేషన్‌కు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఒక్కో బృందానికీ డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నేతృత్వం వహిస్తారని తెలిపారు. వారితోపాటు వార్డు సెక్రటరీ, వలంటీర్, పోలీసు సిబ్బంది ఒకరు ఉంటారన్నారు. మూడు రోజుల్లో నష్టాన్ని నమోదు చేస్తామన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి వార్డుకు ఒక ఐఏఎస్ అధికారితోపాటు జిల్లా అధికారి ఒకరు పనిచేస్తారని తెలిపారు.

అందుబాటులో ఉండాలి!

ఎన్యూమరేషన్ బృందాలు వచ్చిన సమయంలో గృహ, వ్యాపార సంస్థల యజమానులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సృజన కోరారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వస్తే ఎన్యూమరేషన్‌కు ఇబ్బంది లేకుండా ఉంటుందని సూచించారు. ఏదైనా కారణం వల్ల ఇంట్లో ఎవరూ లేకుంటే వార్డు సెక్రటరీకి సమాచారం ఇస్తే మరోసారి ఇంటికి వచ్చి ఎన్యూమరేషన్ చేస్తారని వివరించారు.

ఇళ్లే మొదట

తొలుత గృహాల్లో నష్టం అంచనాకు ప్రాధాన్యం ఇస్తారని కలెక్టర్ చెప్పారు. ఆ తర్వాత ఆటోలు, రిక్షాలు, తోపుడు బండ్లు తదితరాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కాగా, విద్యార్థులతో కూడిన మరికొన్ని బృందాలు సమాంతర సర్వే నిర్వహించనున్నాయి.

వరద నష్టం 6,882 కోట్లు

- కేంద్రానికి రాష్ట్రం ప్రాథమిక నివేదిక

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా రూ.6,882 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ అనంతరం నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. వరద నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి శనివారం ప్రాథమిక నివేదికను పంపింది. రోడ్లు భవనాల శాఖకు రూ.2,165 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొంది. జలవనరుల శాఖకు 1,569 కోట్లు, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలకు 1,160 కోట్లు, పశు సంవర్థక శాఖకు రూ.12 కోట్లు, వ్యవసాయ శాఖకు 301 కోట్లు, మత్స్య శాఖకు 158 కోట్లు, ఉద్యానవన శాఖకు 40 కోట్లు, విద్యుత్ శాఖకు 481 కోట్లు గ్రామీణ నీటి పారుదల శాఖకు 76 కోట్లు, పంచాయితీరాజ్ పరిధిలోని రోడ్లకు 168 కోట్లు, అగ్నిమాపక శాఖకు 2 కోట్ల నష్టం జరిగినట్టు వివరించింది.

వాహనాల రిపేర్ ఖర్చు

కొంత భరిస్తాం

- ఇళ్లలో పాడైన పరికరాలకూ మరమ్మతులు
- తక్కువ ఖర్చైతే మేమే పెట్టుకొంటాం
- కంపెనీలు, బ్యాంకర్లతో చర్చలు
- ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టత
- రోడ్ల శుభ్రతపై డ్రోన్లతో తనిఖీ: సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదల్లో మునిగిపోయి దెబ్బతిన్న వాహనాలు, ఇళ్లలో పరికరాల రిపేర్ల ఖర్చులో కొంత ప్రభుత్వం భరించడంపై ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు. ఆదివారం రాత్రి విజయవాడ కలెక్టరేట్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "వరదల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తదితర వాహనాలు పెద్ద సంఖ్యలో మునిగిపోయి దెబ్బ తిన్నాయి. వీటిలో కొన్నింటికి బీమా ఉంది. కొన్నింటికి లేదు. ఆథరైజ్డ్ మెకానిక్కుల వద్ద రిపేర్ చేయిస్తేనే బీమా వస్తుంది. కొందరు యజమానులు తమకు నమ్మకం ఉన్నవారి వద్ద రిపేర్ చేయించుకోవాలని అనుకొంటారు. బీమా లేని వాహనాల రిపేర్లు ఎలాగో ఆలోచించాలి. వాహనాల కంపెనీలతో ఈ విషయం మాట్లాడుతున్నాం. కంపెనీల వద్ద సీఎస్ఆర్ నిధులు ఉంటాయి. వాటి కింద ఉచితంగా రిపేర్లు చేయాలని అడుగుతున్నాం. తక్కువ ఖర్చయితే ప్రభుత్వం తరఫున మేం పెట్టుకొంటాం. మరీ ఎక్కువైతే కొంత ప్రభుత్వం...కొంత యజమానులు భరించేలా ఆలోచన చేస్తున్నాం. వరద ప్రాంతాల్లోని ఇళ్లలో రకరకాల ఎలక్ట్రానిక్ పరికరాలు పాడై పోయాయి. వాటిని ఆయా కంపెనీల తయారీదారులే మరమ్మతు చేయాలి. విడి భాగాలు వాళ్ల వద్దే ఉంటాయి. ఆ కంపెనీలతో కూడా మాట్లాడి తక్కువ ఖర్చుతో రిపేర్లు అయ్యే మార్గం అన్వేషిస్తున్నాం. ఇందులో కూడా వీలైతే కొంత ఖర్చు ప్రభుత్వం పెట్టుకొంటుంది. గ్యాస్ స్టవ్‌లు కూడా వాటిని కొన్న కంపెనీలే రిపేర్ చేయాలి. వాళ్లతో కూడా మాట్లాడుతున్నాం. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంటరీ, పెయింటింగ్ వంటి పనులు అర్బన్ కంపెనీకి అప్పగిస్తున్నాం. ఆ కంపెనీకి ఇందులో ప్రావీణ్యం ఉంది. ఇతరత్రా ఎవరైనా ఈ పనులు చేసే వాళ్లు ఉంటే వాళ్లను కూడా ఈ కంపెనీకే అప్పగిస్తున్నాం. రేట్లు తక్కువలో ఉండేలా చూస్తాం. ఇవన్నీ ఒకటి రెండు రోజుల్లో తేలతాయి. వీటన్నింటిపైనా వివరంగా ఒక కరపత్రం తయారు చేసి ఇంటింటికీ పంపిస్తాం" అని ఆయన వివరించారు. చిన్న వ్యాపారాలు చేసుకొనేవారు, షాపులు నిర్వహించేవారు, పెద్ద వ్యాపారాలు చేసేవారు అందరూ నష్టపోయారని, వాళ్లను తిరిగి ఎలా గాడిలో పెట్టాలన్నదానిపై బ్యాంకర్లతో మాట్లాడుతున్నామని, కేంద్రం సహాయం కూడా కోరుతున్నామని ఆయన వివరించారు.

శుభ్రతపై డ్రోన్లతో తనిఖీ

వరద తగ్గిన తర్వాత ముంపు ప్రాంతాల్లో రోడ్లు, కాల్వలు శుభ్రం చేయిస్తున్నామని, ఎలా శుభ్రం చేశారో డ్రోన్లతో తనిఖీ చేయిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. డ్రోన్లు తీసిన వీడియోలు, ఫొటోలను క్షేత్రస్థాయిలో పని చేయించేవారికి పంపి ఎక్కడైనా సరిగ్గా చేయకపోతే మళ్లీ చేయిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు డ్రెయిన్లు శుభ్రం చేయలేదని, వరద కాల్వల పనులు నిలిపివేసిందని ఆయన విమర్శించారు. విజయవాడలో రెండు రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 'బుడమేరు కింద ఆక్రమణలు తొలగిస్తాం. ఈ నీరు సముద్రం చేరేవరకూ ఆటంకాలు లేకుండా అన్నీ తొలగిస్తాం. మళ్లీ విజయవాడకు వరద రాకుండా చేస్తాం' అన్నారు. ఈ 8 రోజుల్లో మొత్తం 97 లక్షల ఆహార ప్యాకెట్లు సరఫరా చేశామన్నారు.

దిగువన పెరుగుతున్న వరద

ఇబ్రహీంపట్నం రూరల్, సెప్టెంబరు 8 : తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు మునేరుకు భారీ వరద వస్తోంది. దీంతో కృష్ణానదికి మరో మారు వరద పోటెత్తుతోంది. ఇబ్రహీంపట్నం మండలం చిలుకూరు వద్ద రహదారిపై వరద నీరుపారుతోంది. లారీ ఏర్పాటు చేసి రహదారిని దాటించి దాములూరు, చిలుకూరు గ్రామాల బాధితులకు నిత్యావసరాలను అందించారు.





ఇబ్రహీంపట్నం మండలం చిలుకూరు వద్ద రహదారిపై వరద నీరు



పులిగడ్డ బ్యారేజ్‌ను తాకుతూ ప్రవహిస్తున్న వరద నీరు



కొతవరం పునరావాస కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ

ముక్త్యాల వద్ద పెరిగిన వరద

జగ్గయ్యపేట రూరల్ : కృష్ణానదికి ఎగువ నుంచి వస్తున్న వరదతో ముక్త్యాల వద్ద కృష్ణానది పోటెత్తింది. పెద్ద ఎత్తున వస్తున్న వరద నీటితో కృష్ణానది పరివాహక గ్రామాలైన ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాలలో ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. వరద పెరిగే అవకాశం ఉందని జాగ్రత్తలు పాటించాలని కోరారు **జగ్గయ్యపేట** : ఎగువన కురుస్తున్న వర్షాలకు పాలేటికి వరద పోటెత్తుతోంది. జగ్గయ్యపేట లోతట్టు ప్రాంత ప్రజలకు ముంపు రాకుండా ఎమ్మెల్యే శ్రీరా తాతయ్య ఆదివారం ముందస్తు చర్యలు చేపట్టారు. తొర్రగుంటపాలెంలో వేపలవాగు ఎగదన్నటంతో మునిగిన ప్రాంతాలను పరిశీలించారు. మునిసిపల్ చైర్మ న్ రంగాపురం రాఘవేంద్ర, డీఇ రామకృష్ణ, కమిషనర్ రామ్మోహన్, కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, చిలుకూరి కార్తీక్, గట్టిడి దితరులు పాల్గొన్నారు. విలియంపేట వద్ద పైపులైన్ మరమ్మతు పనులను చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పరిశీలించారు. యుద్ధప్రాతిప్ర దికన మరమ్మతులు చేయిస్తున్నామని, సగం పట్టణానికి ఇప్పటికే నీటిని అందిస్తున్నామని, మిగిలిన ప్రాంతానికి త్వరలో పునరుద్దరిస్తామని తెలిపారు.



పోలంపల్లి ఆనకట్ట వద్ద..

వత్సవాయి : పోలంపల్లి ప్రధాన కాలువకు పండిన గండ్లను పూడ్చేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ చెప్పారు. మునేరు ఆనకట్టకు పడిన గండ్లను పరిశీలించారు. రైతులందరికీ నష్టపరిహారం అందించేందుకు రెవెన్యూ అధికారులు అంచనాలు తయారు చేయాలన్నారు. వడ్లమూడి రాంబాబు, కిలారు విశ్వనాథ్, ఆవుల రామారావు, కిలారు సూర్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆదివారం పోలంపల్లి ఆనకట్ట వద్ద 12 అడుగుల నీరు చేరింది. అధికారులు నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. లింగాల కాజ్‌వేపై నాలుగు అడుగుల నీరు ప్రవహిస్తోంది. వర్షాలు తగ్గుముఖం పడుతున్నాయనుకున్న సమయంలో ఆదివారం మరో మారు వరద వచ్చింది. మంచి నీరు, కూరగాయలు, పాలు అందక ఇబ్బంది పడుతున్నారు.

పెనుగంచిప్రోలు వద్ద..

పెనుగంచిప్రోలు : తెలంగాణాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు వల్ల పెనుగంచిప్రోలు వద్ద మునేటికి పెద్ద ఎత్తున వరద నీరు చేరుకుంది. తహసీల్దార్ శాంతిలక్ష్మి, ఎస్సై ఎం.ఎస్.కె.అర్జున్ మునేటి కాజ్‌వే ప్రాంతాలలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

ఉప్పలూరు (కంకిపాడు), సెప్టెంబరు 8 : వరద ఉధృతి అత్యధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డి.కే. బాలాజీఅన్నారు. మండలంలోని ఉప్పలూరు, తెన్నేరు, మంతెన గ్రామాల్లో ఆదివారం ఎస్పీ ఆర్. గంగాధర్‌తో కలిసి ఆయన పర్యటించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వంతో పాటు దాతలు ఏర్పాటు చేసిన భోజనాలను ఆయన పరిశీలించారు. ఈ తహసీల్దార్ భవన్నారాయణ, ఎస్సై తాతా చార్యులు, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు** : మండలంలో ముంపునకు గురైన వరిచేలను ఆదివారం కలెక్టర్ డీకే బాలాజీ ఎస్పీ గంగాధర్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరిశీలించారు. రైతులను పరామర్శించారు. వడ్లమన్నాడు నుంచి దిగువ లజ్జబండ వరకూ 5 కిలోమీటర్ల మేర డ్రెయిన్ మేట వేసుకుపోయిందని రైతులు కలెక్టర్ బాలాజీకి వివరించారు. కలెక్టర్ అధికారులకు పలుసూచనలు చేశారు. కౌతవరం గ్రామం పునరావాస కేంద్రంలో ఉన్న చెంచుకాలనీ వాసులను కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధర్, ఎమ్మెల్యే రాము పరామర్శించారు. వారికి అందుతున్న సదుపాయాలను అడిగితెలుసుకొన్నారు. పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.



పల్లపు ప్రాంతాలు జలమయం

కూచిపూడి : వరద ముంపు నుంచి తేరుకోక ముందే శని, ఆదివారాల్లో కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. నిడుమోలు ఎస్టీ కాలనీ, మొవ్వ ఎస్సీ బాలుర, బాలికల హాస్టల్‌కు వెళ్లే రహదారులు నీటమునిగాయి. మొవ్వ బాలుర వసతిగృహంలోని మరుగుదొడ్లు సైతం నీటమునిగాయి. కూచిపూడి సిద్దేంద్ర కళాపీఠం రహదారి, బస్టాండ్ ప్రాంతం, పెదపూడి రహదారి, కూచిపూడిలోని ప్రధాన రహదారులు కూచిపూడి, పెదపూడిలోని జగనన్న కాలనీలు నీటమునగటంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. వరుణుడు తన ప్రతాపం చూపటంతో రైతన్నలకు కోలుకోలేని దెబ్బతగిలింది. మొవ్వ - కొడాలి జాతీయ రహదారి మధ్యలో భారీ వృక్షం నేలకొరిగింది. వాహ నాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగటంతో కూచిపూడి ఎస్సై సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని గ్రామ పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది వృక్షాన్ని తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. **పెడన రూరల్** : వారం రోజులుగా ఎడతెరపిలేని వర్షాలతో గ్రామాలలో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారింది. చేవేంద్ర, చెన్నూరు, కొప్పల్లి నందిగం తదితర గ్రామాలలో చేలలో నీళ్లు నిలిచి రైతులు ఆందోళన చెందుతున్నారు. కాకర్లమూడిలో 50 ఎకరాలలో వేరుశనగ పంట నీట మునిగింది.

రైతుల ఆందోళన

పెదపారుపూడి : మోపర్రు, వింజనంపాడు గ్రామాలలో వరద ఆదివారం నాటికీ తగ్గుముఖం పట్టలేదని ఆయా గ్రామాల రైతులు, గ్రామస్థులు తెలిపారు. వన్నేరు, బుడమేరు పొంగటంతో రెండు గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలు నీటమునిగిపోయాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి చూసి వెళ్లారు తప్ప పట్టించుకోవటం లేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **గుడివాడ రూరల్** : గుడివాడ మండలంలో వేలాది ఎకరాలు నీటమునిగిపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయశాఖ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పర్యవేక్షిస్తున్నారు. గ్రామాల్లో ఏరోజుకారోజు బ్లీచింగ్ చల్లి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పారిశుధ్యం విషయంలో కూడా కార్యదర్శులు దగ్గరుండి పర్యవేక్షించటం జరుగుతుంది. ప్రతీ రోజు వర్షం కురవటంతో కార్యక్రమాలకు ఆటంకం కలుగుతున్నప్పటికీ పనులు చేస్తున్నారు. వైద్య సిబ్బంది తదితరులు ప్రజలు ఆరోగ్య విషయాలు తెలుసుకుంటున్నారు.



వర్షపు నీటిలో ఉయ్యూరు ఆర్టీసీ డిపో

ఉయ్యూరు : అధిక వర్షాలకు ఉయ్యూరు ఆర్టీసీ డిపో గ్యారేజితో పాటు, బస్‌స్టాండ్ ఆవరణలో మోకాలు లోతు నీరు నిలిచింది. బస్సులు వర్షపునీటిలో నిలిచిపోగా కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్నోరోజులుగా నీరు నిలిచి బయటకు వెళ్లే మార్గం లేక చెట్లు, ఇతర వ్యర్థాలతో నిండి కుళ్లి దుర్గంధం వ్యాపించడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

దివి రైతుల ఆందోళన

అవనిగడ్డ : ప్రకాశం బ్యారేజీ నుంచి వరద ఉధృతి మళ్లి పెరగటంతో దివి ప్రాంత రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి వరద కొద్దిమేర తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు మళ్లీ వరద పెరుగుతుందనే వార్తలు వెలువడటంతో ఆందోళన చెందుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం 4 లక్షల క్యూసెక్కుల వరద నీరు రావటంతో నది తీర ప్రాంత గ్రామాల ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కోరుతున్నారు. పులిగడ్డ ఆక్విడెక్ట్‌ను తాకుతూ వరద ప్రవాహం కొనసాగుతుంది. నాగాయలంక : కృష్ణానదికి మళ్లీ నాలుగు లక్షల క్యూసెక్కుల వరద నీరు రావటంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు మళ్లీ వరద ప్రవాహం పెరగటంతో రెవెన్యూ, పోలీసు శాఖలు ప్రజలను అప్రమత్తం చేశారు. నాగాయలంకలోని శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ మెట్ల దగ్గరకు వరద నీరు చేరింది.**మోపిదేవి** : కేబీబీ కెనాల్ నుంచి వచ్చే 12వ నెంబర్ కాలువకు గండి పడి మోపిదేవి వార్పు వద్ద నీటి ముంపునకు గురైన పొలాల్లో నేటికీ వరద నీరు తగ్గు ముఖం పట్టకపోవటంతో పంటలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోపిదేవి వార్పు నుంచి ప్రజాశక్తినగర్ కాలనీ వరకు నీరు చొచ్చుకుని మోకాళ్లలోతు చేరాయి. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో పసుపు, కంద, అరటి, బొప్పాయి పంటలు రోజు రోజుకు కుళ్లిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **కోడూరు** : కోడూరు మండల దిగువ ప్రాంతంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి నాట్లు, నారుమడులు సైతం నీటమునిగాయి. వర్షపు నీరు పంట పొలాల నుంచి బయటకు పోయే మార్గం లేదని రైతులు వాపోతున్నారు. ముంపునకు ప్రధాన కారణమైన అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణ పనులను ప్రభుత్వం ఇప్పటికైనా చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



ఆదుకుంటాం : మంత్రి రవీంద్ర

నందివాడ (పుట్టగుంట) : బుడమేరు ముంపు ప్రాంతాలను మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పరిశీలించారు. బుడమేరులో ఆక్రమణ తొలగించాలని జనార్ధనపురం గ్రామస్థులు కోరారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, రానున్న కాలంలో బుడమేరులోని ఆక్రమణలు పూర్తిగా తొలగిస్తామని ఆయన అన్నారు. జొన్నపాడు నుంచి పడవల సహాయంతో బుడమేరు దాటుకుంటూ పుట్టగుంట చిన్నలింగాల, పెదలింగాల, చేదుర్తిపాడు, ఒద్దుల మేరక గ్రామాలను పరిశీలించారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ ముంపు గ్రామాలను, రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. జనసేన నియోజకవర్గ ఇంచార్జ బూరగడ్డ శ్రీకాంత్, ఎస్.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మోపర్రులో ఎమ్మెల్యే కుమార్ రాజా..

పెదపారుపూడి : ముంపు బాధిత రైతులను, ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మోపర్రు గ్రామంలో ఆదివారం నీటమునిగిన వరి పొలాలను, గ్రామాలను పరిశీలించారు. మోపర్రు గ్రామంలో సుమారు 2900 ఎకరాలు పూర్తి స్థాయిలో నీట మునిగిందన్నారు. ఒక ఎకరం పొలం కూడా పనికి రాకుండా పోయిందన్నారు. నీట మునిగిన వారిని పునరావాస కేంద్రాలకు తరలించామని, వారికి అన్ని సౌకర్యా లు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జూపల్లి శేఖర్, ఉచినేని అనిల్, గుండపనేని శ్రీనివాసరావు, చంద్రశేఖర్, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224
నెక్ కోడిగుడ్డు ధర	
విజయవాడ జోన్ రైతు ధర రూ.5.20	

జంక్షన్ - గుడివాడ మార్గంలో రహదారిపై రాకపోకల నిలిపివేత

హనుమాన్‌జంక్షన్ : హనుమాన్‌జంక్షన్ - గుడివాడ మార్గంలో ఆరుగొలను వద్ద రహదారిపై బుడమేరు మూడు అడుగులు మేర ఉధృతంగా ప్రవహిస్తుండడతో ఆ మార్గం లో రాకపోకలు నిలిపివేసినట్లు బాపులపాడు తహసీల్దార్ నాగభూషణం, ఎస్సై జనార్దన్ ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. హనుమాన్‌జంక్షన్ నుంచి గుడివాడ వెళ్లవలసిన వారు గన్నవరం, ఎనికేపాడు, తాడిగడప, కంకిపాడు మీదుగా వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.



సీఎం సహాయ నిధికి జనార్దనరావు రూ.10 లక్షల విరాళం

విద్యాధరపురం, సెప్టెంబర్ 8 : టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటపాటి జనార్దనరావు వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధికి శనివారం సీఎం చంద్రబాబు నాయుడుకు రూ.10 లక్షల విరాళం అంద జేశారు. వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు పర్యవేక్షిస్తూ విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో మకాం వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు. సర్వం కోల్పోయిన బాధితులకు తనవంతుగా సాయం చేయటం ఒక పౌరుడిగా బాధ్యత వహిస్తూ ఈ మొత్తాన్ని అందజేశానని జనార్దన్ చెప్పారు. టీడీపీ నాయకులు మన్నం కొండయ్య, బొర్రా తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

● రెడ్డిగూడెం మండలం నరుకుళ్లపాడు గ్రామ సర్పంచ్ నూనె అప్పిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు నూనె రమాదేవి వరద బాధితుల సహాయార్థం రూ.5 లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌కు అందించారు.

ఎన్నారై గిరిబాబు రూ.5 లక్షల ఆర్థిక సాయం



విస్సన్నపేట : వరద బాధితులకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సమక్షంలో ప్రముఖ ఎన్నారై, తిరువూరు టీడీపీ నాయకుడు వల్లభనేని గిరిబాబు రూ.5 లక్షలు మంత్రి నారా లోకేష్‌కు అందించారు. లోకేష్‌తో పాటు ఎంపీ చిన్ని దాత గిరిబాబును అభినందించారు.

టీజీవీఎస్ అసోసియేషన్ రూ.లక్ష

గన్నవరం : గన్నవరం రాయనగర్‌లోని టీజీవిఎస్ ఎంప్లాయీస్ కల్చరల్ అసోసియేషన్ క్లబ్ తరపున రూ.లక్ష చెక్కును సీఎం చంద్రబాబుకు అసోసియేషన్ నాయకులు అందజేశారు. అధ్యక్షుడు ఎలినేని శ్రీనివాసరావు, కార్యదర్శి బొబ్బా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ ఎంవీఎల్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పేద కళాకారులకు సంస్కార భారతి ఆర్థిక సాయం

విజయవాడ కల్చరల్ : సంస్కార భారతి సంస్థ వరద బాధిత ప్రాంతాలలోని పేద కళాకారులకు ఆర్థిక సహకారం అందించింది. పేద కళాకారులకు 51 మందికి ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున నిత్యావసర వస్తువులు కొనుగోలు నిమిత్తం పంపిణీ చేసింది. రామ లింగేశ్వర్‌పేట, ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్యాలయం హైం దవిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సహ కార్యదర్శి చక్రధారి, సంస్థ ప్రతినిధులు సీతారత్నం, సాయి, భాస్కర శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈమని సైలేంద్రకుమార్ రూప 25 వేలు, కందాలం భానుశ్రీ రూ.10 వేలు అందజేశారు.

ఆస్తి కోసం హత్య..కిరాయి ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీధర్

మోపిదేవి, సెప్టెంబరు 8 : ఆస్తి కోసం కొంగల మందు ఇంజెక్షన్ ఇచ్చి కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన బడే సత్యనారాయణను కిరాయి హంతకులచే హత్య చేసినట్లు డిఎస్పీ మురళీధర్ వెల్లడించారు. హత్య కేసులో అరెస్టు చేసిన నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. డిఎస్పీ మాట్లాడుతూ మృతుడు సత్యనారాయణకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరు కుమారులకు చెరో నాలుగు ఎకరాలు పొలం ఇచ్చి ఆస్తి పంపకాలు చేశాడు. మిగిలిన 10 ఎకరాలకుపైగా భూమిని మృతుడు తన వద్దే పెట్టుకుని తన మరణానంతరం ఇస్తానని చెపాడు. గత కొంతకాలం క్రితం పెద్ద కొడుకు అనారోగ్యంతో చనిపోగా, రెండో కుమారుడు వెంకట రామాంజనేయులుకు మృతుడు సత్యనారాయణ భూమిని ఇస్తాడనే అక్కసుతో పెద్ద కుమారుడి మామ భావించాడు. పెద్ద కుమారుడు రేణుకయ్య మామయ్య కోసూరు సాంబశివరావు, భార్య శాంత లక్ష్మి మృతుడు సత్యనారాయణను తొలగించుకుంటేనే ఆస్తి వస్తుందనే ఆలోచనతో విశ్వనాథపల్లి కొత్తపాలెంలో ఉంటున్న బంధువులు భూపతి రామలక్ష్మణస్వామిని సంప్రదించారు. విశ్వనాథపల్లికి చెందిన కన్నా సురేష్ ద్వారా రేపల్లె ఏరియా గొంగడిపాలెంకు చెందిన సైకం నరేంద్రతో బడే సత్యనారాయణను కిరాయి హత్య చేయాలని మాట్లాడారు. ఒప్పందం ప్రకారం లంకేవాని దిబ్బకు చెందిన తిరుమలశెట్టి దానియేలు, సొర్లగొందికి చెందిన తమ్ము శ్రీకృష్ణ, పులిగడ్డకు చెందిన సైకం వెంకటేశ్వరరావులను మాట్లాడుకున్నారు. సాంబశివరావు, రామలక్ష్మణస్వామి తదితరులు గాయాలు కనిపించకుండా కొంగల మందు పెట్టి చంపాలని సహజ మరణంగా చిత్రీకరిస్తే బాగుంటుందని నిర్ణయానికి వచ్చారు. గ్రామానికి ముందుగా రెండు రోజులు చేపల వేట పేరుతో వచ్చి రెక్కీ నిర్వహించారు. నాల్గో తేదీ రాత్రి గ్రామంలోని సత్యనారాయణ ఇంటికి వెళ్లి కరకట్ట దారిలో కొంగల మందును నీటిలో కలిపి సిరంజిలో ఎక్కించి ముందుగా అనుకున్న ప్రకారం ఇంజెక్షన్ చేశారు. సత్యనారాయణ కేకలు వేయటంతో మొహంపై పిడి గుద్దులు గుద్దారు. కేకలు విని పక్క గదిలో ఉంటున్న భార్య కుమార్తె రావటంతో వారిని కొట్టి గదిలో పెట్టి తలుపులు వేసి పారిపోయారు. కుమారుడు వెంకట రామాంజనేయులు ఫిర్యాదు మేరకు హత్యకేసులో నిందితులు కోసూరు సాంబశివరావు, భూపతి రామలక్ష్మణస్వామి, సైకం నరేంద్ర, తిరుమలశెట్టి దానియేలు, తమ్ముల శ్రీకృష్ణ, సైకం వెంకటేశ్వరరావులను ఆదివారం ఉదయం అరెస్టు చేసినట్లు తెలిపారు. రెం డు మోటారు సైకిళ్లు, సెల్‌ఫోన్‌లు, గ్లౌజులు, సిరంజీ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు డిఎస్పీ తెలిపారు. ముద్దాయిలను కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు . చల్లపల్లి, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, కంకిపాడు ఎస్సైలు దర్యాప్తు పాల్గొన్నట్లు తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ సారథిగా బొర్రా

● విజయవాడ నగర అధ్యక్షుడిగా నరహరశెట్టి

విజయవాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా బొర్రా కిరణ్ నియమితులయ్యారు. విజయవాడ నగర కమిటీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు పేరును పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ప్రకటించారు. కిరణ్ మైలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో అక్కడి నుంచి పోటీ చేశారు. నరహరశెట్టి ప్రస్తుతం నగర అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయనను కొనసాగిస్తూ ఆదేశాలు ఇచ్చారు. 2019 ఎన్నికల్లో నరసింహారావు విజయవాడ పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేశారు.

కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా గొల్లు కృష్ణ

మచిలీపట్నం టౌన్ : కృష్ణాజిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా గొల్లు కృష్ణను నియమించారు. గన్నవరం నియోజకవర్గం అంబాపురం శివారు ఏ. సీతారామపురం గ్రామానికి చెందిన గొల్లు కృష్ణ పలు పదవుల్లో వ్యవహరించారు. 2019,2024 సార్వత్రిక ఎన్నికల్లో మచిలీపట్నం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేశారు. వీరి నియామకం పట్ల మచిలీపట్నం కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ మతీన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నిరంతరం సాయం చేస్తున్నారిలా..



అవనిగడ్డ : టీడీపీ నేత, ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్థన్ ఆర్థిక సహకారంతో అవనిగడ్డ మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మండల తెలుగుదేశం పార్టీ భోజనం సమకూర్చగా, మాజీ ఎంపీ కొనకళ్ల కార్యక్రమం ప్రారంభించారు. ఎన్ఆర్ఐ టీడీపీ ఆర్థిక సహకారంతో దుప్పట్లు, దుస్తుల పంపిణీని మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. దక్షిణ చిరువోలులంక, పులిగడ్డ, పాత ఎడ్లంక గ్రామాల్లోని వరద బాధితులకు వీటిని పంపిణీ చేశారు. మండలి వెంకట్రామ్, కొల్లూరి వెంకటేశ్వరరావు, మోర్ల రాంబాబు, బండే నాగ వెంకట కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు. వరదల్లో ముంపుకు గురైన మత్స్యకార కుటుంబాలకు నిత్యవసర కిట్లను పంపిణీ పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మండలి కేశవి, జనసేన నేతలు మత్తి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్** : దక్షిణ చిరువోలులంకలో విద్యానికేతన్ అధినేత పంద్రాజు లంకమ్మ ప్రసాద్ దుప్పట్లు, నిత్యావసరాలను సమకూర్చారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ద్వారా హాయాన్ని బాధితులకు అందజేశారు. గుడివాక శివరావు, మత్తి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి** : మండలంలోని వరద ప్రభావిత గ్రామాలైన కె.కొత్తపాలెం, బొబ్బర్లంక గ్రామాల్లోని బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సమకూర్చిన నిత్యావసర సరుకులను బాధిత కుటుంబాలకు గ్రామసర్పంచ్‌లు, కొక్కిలిగడ్డ మాధవి, దొప్పలపూడి గంగాభవాని పంపిణీ చేశారు. చందన రంగారావు, టీడీపీ నాయకులు దొప్పలపూడి జగదీష్, రావి రత్నగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డే బసవరాజ్యం ట్రస్టు సేవలు



ఉయ్యూరు : విజయవాడ అజిత్ సింగ్‌నగర్, ఇతర వరద బాధిత ప్రాంతాల్లో వడ్డే బసవరాజ్యం చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవాకార్యక్రమాలు చేపట్టినట్టు ట్రస్టు బాధ్యుడు వడ్డే సాయి శోభన్ తెలిపారు. మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు నివాసంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ఐదురోజులుగా బాధితులకు ఆహారం, తాగునీరు, ట్యాంకరు ద్వారా నీరు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండలం లంక గ్రామాల బాధితులకు భోజనం, తాగునీటి ప్యాకెట్లు అందచేశామన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు సూచన మేర సేవాకార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపా రు.

అండగా పుట్టగుంట



హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ రామన్నగూడెం, ఓగిరాల, వైకుంఠలక్ష్మీపురం రూ.50వేల రూపాయల ఆర్థిక సాయంతో పాటు ఆహారపదార్థాలను ఆదివారం అందజేశారు. ముంపు తగ్గేవరకు ప్రతిరోజు బాధితులకు అవసరమైన ఆహారం, అవసరమైన సహకారం అందిస్తానని పుట్టగుంట గ్రామస్తులకు హామీ ఇచ్చారు. హనుమాన్‌జంక్షన్, : బాపులపాడు జడ్పీ హైస్కూల్ పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందున్న వరద బాధితు లకు బాపులపాడు మండల ఆర్యవైశ్య సంఘం గత రెండు రోజులుగా అన్నదానం చేస్తోంది. ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, మాజీ జడ్పీటీసీ సభ్యులు సుంకర సుభాష్‌చంద్రబోస్,పైడి సుధాకర్, ఈవో సీహెచ్. ప్రసాద్, తహసీల్దార్ నాగభూణం,రెవెన్యూ సిబ్బంది తదితరులు పర్యవేక్షిస్తున్నారు. వరద బాధితుల సహాయార్థం మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ తరపున రూ.50వేలు విరాళాన్ని జిల్లా శాఖ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేసినట్లు మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు.



దొండపాడు టీడీపీ ఆధ్వర్యంలో..

గుడివాడ రూరల్ : దొండపాడు గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో నందివాడ మండలంలోని వరద బాధిత ప్రజలకు ఆహార పొట్లాలను ప్రత్యేక వాహనంలో పంపించారు. దొండపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ ముసునూరి రాజేంద్ర ప్రసాద్, లింగమనేని వీర బసవయ్య తదితర టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వందలాది ఆహార పొట్లాలను తయా రు చేసి నందివాడ మండలంలోని వరద బాధితులకు అందజేశామన్నారు.

నేడు పంచాయతీలకు రూ. లక్ష చొప్పున పంపిణీ

కంకిపాడు : రాయల్ ఏసీ కన్వెన్షన్ సెంటర్‌లో పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల పరిధిలోని వరద ప్రభావిత పంచాయతీలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రకటించిన రూ. లక్ష చొప్పున ఆయా పంచాయతీలకు అందజేయనున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండవ రాజేష్ తెలిపారు. ముప్పా రాజా తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల బాసట

విస్సన్నపేట, సెప్టెంబరు 8 : వరద బాధితులకు విస్సన్నపేట జామియా మసీదు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ముస్లింలు ఐదు వేల వాటర్ బాటిళ్లు, పాల ప్యాకెట్లు వితరణగా వించారు. షేక్ బాజీబాబా, షైక్ సుభాని, యర్ర సుభాని, తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు** : తిరువూరు పట్టణ టీడీపీ నాయకులు విజయవాడలోని కండ్రిక, పాయకపురం, వాంబేకాలని, అంబాపురం తదితర ప్రాంతాల్లో బాధితులకు ఆహారం, తాగునీరు అందించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు బొమ్మసాని మహేష్, సింధు శ్రీను, యండ్రాతి రంజిత్, చంద్రశేఖర్, మస్తాన్, హని తదితరులు పాల్గొన్నారు.



ఫణికృష్ణ కోసం పడవలో గాలిస్తున్న ఆర్డీవో పద్మావతి, తహసీల్దారు

కేసరపల్లి-కంకిపాడు మధ్య

బుడమేరులో యువకుడి గల్లంతు



వరదలో చిక్కుకున్న కారు

గన్నవరం/పెడన, సెప్టెంబరు 8 : కేసరపల్లి-కంకిపాడు మధ్య బుడమేరులో యువకుడు గల్లంతయిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బందరు మండలం హుస్సేన్‌పాలెంకు చెందిన కలిదిండి ఫణికృష్ణ(40) హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. గన్నవరంలో అతడి స్నేహితుడి ఇంటికి కారులో వచ్చాడు. తిరిగి సాయంత్రం వెళుతుండగా కేసరపల్లి వద్ద బుడమేరు ఉధృతి పెరగడంతో ముందుకు వెళ్లలేనని గ్రహించి కారును రివర్స్ చేశాడు. దీంతో కారు ఆగిపోయింది. కారు దిగి తన స్నేహితుడికి వీడియోకాల్ చేసి చూపించాడు. కారు ఆగిపోయిందని, బుడమేరు బాగా వరదతో పొంగుతోందని చెప్పాడు. వెంటనే అక్కడికి వెళ్లిన స్నేహితుడికి ఫణికృష్ణ కనిపించలేదు. ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. వెంటనే గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు అక్కడికి చేరుకునేసరికి కారు చెట్టుకు ఆనుకుని పక్కన ఉంది. ఫణికృష్ణ మాత్రం లేకపోవటంతో వరదకు కొట్టుకుపోయి ఉంటాడని ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం గుడివాడ ఆర్డీవో పద్మావతి, డీఎస్పీ సీహెచ్ శ్రీనివాస రావు, తహసీల్దారు శివయ్య, సీఐ శివ ప్రసాద్, ఆర్ఐ ఉదయ్‌కుమార్ పడవపై పరిశీలించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కూడా వచ్చి గాలింపు చర్యలు చేపట్టాయి.

మూగవ్యక్తిని కాపాడిన అధికారులు ..

కేసరపల్లి దగ్గర బుడమేరు వరదలో చిక్కుకున్న మూగ వ్యక్తిని అధికారులు కాపాడారు. ప్రభు (మూగవ్యక్తి) వరదల్లో చిక్కుకుపోవడంతో రైతులు అతడిని దూరం నుంచి చూసి తహసీల్దారు శివయ్యకు సమాచారం ఇచ్చారు. వెంటనే పడవలో రెస్క్యూ టీమ్‌ను పంపి క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. అతడి వివరాలు తెలియాల్సి ఉంది.

● నున్న నుంచి కేసరపల్లి వైపు గూగుల్ మ్యాప్ ద్వారా తల్లి కొడుకు కారులో సావరగూడెం మీదుగా వెళుతు వరద నీటిలో చిక్కుకున్నారు. బంధువులకు, స్నేహితులకు సమాచారం ఇవ్వడంతో వారు ఎంపీడీవో ఇ.సత్యకుమార్‌కు చెప్పారు. వెంటనే పంచాయితీ సిబ్బంది అక్కడికి చేరుకుని తల్లి కొడుకును క్షేమంగా తీసుకొచ్చారు.

ముంపు బాధితుల సేవలో 'మైనారిటీ'



విజయవాడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : వరద ముంపులో చిక్కుకున్న బాధితులను ఆదుకోవడానికి మైనారిటీలు ముందుకొచ్చారు. విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్న మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి ముస్లింలు ఇక్కడికి వచ్చి బాధితులకు భరోసా ఇస్తున్నారు. ఆ సమితి అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ ఉత్తరాది రాష్ట్రాల నుంచి బెడ్‌షీట్లు, దుప్పట్లు రప్పించారు. అలాగే నిత్యావసర సరుకులను సమకూర్చుకున్నారు. సమితిలో పదవులు నిర్వహిస్తున్న వారికి రూటు మ్యాప్ ఇచ్చి వాటిని ప్రత్యేక వాహనాల్లో వరద బాధితుల వద్దకు పంపుతున్నారు.



పాతరాజరాజేశ్వరిపేటలో వరద ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి సవిత



పాల ఫ్యాక్టరీ ప్రాంతంలో మంత్రి అచ్చెన్నాయుడు



వాంబేకాలనీలో మంత్రులు అనిత, అనగాని సత్యప్రసాద్‌తో కేశినేని చిన్ని

బాధితులను ఆదుకుంటాం





సహాయక చర్యలు ముమ్మరం

- వరద ప్రాంతాల్లో పాలు, నీరు, ఆహారం సరఫరా
- 104 అంబులెన్స్‌ల ద్వారా వైద్య సేవలు
- ముంపు ప్రాంతాలకు మంత్రులు, అధికారులు
- డ్రెయిన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం
- పంట నష్టం పూర్తిగా చెల్లిస్తాం : మంత్రి రవీంద్ర

వన్‌టౌన్, సెప్టెంబరు 8 : వాంబేకాలనీలో డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఆదివారం హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లతో కలిసి ఎంపి వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. కండ్రిక, వాంబేకాలనీలో వరద బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.



బాధితులకు బియ్యం బస్తాలను అందజేశారు. అనంతరం ట్రాక్టర్ పై పాయకాపురం, పైపులరోడ్డు మీదుగా వాంబేకాలనీలో పర్యటించారు. బాధితులను పరామర్శించి వారి సమస్యలు తెలుసుకుని వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వాంబేకాలనీలో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుప్పట్లు, పచ్చళ్లు, వాటర్ బాటిళ్ల ను బాధితులకు అందజేశారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, వరద బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా డ్రోన్స్ ద్వారా లిక్విడ్ బ్లీచింగ్ స్ప్రే చేస్తున్నామన్నారు. హోంమంత్రి అనిత, మంత్రి సత్యప్రసాద్‌లు మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే నగరానికి వరద విపత్తు వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎనిమిది రోజులుగా రేయింబవళ్లు నగరాన్ని సాధారణ స్థితికి తెచ్చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు.

అన్నివిధాల ఆదుకుంటాం.. మంత్రులు

చిట్టినగర్ : వరద ముంపు బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని మంత్రులు సవిత, అచ్చెన్నాయుడులు అన్నారు. పాతరాజరాజేశ్వరిపేటలో వరద ముంపు ప్రాంతాలను వారు పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ఆహార పొట్లాలు, పాలు, నీరు పంపిణీ చేశారు. ప్రభుత్వమే ఇళ్లు, వీధులన్నీ శుభ్రం చేయిస్తుందన్నారు. బాధితులకు ఆరు రకాల నిత్యావసర సరకులు అందజేస్తున్నామన్నారు. కె.ఎల్.రావునగర్, పాలఫ్యాక్టరీ వరద ప్రభావిత ప్రాంతాలలో మంత్రి అచ్చెం నాయుడు టీడీపీ నేతలతో కలిసి పరిశీలించారు.

54వ డివిజన్‌లో మంత్రి పర్యటన

వన్‌టౌన్ : వరద ముంపునకు గురైన పశ్చిమ నియోజకవర్గం 54వ డివిజన్ పరిధిలోని పంజా సెంటర్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్‌తో కలిసి ఆదివారం పర్యటించారు. బాధితులను పరామర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే తాగునీరు, విద్యుత్ పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.



చిన్నాపురంలో పంట పొలాలను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

పంట నష్టం చెల్లిస్తాం

ముంపు పొలాల పరిశీలనలో మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : ఈ క్రాప్‌లో నమోదు కానప్పటికీ పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని రాష్ట్ర గనులు, భూగర్భవనులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలంలోని భోగిరెడ్డిపల్లి, చిన్నాపురం గ్రామాల్లో పంట నష్టపోయిన పంట పొలాలను మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం సందర్శించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ, వేసవిలో డ్రైన్లు సకాలంలో పూడిక తీసినట్లయితే ఇంత పెనుముప్పు వచ్చేది కాదన్నారు. విజయవాడతో పాటు వివిధ ప్రాంతాల్లో బుడమేరు వల్ల అపార నష్టం కలిగిన ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటున్నామన్నారు. ప్రకాశం బ్యారేజి గేట్లు ధ్వంసం చేయడానికి వైసీపీ నాయకులు ప్రయత్నించారన్నారు. దీనిపై విచారణ జరుపుతున్నామన్నారు. మంత్రి కొల్లు రవీంద్రతో పాటు ఆర్డీవో వాణి, తహసీల్దార్ మధుసూదనరావు, మండల వ్యవసాయాధికారి హారిక, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గోపు సత్యనారాయణ, కుంచే నాని, తలారి సోమశేఖర్, అనిశెట్టి వేణు, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, తలారి సోమశేఖర్, జనసేన నాయకుడు మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకులకు టోకరా కొట్టిన కట్టా దుర్గ, నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

బ్యాంకులను మోసం చేసి డిపాజిట్లు కాజేసిన నిందితుల అరెస్టు

నకిలీ పత్రాలతో రూ. కోటి డ్రా

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 8 : నకిలీ ధృవీకరణ పత్రాలతో పలు జాతీయ బ్యాంకులను మోసం చేసిన కేసులో నలుగురిని ఆర్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను సీఐ ఏసుబాబు ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మచిలీపట్నంకు చెందిన వేమూరి లక్ష్మీ తులసి మృతిచెందగా.. ఆమె బ్యాంకు డిపాజిట్లు, లాకర్‌లో నగదు, నగలకు ఆమె చెల్లెలు రమాసుందరిని నామినీగా పేర్కొంది. వ్యసనాలకు లోనైన ప్రధాన నిందితుడు కట్టా దుర్గ కాత్యాయని అనే మహిళకు ఆశ చూపాడు. కాత్యాయని పేరును రమాసుందరిగా మార్చి నకిలీ పత్రాలు, కార్డులతో ఎస్‌బీఐ నుంచి రూ. 56 లక్షలు తీసుకున్నారు. మేనేజర్ రమణరావు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

నిందితులు స్టేట్ బ్యాంకుతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, అనుబంధ సంస్థల్లో లక్ష్మీతులసి పేరున ఉన్న డిపాజిట్లను తీసుకోవడానికి నకిలీ పత్రాలు, ఆధార్ కార్డులను తయారు చేసి మోసం చేశారు. వీటి విలువ దాదాపు రూ.కోటి ఉంటుంది. బ్యాంకులను మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడు కట్టా దుర్గతో పాటు నకిలీ ధృవపత్రాలు సమర్పించి నగదు డ్రా చేసిన కాత్యాయని, ఫణీంద్ర, మహేష్‌లను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు దుర్గ టీడీపీ మచిలీపట్నం పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి. ఈ ఆరోపణలపై అతడిని పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.



కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులును అభినందిస్తున్న టీడీపీ నేతలు

నష్టంలోను బాధితులకు అండగా

కృష్ణామిల్క్ యూనియన్‌కు అభినందన

డెయిరీ పునరుద్ధరణకు చినజీయర్ విరాళం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విజయ డెయిరీ వరదల్లో మునిగి రూ.కోట్ల నష్టం వాటిల్లినా మానవతా దృక్పదంతో వరద బాధితులకు రూ. 50 లక్షల విరాళం అందజేయడం అభినందనీయమని చిన్న జీయర్‌స్వామి అన్నారు. ఇటీవల వరదలకు విజయవాడ ఫ్యాక్టరీకి కలిగిన నష్టాన్ని గురించి ఛైర్మన్ చలసాని ఆంజనేయులుకు ఫోన్‌చేసి అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు రూ. 11 లక్షల విరాళం ప్రకటించి త్వరలో పునఃప్రారంభం కావాలని ఆకాంక్షించారు. వరదబాధితులకు అండగా నిలిచిన ఛైర్మన్ చలసాని ఆంజనేయులును టీడీపీ నాయకులు అంక సురేంద్ర మోహనబెనర్జీ, గుండపనేని ఉమావరప్రసాద్ తదితరులు అభినందించారు.

తేరుకుంటున్నాయి..

- అజిత్ సింగ్‌నగర్‌లో తగ్గుతున్న వరద
- వైఎస్సార్ కాలనీలోనూ ఇదే పరిస్థితి
- తగ్గుముఖం పట్టిన బుడమేరు
- వెలగలేరు నుంచి 5వేల క్యూసెక్కుల నీరు
- నేటినుంచి తెరుచుకోనున్న బడులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఎటుచూసినా నీళ్లు. అడుగు తీసి బయటకు వేయలేని పరిస్థితి. మేడ మెట్లు దిగి కిందికి రాలేని దుస్థితి. పగటి కాంతులు తప్ప సూర్యాస్తమయం తర్వాత విద్యుత్ వెలుగులు లేవు. ఇదీ వరద ప్రాంతాల్లోని పరిస్థితి. ఈ పరిస్థితి ఇప్పుడిప్పుడే మారుతోంది. ముంచుకొచ్చిన వరద క్రమంగా తగ్గుతోంది. ఇళ్లలో ఉన్న నీరు మెట్ల వరకు వచ్చింది. నీళ్ల అడుగున ఉన్న రహదారులు పైకి కనిపిస్తున్నాయి. మొన్నటి వరకు మోకాళ్ల లోతు వరకు ఉన్న నీరు ఇప్పుడు పాదాల వరకు చేరింది. బుడమేరు కాల్వకు కవులూరు వద్ద పడిన మూడు గండ్లను ఆర్మీ ఇంజనీరింగ్ సిబ్బంది ఆగమేఘాల మీద పూడ్చడంతో అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్, జక్కంపూడి కాలనీ, వాంబేకాలనీలకు ముంపు తప్పుతోంది. రెండు రోజుల క్రితం పెరిగిన నీరు నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. డాబా కొట్లు సెంటర్, పైపుల రోడ్డు ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై నిలచిపోయిన నీరు ఆదివారం తొలగిపోయింది. కాలనీలు, వీధుల్లో ఉన్న నీరు తగ్గిపోయింది. దీనితో అగ్నిమాపక శాఖ వాహనాలు ఆయా కాలనీల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టాయి. రహదారులను, ఇళ్లలో ఉన్న బురదను ఫైర్ గన్ల ద్వారా శుభ్రం చేస్తున్నారు. దోమలు చెలరేగకుండా వీఎంసీ సిబ్బంది స్ప్రే జల్లుతున్నారు. వరద కారణంగా కొట్టుకు వచ్చిన చెత్తచెదారాన్ని సిబ్బంది తొలగిస్తున్నారు.



ఇంటిని శుభ్రం చేసుకుంటున్న బాధితులు

నేటి నుంచి బడులు

వానలు, వరదల కారణంగా పాఠశాలలకు పడిన తాళాలను సోమవారం నుంచి తీయనున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు యధావిధిగా పనిచేస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు తెలిపారు. ఇంకా వరద ముంపు ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలు, పునరావాస కేంద్రాలుగా ఉన్న పాఠశాలలకు మాత్రం సెలవులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఎలాంటి వరద ప్రభావం లేని ప్రాంతాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోవచ్చని తెలిపారు.

75శాతం విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

వరద ముంపు ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఒక్కొక్కటిగా వెలుగుతున్నాయి. ఇప్పటి వరకు కొవ్వొత్తులు, చార్జింగ్ లైట్ల వెలుతురులో గడిపిన బాధితుల ఇళ్లలో విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. వరద నీరు తగ్గిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను సీపీడీసీఎల్ సిబ్బంది పునరుద్ధరిస్తున్నారు. అజిత్‌సింగ్ నగర్, వాంబేకాలనీ, రాజీవ్‌నగర్, కండ్రిగ, నున్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు సీపీడీసీఎల్ ఎస్ఈ అంకాల మురళీమోహన్ తెలిపారు. వైఎస్సార్ కాలనీలో మాత్రం 75శాతం మాత్రమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఇంకా ఇక్కడ రెండు అడుగుల మేర నీరు నిలిచి ఉండిపోవడంతో సరఫరాను పునరుద్ధరించడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ బ్లాక్‌కు ప్యానల్ బోర్డులు ఉంటాయి. ఇవన్నీ బ్లాక్‌లకు కిందనే ఉంటాయి. వరదకు ఈ బోర్డులన్నీ నీళ్లలో మునిగిపోయాయి. కొన్ని బోర్డులు పనిచేసినా, మరికొన్ని బోర్డులు పనిచేయలేదు. దీనితో విద్యుత్ శాఖ వెంటనే 252 ప్యానల్ బోర్డులను కొనుగోలు చేసి అమర్చింది. వైఎస్సార్ కాలనీలో మిగిలిన 25శాతం విద్యుతను మరో రెండు రోజుల్లో పునరుద్ధరిస్తామని ఎస్ఈ చెప్పారు.

'కూర' కోసం క్యూ

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న వారికి తక్కువ ధరకు కూరగాయలను విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రైతుబజార్ల నుంచి కూరగాయలను కొనుగోలు చేసి మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై వాటిని అందజేస్తోంది. రెండు, ఐదు, పది రూపాయలకు కూరగాయలను విక్రయిస్తోంది. ఇందుకోసం 40 మెట్రిక్ టన్నుల కూరగాయలను మార్కెటింగ్ శాఖ సేకరించింది. ప్రత్యేక వాహనాల్లో ఈ కూరగాయలు, ఆకుకూరలను ముంపు తగ్గిన ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు దాతలు ఇచ్చిన ఆహారంతో కడుపు నింపుకున్న బాధితులు ఈ కూరగాయలను తీసుకోవడానికి ఎగబడుతున్నారు. అజిత్‌సింగ్‌నగర్, పైపులరోడ్డు, వాంబేకాలనీ ప్రాంతాల్లో నీరు క్రమంగా తగ్గుముఖం పట్టడంతో కూరగాయల వాహనాలను ఆయా ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. ఈ కూరగాయలు కొనుగోలు చేయడానికి గంటల తరబడి క్యూల్లో నిలబడుతున్నారు. తక్కువ ధరకు ప్రభుత్వం కూరగాయలను అందిస్తుండడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మృతుడు రామభూషణం(53), హత్యా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సత్యన్నారాయణ, ఎస్సై జనార్దన్

నిద్రిస్తున్న భర్తపై దాడి

అత్త, భార్య ఘాతుకం.. అక్కడికక్కడే మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : నిద్రిస్తున్న భర్తపై కర్రతో దాడిచేసి హత్యచేసిన ఘటన బొమ్ములూరు గ్రామంలో శనివారం ఉదయం జరిగింది. సీఐ సత్యన్నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్ములూరు గ్రామానికి చెందిన కన్నెగంటి రామభూషణంరావు ఇంటిలో నిద్రిస్తుండగా భార్య నాగశిరోమణి తన తల్లి ఝాన్సీలక్ష్మితో కలిసి కర్రతో తలపై బలంగా కొట్టగా అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మద్యానికి బానిసై డబ్బుకోసం ఇంటివద్ద రోజూ గొడవ చేస్తూ భార్యను కొడుతూండేవాడని బంధువులు తెలిపారు. మంచిర్యాలకు చెందిన మృతుడి సోదరి పెండ్యాల పూర్ణకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

సైకిల్ మెకానిక్ మృతి

వన్‌టౌన్ : బుడమేరు వరద ముంపు కారణంగా సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌కు చెందిన గోరేపూడి సుబ్రహ్మణ్యం (41) శనివారం మృతిచెందాడు. గాంధీనగర్‌లో ఓ సైకిల్ షాపులో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. సుబ్రహ్మణ్యం ఇల్లు పూర్తిగా వరద నీటితో నిండిపోయింది. పై అంతస్తులోకి కుటుంబసభ్యులతో వెళ్లాడు. ఐదురోజుల పాటు ఆహారం లేకపోవటంతో అనారోగ్యానికి గురయ్యాడు. శనివారం ఉదయం ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబసభ్యులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని కృష్ణలంక స్మశానవాటికకు తరలించి ఖననం చేశారు. సుబ్రహ్మణ్యంకు భార్య, కుమార్తె, కుమారుడు అన్నారు.

జాతీయ రహదారిపై అదుపుతప్పి బస్సు బోల్తా

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రాజమండ్రి నుంచి బెంగుళూరు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వీరవల్లి వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడిన ఘటన శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరవల్లి వద్ద జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీటిని గమనించక వేగంగా వెళుతున్న బస్సును ఆపేందుకు ప్రయత్నించే క్రమంలో మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సు బోల్తాకొట్టి రహదారికి అడ్డంగా పడిపోయింది. సమాచారం అందుకున్న వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బస్సు డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలు కాగా ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. బస్సులో ఉన్న ప్రయాణికులు 8మందికి ఎటువంటి గాయాలుకాలేదు. వారిని వేరే వాహనంలో విజయవాడ తరలించి, రహదారికి అడ్డుగా పడిఉన్న బస్సును క్రేన్ సాయంతో ప్రక్కకు తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

నేటి నుంచి వ్యాధులపై సర్వే

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

వన్‌టౌన్ : విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో వ్యాధులపై సోమవారం నుంచి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ సర్వే కోసం 150 వైద్య బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విజయవాడలో ఆదివారం సర్వే బృందాలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మొత్తం 150 బృందాలను నియమించామని, ప్రతి బృందంలో ముగ్గురు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఒక ఏఎన్ఎం ఉంటారన్నారు. వరద ముంపు పూర్తిగా తొలగిన 32 వార్డుల్లో ఈ సర్వే జరుగుతుందన్నారు. వార్డుల పరిధిలో మొత్తం 149 సచివాలయ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి సీహెచ్‌వో నాలుగురోజుల్లో 300 నుంచి 400 కుటుంబాలలోని ఆరోగ్య వివరాలను సేకరిస్తారన్నారు. దగ్గు, జలుబు, జ్వరం, బీపీ, మధుమేహం, చర్మవ్యాధులు, పాము, తేలు కాట్లు, గాయాలకు సంబంధించిన వివరాలను తీసుకుంటారన్నారు. ఇప్పటి వరకు ఆరోగ్య శాఖ వరద బాధితుల కోసం లక్షకు పైగా అత్యవసర మందుల కిట్లను అందజేసిందని, సంబంధించిన సమాచారాన్ని కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్లు ఈ సర్వేకోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పొందుపరుస్తారన్నారు. కుటుంబసభ్యులు అందించిన సమాచారం మేరకు వ్యాధి తీవ్రతను బట్టి సమీపంలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌కు గాని, ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఉచిత వైద్యశిబిరాలకుగాని, ప్రభుత్వ ఆసుపత్రులకు గాని పంపిస్తారన్నారు. కిట్లు అయిపోతే ఆయా సచివాలయాల నుంచి మరుసటిరోజు ఏఎన్ఎంల ద్వారా ఆయా కుటుంబాలకు అందిస్తారన్నారు. ఈ సర్వే ద్వారా వరదల వలన ఎటువంటి వ్యాధులు వస్తున్నాయో, ఏఏ ప్రాంతాల్లో అధికంగా ఉన్నాయో తెలుసుకోవటానికి వీలవుతుందని, ఆ మేరకు వైద్య సహాయం అందించటానికి వీలవుతుందని చెప్పారు. గత 50 సంవత్సరాల కాలంలో ఎన్నడూ చూడని విపత్తును విజయవాడ ప్రజలు అనుభవించారని, ఈ విపత్కర పరిస్థితుల్లో బాధితులను ఆదుకుంటానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా బృందాలకు సర్వే లక్ష్యాలను మంత్రి వివరించారు. నాలుగు రోజుల పాటు సర్వేను చిత్తశుద్ధితో నిర్వహించి, ప్రజల మన్ననలను పొందాలని, విపత్తులో ఉన్న సాటి ప్రజలను ఆదుకోవటం మానవతా ధర్మమని, ప్రజలకు తగు సమయాల్లో వైద్యం అందించాల్సిన బాధ్యత కూడా సిబ్బందికి ఉందని తెలిపారు. బాధితుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు వైద్య సలహాలను ఇప్పించాలన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణ బాబు మాట్లాడుతూ సర్వే సమయంలో వివిధ రకాల వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు తీసుకోవాల్సిన చర్యల పై కూడ తగు సూచనలు చేయాలని తెలిపారు. సి.ఎం నారా చంద్రబాబు నాయుడు వరద బాధిత ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమీషనర్ హరికిరణ్ మాట్లాడుతూ ఈ సర్వే కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ల గురించి బృందాలకు వివరించారు. వద ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ 181 వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని, వ్యాధులతో బాధపడుతున్న వరద బాధితులను పంపించాలన్నారు. సర్వే ఫలితాల కోసం ఎప్పటికప్పుడు అవసరమైన మందులను అందిస్తామన్నారు.

స్పోర్ట్స్

టెస్టుల్లోకి పంత్ పునరాగమనం

బంగ్లాతో తొలిటెస్ట్‌కు టీమిండియా ఎంపిక


పంత్


యశ్‌ దయాళ్‌

ముంబై: దాదాపు 20 నెలల తర్వాత రిషబ్ పంత్ టెస్ట్ టీమ్‌లో పునరాగమనం చేశాడు. ఈ నెల 19 నుంచి స్వదేశంలో బంగ్లాదేశ్‌లో జరిగే రెండు టెస్టల సిరీస్‌లో భాగం మొదటి మ్యాచ్‌లో కోసం 16 మంది సభ్యుల భారత జట్టును బీసీసీఐ ఆదివారం ప్రకటించింది. గతేడాది ఇంగ్లండ్‌తో సిరీస్‌కు దూరమై కోహ్లీ కూడా జట్టులో చోటు దక్కించుకొన్నాడు. రోడ్డు ప్రమాదం నుంచి బయట పడి రీఎంట్రీ ఇచ్చిన తర్వాత పంత్‌ను తొలిసారి టెస్ట్‌లకు ఎంపికయ్యాడు. అయితే, షమి పునరా గమనం మరికొంత ఆలస్యం కానుంది. లెఫ్టామ్ పేసర్ యశ్ దయాళ్‌కు తొలిసారి సెలెక్టర్ల నుంచి పిలుపొచ్చింది. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడిన కేఎల్ రాహుల్‌కు మరో అవకాశం లభించింది.

భారత జట్టు (తొలి టెస్ట్): రోహిత్ శర్మ (కెప్టెన్), జైస్వాల్, గిల్, కోహ్లీ, రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), అశ్విన్, జడేజా, అక్షర, కుల్దీప్, సిరాజ్, ఆకాష్ దీప్, బుమ్రా, యశ్.

పారాలింపిక్స్

లక్ష్యాన్ని ఛేదించి బలమైన శక్తిగా ఎదిగి..

29 పతకాలతో భారత్ ఘనమైన ముగింపు

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

పది రోజులకుపైగా క్రీడాభిమానులను అలరించిన పారాలింపిక్స్‌కు ఆదివారంతో తెరపడింది. ఈ క్రీడల్లో భారత అథ్లెట్లు నిర్దేశించుకున్న 25 పతకాల లక్ష్యాన్ని అలవోకగా దాటేశారు. టోక్యో పారాలింపిక్స్‌లో 19 పతకాలతో అదరగొట్టడం ఈసారి క్రీడల్లో మనం 25కిపైగా మెడల్స్ సాధిస్తామనే లక్ష్యాన్ని నిర్దేశించుకొనేందుకు ప్రేరణ అయ్యింది. పారిస్‌లో మొత్తం 29 పతకాలు (7 స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలు) సొంతం చేసుకున్న భారత్ భవిష్యత్‌లో ఈ క్రీడల్లో బలమైన శక్తిగా ఎదుగుతున్నామని నిరూపించింది. ఇక..ఈసారి మన పతకాల్లో ఏకంగా ఏడు స్వర్ణాలుండడం రికార్డు. 29 పతకాల్లో.. ట్రాక్, ఫీల్డ్ విభాగంలోనే 17 రావడం ఇంకో విశేషం. చైనా 200పైగా మెడల్స్‌తో అగ్రస్థానంలో నిలవగా..భారత్ 18వ స్థానానికి దూసుకొచ్చింది.


సెమా

అదిరే ప్రదర్శన..: 84 మంది భారత బృందంలో పలువురు అథ్లెట్లు చారిత్రక ప్రదర్శనతో పతకాలు పట్టేశారు. మహిళల 100మీ., 200మీ. స్ప్రింట్ టీ35 విభాగాలలో ప్రీతిపాల్ రెండు కాంస్యాలు చేజిక్కించుకుంది. పురుషుల జూడో 60కిలోల జే1 కేటగిరీలో కపిల్ పర్మార్ కూడా కాంస్యం దక్కించుకున్నాడు. ఆర్చరీలో హర్విందర్, క్లబ్ త్రోలో ధరమ్‌బీర్ పసిడి పతకాలతో ఔరా అనిపించారు. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్యం కైవసం చేసుకున్న చేతులు లేని ఆర్చర్ శీతల్ దేవి ప్రతిభకు పారిస్ ఫిదా అయ్యింది. జావెలిన్ త్రోయర్ సుమిత్, షూటర్ అవనీ లేఖారా తమ స్వర్ణ పతకాలను నిలబెట్టుకొని 'ఫేవరెట్' టైటిల్‌కు సార్థకత చేకూర్చారు.



భళా దీప్తి: పారాలింపిక్స్‌లో తలపడిన తెలుగు అథ్లెట్లలో రవి (షాట్‌పుట్), అర్షద్ (సైక్లింగ్), నారాయణ (రోయింగ్) నిరాశ పరచగా.., దీప్తి జీవాంజి మాత్రమే అంచనాలను అందుకుంది. మహిళల 400 మీటర్ల టీ20 పరుగులో ఆమె కాంస్య పతకంతో మెరిసింది.




నవదీప్ సింగ్

నవదీప్‌కు స్వర్ణం

సిమ్రన్‌కు కాంస్యం

పారిస్: తమ జోరు కొనసాగిస్తూ పారాలింపిక్స్ చివర్లోనూ భారత అథ్లెట్లు పతకాలు కొల్లగొట్టారు. శనివారంనాటి పోటీలలో రెండు పతకాలు సాధించారు. పురుషుల జావెలిన్ ఎఫ్41 విభాగంలో నవదీప్ సింగ్ స్వర్ణ పతకం సొంతం చేసుకోగా, మహిళల 200 మీటర్ల (టీ12) రేసులో సిమ్రన్ కాంస్యం చేజిక్కించుంది. వాస్తవంగా 47.32 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరిన నవదీప్..చైనాకు చెందిన ప్రపంచ రికార్డు హోల్డర్ సన్ పెంగ్ జియాంగ్‌ను వెనక్కు నెట్టి రజత పతకం అందుకున్నాడు. కానీ స్వర్ణం నెగ్గిన ఇరాన్ జావెలిన్ త్రోయర్ (47.64మీ.) అరబిక్ అక్షరాలతో కూడిన నల్లజెండాను ప్రదర్శించడంతో అతడిపై వేటు వేశారు. ఫలితంగా నవదీప్‌కు పసిడి పతకం దక్కింది. అంతకు ముందు కాంస్యంతో సరిపెట్టుకున్న పెంగ్ (44.72మీ.)కు రజతం ప్రకటించారు. నుఖేలావీ (ఇరాక్, 40.46మీ.) కాంస్యం లభించింది.

సిమ్రన్.. బెస్ట్ టైమింగ్


మహిళల 200 మీటర్ల (టీ12)లో వరల్డ్ చాంపియన్ సిమ్రన్ 24.75 సెకన్ల అత్యుత్తమ సమయంతో రేస్‌ను పూర్తిచేసి కాంస్య పతకం చేజిక్కించుకుంది. దృష్టిలోపం ఉన్న రన్నర్లు పాల్గొనే ఈ రేస్‌లో..అథ్లెట్ల గైడ్ కూడా పరుగులో పాల్గొంటారు. దాంతో గైడ్‌గా అభయ్‌సింగ్ పరిగెత్తాడు. డ్యురాండ్ (క్యూబా, 23.62సె.) స్వర్ణం, పెరెజ్ లోపెజ్ (వెనిజులా, 24.19సె.) రజతాలు నెగ్గారు.

షాట్‌పుట్‌లో సెమా కంచు మోత: శుక్రవారం అర్ధరాత్రి జరిగిన పురుషుల షాట్‌పుట్‌లో భారత అథ్లెట్ హోకటో హోటొజె సెమా కాంస్య పతకం సాధించాడు. నాగాలాండ్‌కు చెందిన ఈ మాజీ సైనికుడు ఫైనల్స్‌లో ఇనుప గుండును 14.65 మీటర్లు దూరం విసిరి మూడో స్థానంలో నిలిచాడు. ఇరాన్ అథ్లెట్ యాసిన్ (15.96 మీ.)కు స్వర్ణం, బ్రెజిల్‌కు చెందిన తియాగో (15.06మీ.)కు రజతాలు దక్కాయి.

బెలారస్ భామదే యూఎస్ ఓపెన్

సాహో.. సబలెంక

- ఈ ఏడాది రెండో గ్రాండ్‌స్లామ్ కైవసం
- హోరాహోరీ ఫైనల్లో పెగులాపై విజయం



ట్రోఫీతో సబలెంక

పారిస్: హోరాహోరీగా సాగిన తుది పోరులో అద్భుత విజయం సాధించిన బెలారస్ భామ అర్యానా సబలెంక యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను తొలిసారి సొంతం చేసుకొంది. శనివారం రాత్రి జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో రెండో సీడ్ సబలెంక 7-5, 7-5తో జెస్సికా పెగులా (అమెరికా)ను ఓడించింది. గంటా 53 నిమిషాలపాటు సాగిన పోరులో జెస్సికా కూడా పట్టువదలకుండా పోరాడడంతో ఆధిక్యం చేతులు మారుతూ ఉత్కంఠ రేపింది. అయితే, ఫుల్‌ఫామ్‌లో ఉన్న సబలెంక కీలక సమయంలో ఒత్తిడి తట్టుకొని హార్డ్‌కోర్ట్ క్వీన్‌గా నిలిచింది. 2023లో కొకో గాఫ్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన ఆమె.. ఈసారి టైటిల్‌తో మురిసింది. మ్యాచ్‌లో అర్యానా 40 విన్నర్లు సంధిస్తే.. పెగులా 17 మాత్రమే కొట్టింది. జెస్సికాతో పోల్చితే సబలెంక ఎక్కువ తప్పిదాలు చేసినా.. బలమైన సర్వీస్‌లతో విరుచుకుపడడంతోపాటు తెలివిగా డ్రాప్ షాట్‌లు ఆడుతూ మ్యాచ్‌ను ఎక్కువగా తన నియంత్రణలోనే ఉంచుకొంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకొన్న అర్యానా.. ఫ్లషింగ్ మెడోలో నెగ్గి సీజన్‌ను గ్రాండ్‌గా ముగించింది.

కొలువుదీరిన ఏసీఏ పాలకవర్గం



సీఎం సహాయనిధికి రూ. కోటి విరాళం

విజయవాడ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) నూతన పాలకవర్గం ఆదివారం కొలువుదీరింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఒక్కో పదవికి ఒకరు చొప్పున మాత్రమే నామినేషన్ వేయడంతో కార్యవర్గం మొత్తం ఏకగ్రీవంగా ఎన్నికైంది. దీంతో అధ్యక్షుడిగా కేశినేని శివనాథ్ (చిన్ని), ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ ప్రశాంత్, కార్యదర్శిగా సానా సతీశ్ బాబు, జాయింట్ సెక్రటరీగా విష్ణుకుమార్ రాజు, కోశాధికారిగా దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్‌గా గౌర్ విష్ణుతేజ్ ఎన్నికైనట్టు ఆదివారం ఇక్కడ నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఏసీఏ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ ప్రకటించారు. ఇక, రాష్ట్రంలోని వరద బాధితులకు అండగా, సీఎం సహాయనిధికి రూ. కోటి విరాళాన్ని ఏసీఏ తరఫున అందజేయనున్నట్టు సంఘం చీఫ్ కేశినేని శివనాథ్ తెలిపారు.

భారత్ సూపర్ బోణీ

చైనాపై 3-0తో విజయం
హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

హులున్‌బుయిర్ (చైనా): పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం కొల్లగొట్టి జోరుమీదున్న భారత పురుషుల హాకీ జట్టు ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో అద్భుత శుభారంభం చేసింది. ఆదివారం మొదలైన ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత్ తన తొలి మ్యాచ్‌లో 3-0తో ఆతిథ్య చైనాను చిత్తు చేసింది. సుఖ్‌జీత్‌సింగ్ (14 నిమిషం), ఉత్తమ్ సింగ్ (27), అభిషేక్ (32) గోల్స్ చేశారు. తన రెండో మ్యాచ్‌ను భారత్ సోమవారం జపాన్‌తో ఆడనుంది. ఆదివారం మలేసియా-పాకిస్థాన్, జపాన్-కొరియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి.

మూడో రోజే ముగించారు

- ఇండియా-డిపై 'సి' విజయం
- దులీప్ ట్రోఫీ పోరు

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో జరిగిన దులీప్ ట్రోఫీ మ్యాచ్ మూడోరోజే ముగిసిపోయింది. ఈ మ్యాచ్‌లో ఇండియా-డి జట్టుపై ఇండియా సి ఘన విజయం సాధించింది. సి-బౌలర్ మానవ్ సుతార్ రెండో ఇన్నింగ్స్‌లో చెలరేగిపోయి ఏకంగా ఏడు వికెట్లను పడగొట్టడంతో ఇండియా-డి జట్టు కోలుకోలేపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-డి 164, ఇండియా-సి జట్టు 168 పరుగులు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా-డి జట్టు 236 పరుగులకు ఆలౌటైంది. అనంతరం 232 పరుగుల లక్ష్యంతో దిగిన ఇండియా-సి 6 వికెట్లు కోల్పోయి 233 పరుగులు చేసి విజయం సాధించింది. ఇండియా-డి జట్టులో అక్షర్ పటేల్ (114 పరుగులు, 3 వికెట్లు) రాణించాడు. ఇక ఇండియా 'ఎ'తో మరో మ్యాచ్‌లో ఇండియా 'బి' 76 పరుగులతో నెగ్గింది. ఈ మ్యాచ్ బెంగళూరు వేదికగా జరిగింది.

అంతర్జాతీయ క్రికెట్‌కు మొయిన్ అలీ వీడ్కోలు



లండన్: ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. ఇంగ్లండ్ తరఫున 2014లో అరంగేట్రం చేసిన అలీ.. ఇప్పటిదాకా 68 టెస్టులు, 138 వన్డేలు, 92 టీ20లు ఆడాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 6,678 పరుగులు చేసిన అలీ.. 366 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో బెంగళూరు, చెన్నై సూపర్‌కింగ్స్ జట్లకు ఆడిన అలీ.. 67 మ్యాచ్‌ల్లో 1162 పరుగులు, 35 వికెట్లు సాధించాడు.

బిజినెస్

డిపాజిటర్ల కోసం దావా సూచక్ : డీఐసీజీసీ

న్యూఢిల్లీ: బ్యాంకు డిపాజిటర్ల కోసం డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) 'దావా సూచక్' పేరుతో కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ సదుపాయం ద్వారా కుప్పకూలిన బ్యాంకుల్లో డిపాజిట్లు ఉన్న ఖాతాదారులు డీఐసీజీసీ వెబ్‌సైట్‌లో తమ మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేసి తమ క్లెయిమ్ స్టేటస్ తెలుసుకోవచ్చు. కుప్పకూలిన బ్యాంకుల్లో రూ.5 లక్షల వరకు ఉండే వ్యక్తిగత డిపాజిట్ల చెల్లింపునకు డీఐసీజీసీ హామీ ఇస్తుంది. తన సేవల విస్తరణలో భాగంగా డీఐసీజీసీ ఈ కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది.

స్పైస్‌జెట్‌లో 10% వాటా అమ్మకం!

న్యూఢిల్లీ: నిధులు సమీకరించేందుకు బడ్జెట్ ఎయిర్‌లైన్ సంస్థ స్పైస్‌జెట్ అష్టకష్టాలు పడుతోంది. దీంతో కంపెనీ ఈక్విటీలో తనకు ఉన్న 47 శాతం వాటాలో 10 శాతం అమ్మేందుకు ప్రమోటర్ అజయ్ సింగ్ సిద్ధమైనట్టు సమాచారం. కొన్ని షరతులకు ఆమోదిస్తే 10 శాతం కంటే ఎక్కువ వాటా విక్రయించేందుకూ ఆయన సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్నారు. పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న స్పైస్‌జెట్‌కు రుణాలు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో అజయ్ సింగ్ తన వాటాలో పది శాతానికిపైగా విక్రయించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. క్యూఐపీ ద్వారా ఈ వాటా విక్రయించాలని అజయ్ యోచిస్తున్నట్టు సమాచారం.

చైనాకు అదానీ గ్రూప్ విస్తరణ

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని చైనాకు విస్తరిస్తోంది. ఇందుకోసం గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్).. అదానీ ఎనర్జీ రీసోర్సెస్ (షాంఘై) కంపెనీ (ఏఈఆర్‌సీఎల్) పేరుతో చైనాలో ప్రత్యేక అనుబంధ కంపెనీని ఏర్పాటు చేసింది. సింగపూర్‌లోని తన అనుబబంధ సంస్థ అదానీ గ్లోబల్ పీటీఈ (ఏజీపీటీఈ) ద్వారా ఏఈఎల్ ఈ కంపెనీని ఏర్పాటు చేసింది. ఏఈఆర్‌సీఎల్ చైనాలోని కంపెనీలకు సప్లయ్ చైన్ సొల్యూషన్స్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ సేవలు అందించనుంది.

త్వరగా వరద బాధితుల క్లెయిమ్స్ పరిష్కారం

బజాజ్ అలియాంజ్ లైఫ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వరదలతో చనిపోయిన, వికలాంగులైన వారి క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించేందుకు బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వరదలతో చనిపోయిన లేదా వికలాంగులైన వారి నామినీలు, చట్టపరమైన వారి వారసులు లేదా పాలసీదారులు తప్పనిసరైన కొద్దిపాటి పత్రాలతో తమను సంప్రదించాలని కోరింది. ఇలాంటి క్లెయిమ్‌ల పరిష్కారం కోసం ఈ పత్రాలతో తమ టోల్‌ఫ్రీ నంబర్ 18002097272 ని గానీ, సమీపంలోని తమ బ్రాంచ్ ఆఫీసులో గానీ సంప్రదించాలని కోరింది. ఇంకా claims@bajajallianz.co.in ద్వారా కూడా తమను సంప్రదించవచ్చని తెలిపింది.

ఐపీఓల సందడి



ఈ వారం మార్కెట్లోకి మరో 14 ఇష్యూలు

రూ.8,644 కోట్ల సమీకరణ లక్ష్యం
నేటీ నుంచి బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓ

న్యూఢిల్లీ: ఈ వారం కూడా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్లో రద్దీ కనిపిస్తోంది. మొత్తం 13 కంపెనీలు పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.8,644 కోట్లు సమీకరించేందుకు ఈ వారం మార్కెట్‌కు వస్తున్నాయి. ఇందులో నాలుగు మెయిన్‌స్ట్రీమ్ కంపెనీలు రూ.8,390 కోట్లు, తొమ్మిది ఎస్ఎంఈ కంపెనీలు రూ.254 కోట్ల చొప్పున సమీకరించబోతున్నాయి. మెయిన్‌స్ట్రీమ్ కంపెనీల్లో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ఒక్కటే ఐపీఓ ద్వారా రూ.6,560 కోట్లు సమీకరించనుంది. మిగతా మొత్తంలో పీఎన్ గాడ్గిల్ జువెలర్స్ (రూ.1,100 కోట్లు), క్రాస్ లిమిటెడ్ (రూ.500 కోట్లు), టోలిన్స్ టైర్స్ (రూ.230 కోట్లు) సమీకరించనున్నాయి.

50 ఇష్యూలు..రూ.80,000 కోట్లు

మెయిన్‌స్ట్రీమ్ ఐపీఓల్లో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, క్రాస్ లిమిటెడ్, టోలిన్స్ టైర్స్ ఐపీఓలు సోమవారం, పీఎన్ గాడ్గిల్ జువెలర్స్ ఐపీఓ మంగళవారం ప్రారంభమవుతాయి. ఎస్ఎంఈ సెగ్మెంట్‌లోని తొమ్మిది కంపెనీల ఐపీఓలూ ఈ వారమే ప్రారంభం కానున్నాయి. ఇక ఈ ఏడాది ఇప్పటి వరకు 50పైగా కంపెనీలు ఐపీఓలు, ఫాలో ఆన్ ఆఫర్ల (ఎఫ్‌పీఓ) ద్వారా రూ.80,000 కోట్ల వరకు సమీకరించాయి. డిసెంబరు చివరికల్లా ఇది రూ.1.25 లక్షల కోట్లకు చేరుతుందని ఇక్వైరస్ (ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్) ఎండీ మునీశ్ అగర్వాల్ అంచనా. అయితే సెకండరీ మార్కెట్లో బేరిష్ ట్రెండ్ కొనసాగితే మాత్రం ప్రైమరీ మార్కెట్ జోరుకి బ్రేక్ పడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఎస్ఎంఈ ఐపీఓలపై జర జాగ్రత్త

ఇటీవల పెద్దగా ఫండమెంటల్స్ లేని ఎస్ఎంఈల ఐపీఓలు కూడా వందల రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అవుతున్నాయి. లిస్టింగ్ అయిన కొద్ది రోజులకే వాటి ధరలు ఆఫర్ ప్రైస్ కంటే తక్కువకు పడిపోతున్నాయి. దీంతో ఎస్ఎంఈ ఐపీఓల్లో ఏదో మాయ జరుగుతోందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సెబీ సైతం ఇటీవల ఈ ఇష్యూలపై జర జాగ్రత్త అని హెచ్చరించడం విశేషం. అంతటితో ఆగకుండా ఈ ఐఓపీల లిస్టింగ్ లాభాలను ఇష్యూ ధరపై 90 శాతానికి పరిమితం చేసింది.

16 నుంచి ఆర్కేడ్ డెవలపర్స్ ఐపీఓ

ముంబై కేంద్రంగా పనిచేసే ఆర్కేడ్ డెవలపర్స్ ఐపీఓ ఈ నెల 16న ప్రారంభమవుతోంది. ఈ నెల 19న ముగిసే ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.410 కోట్లు సమీకరించనుంది. కంపెనీ ఈ నిధులను వ్యాపార విస్తరణ కోసం వినియోగించనుంది.

హెక్సావేర్ టెక్ రూ.9,950 కోట్ల ఐపీఓ

ప్రముఖ ఐటీ కంపెనీ హెక్సావేర్ టెక్నాలజీస్ కూడా ఐపీఓకు సిద్ధమవుతోంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.9,950 కోట్లు సమీకరించేందుకు కంపెనీ సెబీకి దరఖాస్తు చేసింది. అనుకున్న విధంగా ఈ ఇష్యూ విజయవంతమైన దేశ ఐటీ రంగంలో అతి పెద్ద ఐపీఓగా మిగిలిపోతుంది. రెండు దశాబ్దాల క్రితం టాటా గ్రూప్ నిర్వహణలోని టీసీఎస్ జారీ చేసిన రూ.4,700 కోట్ల ఐపీఓనే ఇప్పటి వరకు భారత ఐటీ కంపెనీల చరిత్రలో అతిపెద్ద ఐపీఓ. హెక్సావేర్ టెక్ ఐపీఓ ఆ రికార్డును తిరగరాయనుంది.

25,200 ఎగువన బుల్లిష్

(సెప్టెంబరు 9-13 తేదీల మధ్య వారానికి)

టెక్ వ్యూ


డా. భువనగిరి అమరనాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,334-24,801 పాయింట్ల మధ్యన కదలాడి 1.55 శాతం నష్టంతో 24,852 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,200 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 25,200 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,500
నిరోధ స్థాయిలు: 25,050 25,150, 25,250 (24,950 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,650 ,24,550, 24,450 (24,750 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	520
వరంగల్	482	గోదావరి	510
చిత్తూరు	543	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	విజయవాడ	103
వరంగల్	99	గుంటూరు	105
కరీంనగర్	99	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	101
కర్నూలు	99	నెల్లూరు	101
విశాఖపట్నం	94	అనంతపురం	100
గోదావరి	103		

అంతర్జాతీయ పరిణామాలే కీలకం

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చే సంకేతాలు కీలకంగా ఉండనున్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతోందన్న ఆందోళన. యూఎస్ జాబ్ డేటా అంచనాలకు తగ్గట్టుగా లేకపోవటంతో గత శుక్రవారం నిఫ్టీ ఏకంగా 300 పాయింట్లు, బీఎస్ఈ సెన్సెక్స్ 1,100 పాయింట్ల మేర పతనమైంది. ఈ వారం నిఫ్టీకి 24,900 వద్ద మద్దతు, 25,050 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. ఫార్మా, ఐటీ రంగాలు బుల్లిష్‌గా ఉండే వీలుంది. తీవ్రంగా నష్టపోయిన బ్యాంక్ షేర్లు స్థిరపడిన తర్వాత పుంజుకునే అవకాశం ఉంది. ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

టాటా టెక్నాలజీ: స్టాక్ మార్కెట్లో నమోదైనప్పటి నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం కొద్దిగా నిలదొక్కుకుంది. రూ.1,000 స్థాయిలో మంచి బేస్ ఏర్పడింది. ఆగస్టు ఆరంభం నుంచి స్ట్రెంత్ కనిపిస్తోంది. ప్రస్తుతం కీలక నిరోధం వద్దకు చేరుకుంది. గత శుక్రవారం 3.51 శాతం లాభంతో రూ.1,112 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,100 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,225/1,255 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,070 స్థాయిని స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

పీఐ ఇండస్ట్రీస్: జూన్ త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు ప్రకటించిన తర్వాత ఈ షేరు పుంజుకుంది. గరిష్ఠ స్థాయిల్లోనే కదలాడుతున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం 2.29 శాతం లాభంతో రూ.4,613 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.4,600/4,580 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,555 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మ్యాక్స్‌హెల్త్: జూన్‌లో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ కౌంటర్‌లో స్వల్పదిద్దుబాటు కనిపించింది. ప్రస్తుతం రూ.850 స్థాయిలో కన్సాలిడేషన్ జరుగుతోంది. చక్కని బేస్ ఏర్పడటం, సీజన్ కావటంతో ఈ షేరుకు గిరాకీ పెరిగింది. గత శుక్రవారం రూ.898 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.890/880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.960/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.865 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అజంతా ఫార్మా: ఏడు వారాలుగా అప్‌ట్రెండ్‌లో సాగుతున్న ఈ కౌంటర్ మరోసారి బ్రేకౌట్‌కు సిద్ధమైంది. ప్రస్తుతం ఫార్మా రంగం మంచి బూమ్‌లో ఉంది. బలమైన ఫండమెంటల్స్, టెక్నికల్స్ మద్దతున్న ఈ షేరు గత శుక్రవారం రూ.3,350 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.3,300/3,250 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.3,450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,150 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ పవర్: ఆగస్టులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో పుల్‌బ్యాక్ కనిపించింది. ప్రస్తుతం కన్సాలిడేషన్ జరుగుతోంది. తక్కువ వాల్యూమ్‌ను బట్టి ఇందులో సరఫరా ఎక్కువగా లేదని చెప్పొచ్చు. త్వరలోనే డిమాండ్ పెరిగి షేరు పుంజుకునే అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 1.28 శాతం లాభంతో రూ.1,694 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,675/1,670 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,775 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,600 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

మార్కెట్లలో మైనర్ కరెక్షన్!


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత సోమవారం స్వల్ప లాభాలతో ప్రారంభమైనప్పటికీ 25,300 స్థాయిల్లో నిలదొక్కుకోవటంలో విఫలమైంది. ఆ తర్వాత వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్లలో బలమైన కరెక్షన్‌ను చవిచూసి చివరకు శుక్రవారం 300 పాయింట్లకు పైగా నష్టపోయింది. గడచిన 14 రోజులుగా వరుసగా ర్యాలీని కనబరుస్తూ వస్తున్న మార్కెట్ ప్రస్తుతం కరెక్షన్‌లోకి జారుకుంది. అంతకు ముందు వారంతో పోలిస్తే గత వారం నిఫ్టీ 380 పాయింట్ల మేర నష్టపోయింది. టెక్నికల్‌గా 25,000 స్థాయిలో అప్‌సైడ్ బ్రేకౌట్‌ను కనబరిచిన నిఫ్టీ గత వారం రివర్స్ బ్రేక్ డౌన్ ప్యాటర్న్‌ను కనబరిచి తదుపరి మరింత అప్రమత్తతను సూచించింది. కాగా ఈ వారం కూడా స్వల్పకాలిక కరెక్షన్ ట్రెండ్‌ను కొనసాగించే అవకాశం ఉంది. మార్కెట్ ప్రస్తుతం టెక్నికల్‌గా స్వల్పకాలిక ఓవర్‌బాట్ పొజిషన్‌ను సర్దుబాటు చేసుకుంటోంది. నిలకడను ప్రదర్శించేందుకు మరికొన్ని రోజులు పట్టే వీలుంది. టెక్నికల్‌గా చూస్తే ప్రస్తుతం నిఫ్టీకి 24,500 వద్ద మద్దతు స్థాయిలు కనిపిస్తున్నాయి.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయిలైన 24,800 ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. తదుపరి నిరోధ స్థాయిలు 25,100. ఇక్కడ నిలదొక్కుకుంటేనే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను కనబరుస్తుంది.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24,700 కన్నా దిగజారితే మరింత బలహీనతను సూచిస్తుంది. తదుపరి ప్రధాన మద్దతు స్థాయి 24,500. ఇది ఆగస్టు 19న ఏర్పడిన నిరోధ స్థాయి. సానుకూలత కోసం కీలకమైన ఈ మద్దతు స్థాయిల ఎగువన పటిష్ఠంగా ముగియాల్సి ఉంటుంది.


బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం ఆరంభంలో 350 పాయింట్లతో మైనర్ అప్‌ట్రెండ్‌ను కనబరిచినప్పటికీ చివరకు వారాంతంలో 900 పాయింట్లకు పైగా నష్టపోయింది. ఈ కరెక్షన్‌తో బ్యాంక్ నిఫ్టీ గత పది రోజులుగా ఆర్జించిన లాభాలన్నీ హరించుకుపోయాయి. గత వారం ఈ సూచీ 775 పాయింట్లు (1.5 శాతం) మేర నష్టపోయి 50,575 స్థాయిల్లో క్లోజైంది.

ఈ వారం మరింత బలహీనతను సూచిస్తే 50,000 దిగువన మద్దతు స్థాయిలుంటాయి. సానుకూలతను సూచించాలంటే ఈ మద్దతు స్థాయిలకు ఎగువన కన్సాలిడేట్ కావాల్సి ఉంటుంది. లేని పక్షంలో మరింత బలహీనతను సూచిస్తుంది. అప్రమత్తంగా ఉండటం మంచిది.

పాటర్న్: నిఫ్టీ 24,500 వద్ద అడ్డంగా దిగువకు ఏర్పడిన మద్దతు ట్రెండ్‌లైన్‌కు చేరటంతో స్వల్పకాలిక బలహీనతను సూచిస్తోంది. ప్రస్తుతం నిఫ్టీ 25, 50 రోజుల చలన సగటు వద్ద గట్టి పరీక్షను ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం నిఫ్టీ 24,500 స్థాయిలకు ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,755, 24,800
మద్దతు	24,700, 24,640



బుడమేరుకు పడిన గండి పూడుస్తూ...
గండ్లు పూడుస్తున్న ఆర్మీ జవాన్లతో మాట్లాడుతున్న మంత్రులు లోకేశ్, రామానాయుడు (ఇన్‌సెట్)



చిట్టినగర్‌లో రోడ్లపై బ్లీచింగ్ చల్లుతున్న కార్మికులు



వైఎస్సార్ కాలనీలోని ఒక ఇంటిలో కరెంటును పునరుద్ధరించే పనిలో విద్యుత్ శాఖ సిబ్బంది



పాయకాపురంలోని ఇంటిని శుభ్రం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది, ఇంటిలోని వారితో మాట్లాడుతున్న మంత్రి సవిత

యుద్ధంలా పునరుద్ధరణ

వరద ప్రభావిత ప్రాంతాలలో జనజీవన పునరుద్ధరణ పనులు ఒక యుద్ధంలా సాగుతున్నాయి. వరదకు కారణమైన భారీ గండ్లను పూడ్చే పనిలో జవాన్లు తలమునకలై ఉన్నారు. ఇక, వరద బురదతో నిండిపోయిన ఇళ్లను కడిగే పనిలో అగ్నిమాపక, పారిశుధ్య సిబ్బంది బిజీబిజీగా పనిచేస్తున్నారు. ఇల్లిల్లూ తిరుగుతూ... ఆ ఇంటిలో... నీటిలో నాని, బురదమయమయిన ప్రతి వస్తువునూ శుభ్రం చేస్తున్నారు. గల్లీల్లోకి కూడా వెళ్తున్న జేసీబీలు రోడ్లపై పేరుకు పోయిన చెత్తను తొలగిస్తున్నాయి. అనక ఆ రోడ్లను కడుగుతున్నారు. ఆ తర్వాత పారిశుధ్య కార్మికులు వాటిపై బ్లీచింగ్ చల్లుతున్నారు. కరెంటు పోయిన ఇళ్లకు విద్యుత్ సిబ్బంది తరలి వస్తున్నారు. అన్నీ చెక్‌చేసి విద్యుత్‌ను పునరుద్ధరిస్తున్నారు. మరోవైపు రేషన్ పంపిణీ వాహనాల ద్వారా నిత్యావసరాలు ఇంటింటికి చేరుస్తున్నారు. ఆహారం వండుకోలేని వారి కోసం వాహనాల్లో ఆహారాన్ని తెచ్చి పంచుతున్నారు. రెడ్ క్రాస్ తదితర సంస్థల నేతృత్వంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ సురక్షిత తాగునీరు పంపిణీ చేస్తున్నారు. వరద నీరు తొలగని ప్రాంతాల్లో క్లోరినేషన్ చేస్తున్నారు. ఆయా పనుల్లో మంత్రులు భాగస్వాములవుతున్నారు.



పాత రాజరాజేశ్వరీ పేటలోని ఇంటింటికి తాగునీరు అందజేసే కార్యక్రమంలో మంత్రి నారాయణ



నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు సిద్ధమైన రేషన్ డెలివరీ వాహనాలు



వరద బాధితులకు పంపిణీ చేసేందుకు ఆహారాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం



శిబిరంలో వైద్య సేవలందిస్తున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం తదితరులు

బెజవాడ దుఃఖదాయిని... బుడమేరు!

▸▸ ఫ్లాష్ ఫ్లడ్స్, క్లౌడ్ బరస్ట్‌తో నష్టం: నిపుణులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విజయవాడ దుఃఖదాయని బుడమేరు మరోసారి విరుచుకు పడింది. ఒక చిన్న పిల్ల కాలువలా ఉండే బుడ్డ ఏరు(చిన్న ఏరు) బుడమేరుగా మారి దశాబ్దాలుగా బెజవాడను వణికిస్తూనే ఉంది. ఆకస్మిక వరదలతో బుడమేరు నగరాన్ని ముంచెత్తడం ఇదే మొదటిసారి కాదు. ఇంతకుముందు 60ఏళ్ల క్రితం కూడా సరిగ్గా సెప్టెంబరులోనే విలయం సృష్టించింది. భారీవర్షాల కారణంగా బుడమేరు రక్షణ కట్టకు భారీ గండి పడటంతో 1964 సెప్టెంబరు 30న అర్ధరాత్రి సమయంలో విజయవాడ ముంపునకు గురైంది. ఇప్పుడు మరోసారి విజయవాడలోని పలు ప్రాంతాలు గత 8 రోజులుగా వరదలో చిక్కుకున్నాయి. అయితే విజయవాడను ముంచెత్తింది కృష్ణాజలాలు కాదని, బుడమేరుకు ఎగువనుంచి అకస్మాత్తుగా 5లక్షల క్యూసెక్కుల వరద రావడం, దాదాపు 17 రోజుల్లో కురవాల్సిన వర్షం క్లౌడ్‌బరస్ట్ రూపంలో 30సెంటీమీటర్ల మేర కురవడంతో విజయవాడ నగరాన్ని ముంచెత్తిందని జలవనరులనిపుణులు వివరిస్తున్నారు. వరద ప్రభుత్వ వైఫల్యమని విపక్షాలు చేస్తున్న ఆరోపణలు సరికాదన్నారు.

నేటి నుంచి మెడికల్ సర్వే: సత్యకుమార్

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో విపత్తు సంభవించిందని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం, ఆదివారాలలో విజయవాడలోని వరద బాధిత ప్రాంతాల్లో అందుబాటులో ఉంచిన 104 వాహనాల్ని, ఉచిత వైద్య శిబిరాలను మంత్రి సందర్శించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. మంత్రి మాట్లాడుతూ 32 వార్డు సచివాలయాల్లో 184 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని చెప్పారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు డోర్ టూ డోర్ మెడికల్ సర్వే నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతి సచివాలయానికి సీహెచ్‌వోలకు అనుబంధంగా ఏఎన్ఎం, సిబ్బంది పని చేస్తారని, వీరికి శిక్షణ కూడా ఇస్తామన్నారు.

వరద బాధితుల బీమా సేవలకు క్లెయిమ్ ఫెసిలిటేషన్ సెంటర్

అమరావతి, విజయవాడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వరద కారణంగా దెబ్బతిన్న గృహాలు, వాహనాలు, దుకాణాలు, చిన్న, మధ్య తరహా వ్యాపార ఆస్తులకు సంబంధించిన బీమా క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తక్షణమే బీమా క్లెయిమ్ నమోదు చేసుకోవటానికి 22 ఇన్సూరెన్స్ కంపెనీల వాట్సాప్ నంబర్లు, టోల్ ఫ్రీ నంబర్లు, ఈ-మెయిల్, వెబ్‌సైట్‌లతో పాటు బీమా కంపెనీలను సంప్రదించాల్సిన విధానాన్ని కరపత్రాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. క్లెయిమ్ ఫారాల సమర్పణ, ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు తక్షణ పరిష్కారం కోసం సమర్థవంతమైన ఫాలో అప్ కోసం ఇన్సూరెన్స్ క్లెయిమ్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం సేవలను సోమవారం నుంచి ఉపయోగించుకోవచ్చు.

అనూహ్య వర్షపాతంతోనే ముంపు!

బుడమేరు ప్రాంతంలో 1న 120 మిమీ వర్షం

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనూహ్యంగా ఈ నెల ఒకటో తేదీన బుడమేరు పరివాహక ప్రాంతంలో 120.33 ఎంఎం వర్షం కురవడంతో .. 37100 క్యూసెక్కుల వరద వచ్చి గట్లను కోతకోస్తూ విజయవాడ నగరంలోనికి ప్రవాహం దూసుకుపోయిందని ప్రభుత్వానికి జల వనరుల శాఖ హైడ్రాలజీ విభాగం ప్రాథమిక నివేదిక ఇచ్చింది. వెలగలేరు రెగ్యులేటర్ పని చేయకపోవడం వల్లనో, దాని గేట్లు ఎత్తడం వల్లనో.. బుడమేరు వరద విజయవాడను ముంచెత్తలేదని స్పష్టం చేసింది. రోజంతా ఎడతెరపిలేకుండా భారీ వర్షం కురవడం.. అనూహ్యంగా 120.33 ఎంఎం వర్షపాతం వల్లే వరద వచ్చిందని తేల్చిచెప్పింది. తెల్లవారు జామున మూడు గంటలకు వరదంతా బుడమేరు కాలువలోకి దూసుకు రావడంతో గట్లకు గండ్లు పడి భారీ నష్టం జరిగిందని తెలిపింది. గట్లపై నుంచి వరద ప్రవహించి.. విజయవాడ థర్మల్ ప్లాంట్‌ను నష్టపరచి.. విజయవాడ సింగ్‌నగర్ మీదుగా లోతట్టు ప్రాంతాలను ముంచేసిందని పేర్కొంది. 'బుడమేరు పరివాహక ప్రాంతం 673 చదరపు కిలోమీటర్లు. వెలగలేరు రెగ్యులేటర్‌ను 24,000 క్యూసెక్కుల వరదను తట్టుకునేలా డిజైన్ చేస్తే ..ఏకంగా 37,100 క్యూసెక్కుల వరద నమోదైంది. ఈ వరదకు ప్రకృతి వైపరీత్యమే కారణం మానవ తప్పిదమేమీ లేదు. 1989లో కూడా 35,356 క్యూసెక్కుల వరద వచ్చింది' అని నివేదికలో తెలిపింది. ఈ రిపోర్టును హైడ్రాలజీ విభాగం చీఫ్ ఇంజనీర్ కుమార్ ప్రభుత్వానికి సమర్పించారు.

వాగులపైనా గేజ్ సిస్టమ్!

▸▸ బుడమేరులో అది లేకపోవడం వల్లే భారీ నష్టం

▸▸ ఈ కాల్వ సామర్థ్యం 11 వేల క్యూసెక్కులు

▸▸ వచ్చింది 45 వేల క్యూసెక్కులు

▸▸ దీనిని అంచనా వేయలేకపోయారు

▸▸ 17 రోజుల్లో కురవాల్సిన వర్షం ఒక్క రోజే కురిసింది

▸▸ అందుకే బెజవాడకు అంత ముంపు

▸▸ రిటైనింగ్ వాల్ సూచన అమలు కాలేదు

▸▸ 'ఆంధ్రజ్యోతి'తో జలవనరుల నిపుణుడు వరప్రసాద్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)



> వాగుల విషయంలో కనీసం ఫ్లో మేనేజ్‌మెంట్ మాన్యువల్‌ను రూపొందించాలి. ఎంత ఫ్లో వస్తే ఏయే ప్రాంతాలు మునుగుతాయి.. అక్కడ తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటో పేపర్ మీద ఉండాలి. బుడమేరు చాలా మలుపులు తిరుగుతూ ఉంటుంది. దాని వల్ల ఎక్కువ ప్రవాహం వచ్చినప్పుడు అది గట్టు దాటి చుట్టూ ఉన్న ప్రాంతాల్లోకి వచ్చేస్తుంటుంది. అందుకే కృష్ణా నది కంటే బుడమేరు వరదలే విజయవాడకు ప్రమాదకరం.
>
> - వరప్రసాద్, జలవనరుల నిపుణుడు.

వేల కిలోమీటర్లు ప్రయాణించే నదుల వల్ల ఇటీవలి కాలంలో ఎక్కడా వరద ముప్పు తలెత్తలేదని, కేవలం వందల కిలోమీటర్లు ప్రయాణించే ఉపనదులు, వాగుల వల్లే ఎక్కువ ప్రమాదం సంభవిస్తోందని జలవనరుల శాఖ నిపుణుడు, భూగర్భ జలవనరుల శాఖ రిటైర్డ్ డీడీ ఎ.వరప్రసాద్ వ్యాఖ్యానించారు. నదుల ప్రవాహం లెక్కించేందుకు పక్కా ఏర్పాట్లు ఉన్నాయని, కానీ వాగులకు అలాంటి ఏర్పాట్లు లేవన్నారు. విజయవాడలో బుడమేరు వాగు విషయంలో ఇలాంటి అంచనాలు లేకే దెబ్బతినాల్సి వచ్చిందన్నారు. విజయవాడ వరదలకు ప్రధాన కారణం బుడమేరు వాగుకు ఎగువ ప్రాంతం నుంచి ఊహించని విధంగా వచ్చిన వరద నీరేనన్నారు. బుడమేరు వరద.. ముందు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

రిటైనింగ్ వాల్ కట్టాలని సూచించినా..

బుడమేరు.. మైలవరం నియోజకవర్గం ఎ.కొండూరు మండలంలోని జమ్మలవాయిదుర్గం కొండల్లో పుట్టిన ఓ పెద్దవాగు. ఇందులో ఏటా గరిష్ఠంగా 10 నుంచి 11 వేల క్యూసెకుల వరకు నీరు ప్రవహిస్తూ ఉంటుంది. 2005లో వచ్చిన వర్షాలకు బుడమేరులో ఏకంగా 75 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించింది. అప్పుడు విజయవాడ చాలా వరకు ముంపు బారిన పడింది. 2009లో కూడా అలాంటి పరిస్థితే ఎదురైంది. 2005లో వరదల తర్వాత బుడమేరు పొడవునా రిటైనింగ్ వాల్ నిర్మించాలని నీటిపారుదల శాఖ సూచించింది. అది కార్యరూపం దాల్చలేదు. బుడమేరు ప్రాంతంలో ఈ 2 దశాబ్దాల్లో విపరీతమైన ఆక్రమణలు జరిగాయి. బుడమేరు విజయవాడ సింగ్‌నగర్ దగ్గరకు వచ్చే సరికి విశాలంగా ఉండేది. ఇప్పుడు ఆ ప్రాంతమంతా ఆక్రమణలకు గురైంది. బుడమేరు 100 కిలోమీటర్ల పొడవు ప్రవహించి కొల్లేరులో కలుస్తుంది. అక్కడి నుంచి బంగాళాఖాతంలోకి చేరుతుంది. దీని వెడల్పు 30 నుంచి 50 మీటర్లు ఉండేది. కానీ చాలా చోట్ల ఆక్రమణలతో కుంచించుకుపోయింది. ప్రస్తుతం 45 వేల క్యూసెక్కుల వరద బుడమేరులోకి వచ్చిందని లెక్కలు చెబుతున్నాయి. దీనిని లెక్కించే ఏర్పాట్లు బుడమేరు వాగు ప్రారంభ ప్రాంతాల్లో లేవు. వెలగలేరు రెగ్యులేటర్‌కు వచ్చిన తర్వాత ఇంత ప్రవాహం వచ్చిందని లెక్కలు వేయడం తప్ప. ఎంత నీరు వస్తుందని లెక్కించే ఏర్పాట్లు లేకపోవడంతో ప్రజలను అప్రమత్తం చేయలేక ప్రమాదాలకు కారణం అవుతున్నాం. నదుల్లో ఎంత నీరు వస్తుందనే లెక్క స్పష్టంగా ఉంటుంది. వాగులు, ఉపనదుల విషయంలో ఉండదు. వాగులే కదా అని నిర్లక్ష్యం చేస్తున్నారు. వీటిపైనా గేజ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. చెయ్యేరు నదిపై ఉన్న అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడానికి ఇదీ ఒక కారణం. దీనిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి.

బుడమేరు వరదకు ప్రధాన కారణాలివీ..

బుడమేరు వరద ప్రవాహం చాలా తక్కువ. ఇందులో 11 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించగలదు. ఆధునికీకరణ పనుల్లో భాగంగా బుడమేరు సామర్థ్యాన్ని 17వేల క్యూసెక్కులకు పెంచేలా ప్రణాళిక రూపొందించారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు ఒక్కసారిగా 45వేల క్యూసెక్కుల వరకు వరద వచ్చినట్లు చెబుతున్నారు. వెలగలేరు వద్ద బుడమేరుకు డైవర్షన్ కాల్వ ఉంది. అక్కడే ఉన్న రెగ్యులేటర్‌కు 11 గేట్లు ఉన్నాయి. వరద భారీగా ఉండడంతో గేట్లు ఎత్తారు. డైవర్షన్ కాల్వ ద్వారా కృష్ణా నదిలోకి నీటిని వదిలారు. ఈ డైవర్షన్ కాల్వకు గండ్లు పడ్డాయి. మరోవైపు గేట్ల నుంచి వచ్చిన వరద తోడై ముంపు ప్రభావం తీవ్రంగా మారింది. బుడమేరు ఆక్రమణలతో వరద ప్రభావం ఐదారురోజులపాటు ఉండిపోయింది. ఆక్రమణలు లేనిపక్షంలో ఒకట్రెండు రోజుల్లోనే తగ్గిపోయేది.

పడవలోనే ప్రసవం

▸▸ విజయవాడ వాంబేకాలనీలో ఘటన

విజయవాడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎన్నో మానవీయఘటనలు వెలుగుచూస్తున్నాయి. నెలలు నిండిన గర్భిణి శనివారం పడవలోనే ప్రసవించారు. విజయవాడ నగరపాలకసంస్థ(వీఎంసీ) కంట్రోల్ రూమ్‌కు శనివారం ఓ ఫోన్ వచ్చింది. వాంబే కాలనీలో ఓ గర్భిణి 2 గంటలుగా నొప్పులు పడుతున్నారని, ఏ క్షణానైనా ప్రసవించే అవకాశం ఉందని స్థానికులు సమాచారమిచ్చారు. వెంటనే వీఎంసీ సిబ్బంది.. వాంబే కాలనీలో వరద నీరు తగ్గకపోవడంతో పడవలోనే అక్కడకు చేరుకున్నారు. గర్భిణిని సురక్షితంగా పడవలో ఎక్కించుకుని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే.. ఆమెకు నొప్పులు తీవ్రమై దారిలోనే పడవలో బిడ్డను ప్రసవించారు. వైద్య సిబ్బంది ఆమెకు పడవలోనే వైద్యం అందించడంతో తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని వీఎంసీ బయాలజిస్ట్ సూర్యకుమార్ తెలిపారు.

ప్రకాశం బ్యారేజీకి మళ్లీ వరద ఉధృతి

▸▸ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

విజయవాడ-ఆంధ్రజ్యోతి/మాచర్ల/శ్రీశైలం, సెప్టెంబరు 8: ప్రకాశం బ్యారేజీకి మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 4.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తి ఈ నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వరద పెరగడంతో 8 గేట్లు, విద్యుదుత్పత్తి ద్వారా 3,07,986 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో నాగార్జున సాగర్ జలాశయం కుడి కాలువకు 8,604 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 2,114 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,313 క్యూసెక్కులు, 24 క్రస్ట్ గేట్ల ద్వారా 2,18,300 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు.. మొత్తం 2.60 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పులిచింతల ప్రాజెక్టులో 8 గేట్లను ఎత్తి ప్రకాశం బ్యారేజీకి 2.03 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

జగన్‌ది దగుల్బాజీతనం: వర్ల

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మోకాళ్లలోతు వరదలో చంద్రబాబు రాత్రీపగలు లేకుండా తిరిగి, బాధిత ప్రజలకు సాయం అందిస్తుంటే.. ఆయనను విమర్శించడం జగన్ దగుల్బాజీ తనానికి నిదర్శనమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రోజుకి 22 గంటలు పని చేస్తూ, 2 గంటలే నిద్ర పోతున్న దార్శనికుడు చంద్రబాబును విమర్శించడానికి జగన్‌ది నోరా... తాటి మట్టా? బుడమేరు వరదలకు జగనే కారణం. దీనికి సమాధానం చెప్పే దమ్ము జగన్ ఉందా?' అని వర్ల సవాల్ చేశారు. కాగా, వరద ప్రాంతాల్లో 8 రోజులుగా సీఎం, మంత్రులు ప్రజలకు అండగా నిలబడితే.. బెంగళూరు ప్యాలస్‌లో కూర్చొని వరదలపై జగన్ చేస్తున్న బురద రాజకీయం వెగటు పుట్టిస్తోందని ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు వ్యాఖ్యానించారు. ఇంకా వైసీపీ తీరు మారకపోతే.. జగన్, ఆయన పార్టీ కూడా బుడమేరు బురదలో కొట్టుకుపోవడం ఖాయమని ఎక్స్ వేదికగా హెచ్చరించారు.

బుడమేరు కట్ట ఎత్తు పెంపు

వరదను మళ్లించేందుకే!
గ్రావెల్ పోసి పవర్ రోలింగ్‌తో కట్ట బలోపేతం
దగ్గరుండి మంత్రి నిమ్మల పర్యవేక్షణ
అటు ఆర్మీ సాయంతో మూడో గండి పూడ్చివేత
యథాస్థితికి ఎడమ కరకట్ట

జి.కొండూరు, సెప్టెంబరు 8: బుడమేరు ఎడమ కట్టకు పడిన గండ్లను విజయవంతంగా పూడ్చేసిన అధికార యంత్రాంగం.. ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆదేశాలతో మరో యజ్ఞం ప్రారంభించింది. వరద ఉధృతిని తట్టుకునేందుకు కట్ట ఎత్తును మరింత పెంచుతున్నారు. అంచెలంచెలుగా గ్రావెల్‌ను వేసి.. పవర్ రోలింగ్ చేయిస్తూ కట్టను బలోపే తం చేస్తూ రాత్రి వేళల్లోనూ ఎత్తుపెంపు పనులను సాగిస్తున్నారు. ప్రస్తుతం వెలగలేరు రెగ్యులేటర్ వద్దకు వస్తున్న 3 వేల క్యూసెక్కుల వరదను.. గండ్లను పూడ్చడం ద్వారా బుడమేరు మళ్లింపు కాలువ(బీడీసీ) నుంచి కృష్ణా నదికి మళ్లిస్తున్నారు. ఒక వేళ భారీ వర్షం కురిసి ప్రవాహం మరో 2 వేల క్యూసెక్కులు పెరిగినా దానినీ ఇలాగే మళ్లించేందుకు కట్ట ను గండ్ల వద్ద మరింతగా బలోపేతం చేస్తున్నారు. 8 వేల క్యూసెక్కుల వరదను మళ్లించేందుకు వీలుగా కట్టను సిద్ధం చేస్తున్నారు. ఒక్క చుక్క కూడా రాళ్ల నుంచి లీక్ కాకుండా చర్యలు తీసుకోవాలని, అందుకు ఏ రకం మట్టి వాడితే బా గుంటుందనే దానిపై నిపుణులతో మంత్రి నిమ్మల రామానాయుడు చర్చిస్తున్నారు. పడవలో బుడమేరులో ప్రయాణిస్తూ.. గండ్ల వద్ద లోతును గెడ కర్రతో కొలిచారు. మొత్తం గండ్లను పూడ్చివేశామని, ఇప్పుడు నీరు లీక్ కాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. మరో పక్క కుడి కట్టకు పడిన గండ్లను కూడా యుద్ధప్రాతిపదికన పూడ్చుతున్నారు.

ఏ గండినీ వదలొద్దు..: లోకేశ్

బీడీసీ ఎడమ కాలువకు పడిన గండ్లను పూడ్చిన వెంటనే.. కుడి కాలువకు పడిన గండ్లతోపాటు పులివాగుకు పడిన గండ్లను కూడా పూడ్చించాలని మంత్రి నిమ్మల రామానాయుడికి మంత్రి లోకేశ్ సూచించారు. శనివారం ఆయన గండ్ల పూడ్చివేత పనులను పరిశీలించిన అనంతరం నిమ్మలతో మాట్లాడారు. రికార్డు స్థాయిలో గండ్లను పూడ్చివేయించిన నిమ్మలకు అభినందనలు తెలిపారు.

ప్రకాశం బ్యారేజీకి 3 కౌంటర్ వెయిట్ల ఏర్పాటు

▸▸ పాత సిమెంటు దిమ్మెల స్థానంలో స్టీల్ కౌంటర్లు

▸▸ స్వయంగా వెళ్లి పరిశీలించిన సీఎం

▸▸ వివరాలు తెలిపిన కన్నయ్యనాయుడి బృందం

విజయవాడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీలో దెబ్బతిన్న కౌంటర్ వెయిట్ల స్థానంలో కొత్తవాటి ఏర్పాటు పూర్తయింది. దెబ్బతిన్న సిమెంటు దిమ్మెల స్థానంలో ఇనుప వెయిట్లు అమర్చారు. ప్రభుత్వ సలహాదారు, గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడి పర్యవేక్షణలో..3 రోజులుగా బెకమ్ కంపెనీ నిపుణుల బృందం ఈ పనిలో నిమగ్నమైంది. బ్యారేజీ గేట్ల వెనుక సిమెంట్ కౌంటర్ వెయిట్లు దన్నుగా ఉన్నాయి. ఇటీవలి వరద ఉధృతికి ఎగువ నుంచి ఇనుప బోట్లు వచ్చి ఢీ కొట్టడంతో 64, 67, 69, 70వ నంబర్ గేట్ల వద్ద ఉండే వెయిట్లు దెబ్బతిన్నాయి. వాటిలో 64వ వెయిట్ స్వల్పంగా దెబ్బతినడంతో దానిని మార్చాల్సిన అవసరం లేదని నిర్ధ యించారు. 67, 69 కౌంటర్ వెయిట్లు మధ్యకు విరిగిపోయాయి. 70వ నంబరు వెయిట్‌కు పగుళ్లు వచ్చాయి. దీంతో ఈ మూడింటి స్థానంలో స్టీల్ వెయిట్లు బిగించారు. వీటిని హైదరాబాద్ నుంచి తీసుకొచ్చారు. బిగించిన వెయిట్లలో ఇప్పుడు ఇనుము, సిమెంటు మిశ్రమం పోయాల్సి ఉంది. కొత్త కౌంటర్ వెయిట్లను సీఎం చంద్రబాబు ఆదివారం పరిశీలించారు. కన్నయ్యనాయుడు పనుల వివరాలను ఆయనకు వివరించారు. అదే సమయంలో 69వ నంబరు గేటు వద్ద ఇరుక్కుపోయిన మూడు బోట్లను సీఎం పరిశీలించారు. వాటిపై అధికారులను ప్రశ్నించారు. ఈ బోట్లపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు బదులిచ్చారు.

కౌంటర్ల ఏర్పాటు ప్రక్రియ ఇలా..

1 బ్యారేజీలో ప్రస్తుతం ఉన్న కౌంటర్ వెయిట్ల ఒక్కో దాని బరువు 17 టన్నులు.
1 దెబ్బతిన్న వెయిట్లను డ్రిల్లింగ్ మిషన్‌తో మూడు ముక్కలు చేసి, క్రేన్ సహాయంతో బయటకు తీశారు. పాత వాటి స్థానంలో అదే బరువు ఉన్న కౌంటర్ వెయిట్లను అమర్చారు.
1 ఒక్కో కొత్త వెయిట్ బరువు 4.8 టన్నులు.
1 వీటికి రెండు పెద్ద రంధ్రాలు ఉన్నాయి. ఇప్పుడు గ్యాస్ వెల్డింగ్ ద్వారా వాటికి తొమ్మిది రంధ్రాలు చేస్తున్నారు.
1 ఒక్కో రంధ్రంలో 27 సంచుల ఐరన్ స్క్రాబ్(బిళ్లలు, మేకులు, విరిగిన ముక్కలు) వేస్తారు. ఒక్కో సంచిలో 30 కిలోల ఐరన్ స్క్రాబ్ ఉంటుంది.
1 ఈ స్క్రాబ్‌ను ఒక్కో రంధ్రంలో 27 సంచుల లెక్కన పోస్తారు. ఇలా 8.7 టన్నుల స్క్రాబ్‌ను వేస్తారు.
1 అనంతరం దానిపై 3.50 టన్నుల కాంక్రీట్ పోస్తారు.
1 3 దశల్లో బరువును 17 టన్నులకు చేర్చుతారు.



బ్యారేజీపై కౌంటర్ వెయిట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



జక్కంపూడి కాలనీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



వాంబే కాలనీ సీ బ్లాక్‌లో బురదలో నడుస్తూ సహాయ చర్యలను పరిశీలిస్తున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, అనిత, ఎంపీ కేశినేని చిన్ని



కాలువ పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

సచివుల సేవా యజ్ఞం!

- ఎక్కడికక్కడ... ఎవరికి వారుగా!
- రోజంతా ముంపు ప్రాంతాల్లోనే
- మంత్రులతోపాటు ఉన్నతాధికారులూ.. సహాయ చర్యల ప్రత్యక్ష పర్యవేక్షణ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అటు సీఎం విజయవాడ కలెక్టరేట్‌లో మకాం! ఇటు మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు ఎక్కడికక్కడ వరద బాధితుల మమేకం! తెల్లవారింది మొదలు రాత్రి పొద్దుపోయేదాకా.. నిరంతరం ముమ్మర పర్యవేక్షణ సాగిస్తున్నారు. మునిసిపల్ మంత్రి పి.నారాయణ, విద్యా మంత్రి లోకేశ్, ఎక్సయిజ్ మంత్రి కొల్లు రవీంద్ర, పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటు ముఖ్యమంత్రి వద్ద సమీక్షల్లో పాల్గొంటూనే అటు క్షేత్ర స్థాయి పనులు కూడా చూసుకొంటున్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా వీరితోనే ఉంటున్నారు. మంత్రులు అనిత, సంధ్యారాణి, సవిత, అచ్చెన్నాయుడు, జనార్దన రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, డోలా బాల వీరాంజనేయ స్వామి తదితరులు విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో మోకాలి లోతు నీళ్లలోనే తిరుగుతూ సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకొంటున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని సహా పలువురు నేతలు నిరంతరం సహాయ చర్యల్లో పాల్గొంటున్నారు. కనీసం డజను మంది సీనియర్ ఐఏఎస్ అధికారులు నిరంతరం సహాయ చర్యలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. ఇరిగేషన్ కార్యదర్శి సాయి ప్రసాద్ బుడమేరు గండి పూడ్చే పనుల పర్యవేక్షణలో భాగంగా రెండు రోజులు కట్ట మీదే మకాం వేశారు. రెవె న్యూ ప్రత్యేక సీఎస్ సిసోడియా నీళ్లలోకి దిగి స్వయంగా ఇంటింటికీ ఆహారం, మంచినీళ్లు పంచారు. మరో పది మంది ఐఏఎస్ అధికారులు ఒక్కో వార్డుకు ఇన్‌చార్జులుగా ఉండి పంపిణీని పర్యవేక్షిస్తున్నారు. వరద దెబ్బకు పలువురు అధికారులు అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి రవిచంద్ర, జీఏడీ కార్యదర్శి సురేశ్ కుమార్ తదితర ఐఏఎస్‌లు జ్వరాల బారిన పడ్డారు. కలెక్టరేట్ ఆవరణలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.



రావిఅనంతవరం-పెదపులివర్రు మధ్య మంగళవారం తెల్లవారు జామున గండి పడకుండా కాపలాకాస్తూ, పరిస్థితిని పర్యవేక్షిస్తున్న మంత్రులు గొట్టిపాటి, అనగాని, స్థానికులు

ఆ ఇద్దరు... మరో వెయ్యి మంది!

- కడ'గండ్ల'ను ఆపిన మంత్రులు అనగాని, గొట్టిపాటి

రేపల్లె: ఇద్దరు మంత్రులు... వెయ్యిమంది సొంత సైన్యం... 8 జేసీబీలు, వందకు పైగా ట్రాక్టర్లు.. 35 కిమీ కరకట్ట... రాత్రంతా పరుగులు పెడుతూనే ఉన్నారు. తెల్లవార్లూ నిద్రలేకుండా కావలి కాశారు. ఎక్కడా గండి పడకుండా, చుక్కనీరు కరకట్ట వెలుపలకు దిగనివ్వకుండా అడ్డుకోగలిగారు. రేపల్లెతోపాటు మరికొన్ని ఊళ్లను కాపాడగలిగారు. ఆ మంత్రులు... అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్! ఈ నెల 2, 3 తేదీల్లో 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించింది. కృష్ణా కుడి కరకట్ట చాలాచోట్ల బలహీనపడిపోయి ఉండటంతో కట్టలు తెంచుకుని ఊర్లపై పడేలా ఉంది. మంత్రులిద్దరూ రివర్ కన్జర్వేటివ్ అధికారులతో చర్చలు జరిపారు. సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతున్న ఆ విభాగంపై భారం వేస్తే లాభం లేదని భావించి.. తామే నడుం బిగించారు. పెదపులివర్రు, ఓలేరు పల్లెపాలెం, పెనుమూడి, రావి అనంతవరం, రుద్రవరం, లంకెవానిదిబ్బ ప్రాంతాల్లో కరకట్ట ప్రమాదకరంగా ఉందని గుర్తించారు. అధికారులతో చర్చించి తమ సొంత సైన్యాన్ని, స్థానికులకు తోడుగా నిలిపి, యుద్ధప్రాతిపదికన 8 జేసీబీలను దింపారు. 100కిపైగా ట్రాక్టర్లు మట్టి, ఇసుక ఏది దొరికితే దానిని తీసుకొచ్చిపోస్తుంటే, జనం 15వేలకుపైగా బస్తాల్లో మట్టి నింపి, ఒక్క రాత్రిలోనే కరకట్టపై రక్షణ కవచాన్ని ఏర్పాటు చేశారు. ఒక్కో చోట రాత్రంతా 200 మందికిపైగా జనాన్ని కాపలా ఉంచి, అన్ని చోట్లకు ఇద్దరు మంత్రులు ద్విచక్ర వాహనాలపై రాత్రంతా తిరుగుతూనే ఉండటం అటు జనాల్లోనూ ఉత్సాహాన్ని నింపింది. మొత్తం మీద సమష్టిగా కృషి చేసి గండ్ల భయం లేకుండా కాపాడగలిగారు.

విపత్తుపై యుద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

తరలి వచ్చింది. దాదాపు 15 మంది మంత్రులు, పదుల సంఖ్యలో అఖిలభారత సర్వీసు అధికారులు రంగంలోకి దిగారు. 'చివరి బాధితుడిని సైతం ఆదుకోవాలి' అనే లక్ష్యం పెట్టుకున్నారు. సీఎం, మంత్రులు, అధికారులు మొదటి 72 గంటలు కంటిమీద కునుకు వేయకుండా వరద ప్రభావిత ప్రాంతాలను అంటిపెట్టుకుని పని చేశారు. ముందుగా ఆ ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, నీటిని అందించేందుకు సమీపంలో ఉన్న పవర్ బోట్లు తెప్పించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దించారు. ముంపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు కూడా ప్రభుత్వం అందించింది. ఇలా...తొలి అడుగులోనే ప్రజల్లో ధైర్యం, భరోసా కల్పించడంలో విజయవంతమైంది.

చంద్రబాబుకు పెద్ద సవాల్..

గతంలో ముఖ్యమంత్రిగా పని చేసిన 14 ఏళ్ల కాలంలో చంద్రబాబు చూసిన అతి పెద్ద విపత్తు హుద్‌హుద్ తుఫాను! అప్పుడు ఆయన పదిరోజులు విశాఖలోనే ఉండి... పరిస్థితి మొత్తం చక్కబడ్డాకే వెనుదిరిగారు. ఇప్పుడు విజయవాడలో అంతకుమించిన ముప్పు తలెత్తింది. హుద్‌హుద్ తుఫాను విశాఖ మొత్తాన్ని అతలాకుతలం చేసింది. పెనుగాలులకు విశాఖలో కరెంటు స్తంభాలు కుప్పకూలాయి. అప్పుడు వరద లేదు, నీరు నిల్వలేదు! విద్యుత్ స్తంభాలు, కూలిన చెట్లను తొలగించగానే సగం సమస్య తీరింది. కానీ... విజయవాడలో పరిస్థితి పూర్తి భిన్నం! బాధితుల వద్దకు వెళ్దామంటే పీకల్లోతు వరద నీరు! ఎడతెరిపి లేని వర్షం! ఉప్పొంగుతున్న కృష్ణా నది! అటు... బుడమేరుకు భారీ గండ్లు. ఒకేసారి ఇన్ని సవాళ్లు... ఇన్ని కష్టాలు! అయినా... చంద్రబాబు అదరలేదు, బెదరలేదు! సవాలుగా తీసుకుని, సహాయ చర్యలు చేపట్టారు.

అటు ప్రకాశం బ్యారేజీపై..

ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నదిలో రికార్డు స్థాయి వరద ప్రవహిస్తున్న సమయంలోనే పెద్దబోట్లు గేట్లను ఢీకొట్టడం తీవ్ర ఆందోళనకు కారణమైంది. దీంతో... గేట్లకు సంబంధించిన కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్నాయి. ఈ సవాలును కూడా ప్రభుత్వం దీటుగా ఎదుర్కొంది. అప్పటికప్పుడు కొత్త కౌంటర్ వెయిట్లను అమర్చే పనులు మొదలుపెట్టారు. ఆదివారానికి ఈ పనులూ కొలిక్కి వచ్చాయి. సోమవారం బోట్ల తొలగింపు ప్రక్రియ మొదలుకానుంది.

కేంద్రం సత్వర స్పందన

విజయవాడలో ఉన్న పరిస్థితిని సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు కేంద్రానికి వివరిస్తూ వచ్చారు. నేరుగా ప్రధాని దృష్టికే తీసుకెళ్లారు. దీంతో కేంద్రం కూడా తక్షణం స్పందించింది. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేక బృందంతో విజయవాడకు వచ్చారు. కేంద్ర మంత్రితో చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయి, వాస్తవ పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చూపించారు. బుడమేరు గండ్లు పూడ్చడానికి సైన్యం రంగంలోకి దిగిందంటే కారణం... కేంద్రం సత్వర స్పందనే! టెక్నాలజీ అంటే చంద్రబాబు... చంద్రబాబు అంటే టెక్నాలజీ అనేది మరోసారి నిరూపితం అయింది. వరద సహాయ చర్యల్లో టెక్నాలజీని ఉపయోగించుకున్నారు. ముంపు ప్రాంతాల్లో సహాయ సిబ్బంది కూడా వెళ్లలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహారం, ఔషధాలు పంపించారు. వార్డుల్లో సహాయ చర్యల కోసం ప్రత్యేక యాప్‌లను ఉపయోగించారు. ఆయా వార్డుల్లో ఎన్ని ఇళ్లు ఉన్నాయి, ఎంత మంది ప్రజలున్నారు. గర్భిణులు, చిన్నారులు సహా అందరి డేటాతో యాప్ సిద్ధం చేశారు. రాష్ట్ర యంత్రాంగం మొత్తాన్ని వరద సహాయక చర్యల్లో దింపేశారు. వరద ప్రభావం లేని జిల్లాల నుంచి రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, పంచాయతీరాజ్, ఆరోగ్యశాఖ సిబ్బందిని విజయవాడకు రప్పించారు. నిత్యావసరాలను పంపిణీ చేసే వాహనాలు, ఫైరింజన్లు, వాటర్ ట్యాంకులు, చెత్తతరలించే వాహనాలు... ఇలా అన్నింటినీ ఇతర జిల్లాల నుంచి విజయవాడకు తీసుకొచ్చారు. ప్రతి వార్డుకు 30 నుంచి 40 మందిని అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించారు.

పోటీపడ్డ మంత్రులు...

వరద సహాయంలో తొలి రెండు మూడురోజులు మాత్రమే తడబాటు కనిపించింది. తర్వాత ఎక్కడా లోటుపాట్లు తలెత్తలేదు. సీఎంతోపాటు మంత్రులు, అధికారులు రాత్రింబవళ్లు పని చేశారు. ఎప్పుడూ ఏసీ గదుల్లో ఉండే సీనియర్ ఐఏఎస్‌లు సైతం వరద నీళ్లలోకి దిగారు. బురదలో పని చేశారు. బాధితులకు స్వయంగా మంచీనీరు, ఆహారం అందించారు. చిన్నా, పెద్దా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులూ ముంపు బాధితులకు ఆపన్న హస్తం అందించారు. కర్ణాటక, తమిళనాడు నుంచీ సహాయ సామగ్రితో తరలిరావడం విశేషం.

విరాళాల వెల్లువ...

విజయవాడ వరద బాధితులకు సహాయం అందించాలని సీఎం చంద్రబాబు ఇచ్చిన చిన్న పిలుపునకు భారీ స్పందన లభించింది. ముఖ్యమంత్రి సహాయ నిధి ఖాతాల్లో ఎనిమిది రోజుల్లో వందల కోట్లు వచ్చి చేరాయి. ఏపీఎన్జీవోల నుంచే రూ.120 కోట్ల సహాయం అందింది. సినీ ప్రముఖులు స్పందించి కోట్ల రూపాయల విరాళాలు ప్రకటించారు. పారిశ్రామిక వేత్తలు విరాళాలు ఇస్తూనే ఉన్నారు.

సవాల్‌గా మారిన బుడమేరు గండి..

బుడమేరుకు పడిన భారీ గండ్లు పూడ్చితే తప్ప... వరద ప్రభావం తగ్గదు. 'ఇప్పటికిప్పుడు ఏం చేయలేం. వరద మొత్తం పోతేతప్ప గండ్లు పూడ్చలేం' అని ప్రభుత్వం చేతులెత్తేయలేదు. యుద్ధ ప్రాతిపదికన గండ్ల పూడ్చివేతకు శ్రీకారం చుట్టింది. ఈ బాధ్యతలను మంత్రి నిమ్మల రామానాయుడితోపాటు మరో ముగ్గురు అధికారులకు అప్పగించారు. వారు కట్టమీదే మకాం వేశారు. మంత్రి లోకేశ్ కూడా స్వయంగా పర్యవేక్షించారు.రెండు గండ్లు చిన్నవైనా, మూడోది మాత్రం దాదాపు 100 మీటర్ల పొడవున ఉంది. దీనిని పూడ్చడం పెద్ద సవాల్‌గా మారింది. ఇది పూడ్చితే తప్ప వరద తగ్గదు. దీంతో... పరిస్థితిని చంద్రబాబు కేంద్రానికి వివరించారు. కేంద్ర ం వెంటనే ఆర్మీని దించింది. ఆర్మీ సహాయంతో శనివారానికి గండిని పూడ్చగలిగారు. అంతేకాదు.. మళ్లీ భారీగా వరద నీరు వచ్చినా నష్టం జరగకుండా, గండ్లు పడిన చోట బుడమేర కట్ట ఎత్తు పెంచాలని చంద్రబాబు ఆదేశించారు.



ఇంకా వరద నీటిలోనే అంబాపురం ప్రాంతం

డ్రోన్లు ఎగురుతున్నాయ్!

- బాధితుల సేవలో 176 డ్రోన్లు.. ఆహారం, నీరు, ఔషధాల పంపిణీ
- 1.23 లక్షల మందికి సేవలు.. క్షేత్రస్థాయి పర్యవేక్షణకూ వినియోగం



అమరావతి/విజయవాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డ్రోన్లు... డ్రామా కాదు! విపక్షం విమర్శించినట్లు అలంకారప్రాయమూ కాదు! వరద బాధితుల సేవలో ఇవి సమర్థంగా పని చేస్తున్నాయి. బోట్లు, ట్రాక్టర్లు, సిబ్బంది వెళ్లలేని ముంపు ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా సహాయం అందిస్తున్నారు. వరద బాధిత ప్రాంతాల్లో మొత్తం 176 డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. ఇందులో 115 డ్రోన్లను ఆహార పదార్థాలు, ఔషధాలు, రక్షిత మంచినీరు అందజేస్తున్నారు. సహాయ సిబ్బంది నేరుగా చేరుకునే అవకాశం లేని ప్రాంతాల్లోకి డ్రోన్లు రంగంలోకి దిగుతున్నాయి. వీటి ద్వారా ఇప్పటికి 1.23 లక్షల మందికి ఆహారం, మందులు అందించినట్లు అధికారులు తెలిపారు.50 డ్రోన్లతో ముంపు ప్రాంతాల్లో పరిస్థితిని, వరద తీరును పర్యవేక్షిస్తున్నారు. మరో 11 డ్రోన్లతో క్రిమిసంహారకాలను పిచికారీ చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన ఢిల్లీరావు గతంలో డ్రోన్ల వినియోగాన్ని బాగా ప్రోత్సహించారు. ఇప్పుడు ఆయన వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. వరదల సమయంలో ఆహారం, ఔషధాల పంపిణీకి డ్రోన్లను వినియోగించాలన్నది ఆయన ఆలోచనే! వ్యవసాయశాఖ, ఎన్జీ రంగా అగ్రి వర్సిటీ, డ్రోన్ కార్పొరేషన్ సంయుక్త సహకారంతో డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు.

వరదలో ఉన్నా.. పెద్ద మనసు



తమకు ఆశ్రయం కల్పించిన రమేశ్‌తో పారిశుధ్య కార్మికుల సెల్ఫీ

వరద ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పారిశుధ్య కార్మికులు తరలివచ్చారు. సుమారు 10 వేల మంది పారిశుధ్య కార్మికులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో చాలా మంది ఖాళీ భవనాల్లో తలదాచుకుంటూ, ప్రభుత్వం అందించే ఆహారాన్ని తీసుకుంటూ పనులు చేస్తున్నారు. చాలా మంది బహిరంగ ప్రదేశాల్లోనే నిద్రపోతున్నారు. అనకాపల్లి మున్సిపాలిటీ నుంచి వచ్చిన సుమారు 50 మంది పారిశుద్ధ కార్మికులకు సింగ్‌నగర్‌కు చెందిన వి.రమేశ్ తన ఇంటిలో ఆశ్రయం కల్పించారు. ఆయన ఇంటి చుట్టూ వరద చేరినా ఇంట్లోకి నీరు రాలేదు. దీంతో 4 రోజులు ఆ ఇంట్లోనే వారంతా ఆశ్రయం పొంది వరద బాధితులకు సేవలందించారు. ఆదివారం వారంతా స్వస్థలాలకు పయనమవుతూ రమేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో సెల్ఫీ దిగారు.

బీమా సేవలకు క్లెయిమ్ ఫెసిలిటేషన్ సెంటర్

అమరావతి, విజయవాడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల కుండపోత వర్షాల కారణంగా దెబ్బతిన్న గృహాలు, వాహనాలు, దుకాణాలు, చిన్న, మధ్య తరహా వ్యాపార సముదాయాల వంటి ఆస్తులకు సంబంధించిన బీమా క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అవాంతరాలు లేకుండా క్లెయిమ్‌లను నమోదు చేసుకోవటానికి, అసెస్‌మెంట్ కోసం సర్వేయర్లను నియమించడం కోసం, క్లెయిమ్ ఫారాల సమర్పణ, ఇన్సూరెన్స్ క్లెయిమ్‌ల తక్షణ పరిష్కారం కోసం ఇన్సూరెన్స్ క్లెయిమ్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. అక్కడ అన్ని బీమా కంపెనీల ప్రతినిధులు అందుబాటులో ఉంటారని ప్రభుత్వం ప్రకటించింది.

శభాష్ నిమ్మల

- 6 రోజులుగా బుడమేరు గట్టుపైనే
- మూడు గండ్లను దగ్గరుండి పూడ్పించిన నిమ్మల
- వర్షంలోనూ గొడుగు పట్టుకుని మంత్రి పర్యవేక్షణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ఆరు రోజులుగా బుడమేరు గట్టుపైనే మకాం! నిద్రాహారాలు పట్టించుకోకుండా పగలూ, రాత్రీ అక్కడే! భోరున వర్షం కురుస్తున్నా అక్కడి నుంచి కదల్లేదు. వర్షంలోనూ గొడుగు పట్టుకుని గట్టుపైనే ఉన్నారు. విజయవాడ, పరిసర గ్రామాలను ముంచెత్తిన బుడమేరుకు పడిన మూడు గండ్లనూ పూడ్చేదాకా నిద్రపోలేదు. ఆయనే... రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. పసుపు పచ్చని చొక్కా, తెల్లని ప్యాంటుతో దగ్గరుండి గండ్ల పూడ్చివేత పనులు పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు, మంత్రి లోకేశ్ సూచనల మేరకు అధికారులతో సమన్వయంతో చేసుకుంటూ ఓ యజ్ఞంగా పని పూర్తి చేశారు. బుడమేరుకు పడిన మూడు గండ్లలో రెండింటిని (20 మీటర్లు, 30 మీటర్లు)ని త్వరగానే పూడ్చారు. అయితే మూడో గండి (100 మీటర్లు) భారీగా ఉండటం, మరోవైపు బుడమేరు వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో పూడ్చివేత కష్టంగా మారింది. ఇంతలో ముఖ్యమంత్రి చంద్రబాబు వినతి మేరకు కేంద్రం ఆర్మీ బృందాన్ని పంపింది. వారి సాయంతో గండిని పూడ్చగలిగారు. మంత్రి సోమవారం నుంచి ఆదివారం ఉదయం వరకు అక్కడే ఉన్నారు. బుడమేరు గండ్లు పూడ్చివేశారనే వార్త తెలియగానే విజయవాడ, పరిసర గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ముంపు ప్రాంతాల్లో వరద క్రమేణా తగ్గుతుండటంతో ఊరట పొందుతున్నారు. అందరూ.. 'శభాష్.. నిమ్మల రామానాయుడూ' అంటూ ప్రశంసిస్తున్నారు. ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి బుడమేరు మూడు గండ్లు పూడ్చేసిన విషయాన్ని రామానాయుడు వివరించారు. రామానాయుడును చూస్తూనే 'గుడ్‌జాబ్' అంటూ చంద్రబాబు అభినందించారు. బుడమేరుకు మళ్లీ వరద పెరుగుతుండటంతో గండ్లను పూడ్చిన చోట్ల గట్లను మరో మీటరున్నర ఎత్తుకు పెంచాలని చంద్రబాబు సూచించారు మరో రెండు రోజుల పాటు భారీ వర్షసూచన ఉన్నందున బుడమేరు గట్లను దాటి బయటకు రాకుండా చర్యలు చేపట్టాలని రామానాయుడును ఆదేశించారు. చంద్రబాబు ఆదేశాలతో రామానాయుడు మళ్లీ బుడమేరు గట్లపైకి చేరుకున్నారు. బుడమేరు గట్లను మరింత బలోపేతం చేస్తూ, ఎత్తును పెంచే కార్యక్రమాల పనిశీలనలో భాగంగా బోటుపై ప్రయాణించారు. బుడమేరు నీటి లోతు ఎంతుందో స్వయంగా పరిశీలించారు.



బుడమేరు గండ్ల వద్ద మంత్రులు లోకేశ్, నిమ్మల

బ్యారేజీపై 'కుట్ర'!



(మొదటి పేజీ తరువాయి)

ప్రకాశం బ్యారేజీకి రికార్డు స్థాయిలో 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. అదే సమయంలో... బ్యారేజీకి ఎగువన గొల్లపూడి నుంచి ఐదు ఇనుప బోట్లు కొట్టుకొచ్చాయి. ఇందులో మూడు బోట్లు బ్యారేజీ గేట్ల వెనుక ఉండే కౌంటర్ వెయిట్లను బలంగా ఢీ కొట్టాయి. అవి ప్రస్తుతం బ్యారేజీ 67, 69వ ఖానాల వద్ద చిక్కుకుని ఉన్నాయి. ఈ మూడు బోట్ల యజమాని పేరు... ఉషాద్రి. ఆయన... తలసిల రఘురామ్‌కు సన్నిహితుడైన రామ్మోహన్ అనుచరుడు. రామ్మోహన్, ఉషాద్రి కలిసే బోట్ల ద్వారా కృష్ణా నదిలో ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారు.

అనుమానాలు ఎందుకంటే...

ఐదు బోట్లలో మూడింటిపై వైసీపీ రంగులు వేసి ఉన్నాయి. అందులోనూ... ఒకదానికొకటి ఇనుప గొలుసులతో అనుసంధానించారు. సాధారణంగా బోట్లను ఇలా ఒకదానికొకటి కట్టరు. ఎందుకంటే... కొటి కొట్టుకుపోతే మిగిలినవీ కొట్టుకుపోతాయి. పైగా... ఇలా ఒకదానికొకటి కట్టేసిన మూడు బోట్లను ఒక ప్లాస్టిక్ తాడుతో గొల్లపూడి శ్మశానం వద్ద ఉన్న ఒక చెట్టుకు కట్టి ఉంచారు. ఒక్కోటి 40-50 టన్నులున్న బోట్లు... పైగా మూడింటిని ఇనుప గొలుసులతో కట్టి... అసలైన లంగరు మాత్రం ప్లాస్టిక్ తాడుతో వేయడం అనుమానాలకు తావిస్తోంది. దీనికి బలమైన తాడు కూడా వాడలేదు. కృష్ణా నదిలో వరద పెరుగుతోందని, బోట్లను పకడ్బందీగా కట్టి ఉంచాలని స్థానికులు హెచ్చరించినా పట్టించుకోలేదు. చివరికి... మూడు బోట్లు 'కలిసికట్టు'గా వచ్చి ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టాయి. మరో రెండు బోట్లు కొట్టుకు రావడానికి కారణం ఈ మూడు బోట్లేనని, ఇవి ఢీకొనడంతో అవి కూడా నదిలోకి కొట్టుకు వచ్చాయని పోలీసులు నిర్ధారించారు.

ఇసుక దందాలో...

ఈ ఘటనలో రామ్మోహన్, ఉషాద్రి నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని పోలీసులు నిర్ధారించారు. వీరిద్దరికీ నందిగం సురేశ్, తలసిల రఘురామ్‌లతో సంబంధాలున్నాయని తేల్చారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి బాపట్ల ఎంపీ నందిగం సురేశ్, జగన్‌కు అత్యంత సన్నిహితుడు, ఎమ్మెల్సీ తలశిల రఘురాం కృష్ణా నదిలో ఇసుక దందాను బాగా కొనసాగించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇనుప బోట్లను నదిలో తిప్పుతూ ఇసుకను ఒడ్డుకు చేర్చేవారు. ఈ వ్యవహారాలు నందిగం సురేశ్, తలశిల రఘురాం కనుసన్నల్లో జరిగాయన్నది బహిరంగ రహస్యం. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ బోట్లు నదికి అవలన ఉద్దండరాయనిపాలెం వైపు నిలిపి ఉండేవి. అక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహించేవి. ఇటీవలే ఇవి గొల్లపూడి వైపు వచ్చాయి. దీనిపైనా అనుమానాలు తలెత్తుతున్నాయి. కౌంటర్ వెయిట్లకు జరిగిన నష్టంపై కేఆర్‌సీ (కృష్ణా రివర్ కన్జర్వేషన్) ఈఈ పీవీఆర్ కృష్ణారావు విజయవాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ గురుప్రకాశ్ ఈ ఫిర్యాదుపై క్రైం నంబరు 171/2024తో ఐపీసీ 336(రాష్ అండ్ నెగ్లిజన్స్), పీడీపీపీ యాక్ట్‌లోని సెక్షన్ 3 కింద కేసు నమోదు చేశారు.

ముందు నుంచే అనుమానాలు...

బ్యారేజీ వద్ద కౌంటర్ వెయిట్ల ఏర్పాటును పరిశీలించిన జలవనరుల శాఖ మంతి నిమ్మల రామానాయుడు... బోట్లు ఢీ కొన్న ఘటన వెనుక కుట్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. దర్యాప్తులో అన్ని విషయాలు బయట పడతాయని అభిప్రాయపడ్డారు. నదిలో చేపల వేట సాగించడానికి మత్స్యకారులు చెక్క బోట్లను ఉపయోగిస్తారు. ఇసుకను తరలించడానికి ఇనుప బోట్లను ఉపయోగిస్తారు. ఈ రెండు రకాల బోట్లు నదిలో సంచరించాలంటే బోట్స్ అసోసియేషన్‌లో సభ్యత్వం ఉండాలి. దీంతో పాటు మత్స్యశాఖ, జలవనరుల శాఖ అనుమతులు ఉండాలి. ప్రతి ఏడాది రెన్యువల్ చేయించుకోవాలి. ఈ మూడు బోట్లకు చెందిన యజమానులకు బోట్స్ అసోసియేషన్‌లో సభ్యత్వం, ప్రభుత్వ అనుమతులు లేవని గొల్లపూడి బోట్ల యజమానులు ఆరోపిస్తున్నారు.

పోలీసుల ముందుకు యజమానులు

ప్రకాశం బ్యారేజీ కౌంటర్ వెయిట్లను బోట్లు ఢీ కొట్టిన ఘటనపై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. కోమటి రామ్మోహన్, ఆయన సన్నిహితుడు ఉషాద్రిని పోలీసులు స్టేషన్‌కు రప్పించారు. ఏడీసీపీ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ గురుప్రకాశ్ విచారించారు. ఈ బోట్లకు, తనకు ఎలాంటి సంబంధం లేదని రామ్మోహన్ వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసింది. బ్యారేజీ వద్దకు వచ్చిన బోట్లలో మూడు తనవేనని ఉషాద్రి అంగీకరించారు. వాటికి అనుమతులు ఉన్నాయని, లైసెన్స్‌ను రెన్యువల్ చేయించానని కొన్ని ధ్రువీకరణ పత్రాలు చూపించినట్లు తెలిసింది.

వరద మరణాలు 45

- ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే 35 మంది మృతి

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా 45మంది మరణించారు. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే మృతుల సంఖ్య 35కు చేరింది. గల్లంతైన ఒకరి ఆచూకీ ఇంకా లభించలేదు. గుంటూరు జిల్లాలో ఏడుగురు, పల్నాడు జిల్లాలో ఒకరు మృతిచెందగా, తాజాగా ఏలూరు జిల్లాల్లో రెండు మరణాలు నమోదయ్యాయి. వరదల వల్ల విజయవాడ నార్త్‌లో 10మంది, విజయవాడ రూరల్ 8, మొగల్రాజపురం 5, జీ కొండూరు 4, మైలవరం, ఇబ్రహీంపట్నం మండలాల్లో ఇద్దరు చొప్పున, రెడ్డిగూడెం, కంచికచర్ల, విజయవాడ సెంట్రల్, వెస్ట్ మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు.

స్లూయిజ్ గేట్ల చైన్లు 'డ్యామేజ్'!

(మొదటి పేజీ తరువాయి)

గొలుసుల లింకులను తొలగించి ఉన్నట్లుగా గుర్తించారు. దీనివల్ల ఆ గేట్ల పైకి ఎత్తడం కుదరదు. ప్రకాశం బ్యారేజీకి వచ్చిన 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిన సమయంలో ఈ స్లూయిజ్ గేట్లను ఓపెన్ చేసి ఉంటే .. అదనంగా మరో రెండు లక్షల క్యూసెక్కుల వరద బయటకు వచ్చి సముద్రంలోనికి వెళ్లేది. ఆ మేరకు బ్యారేజీపై ఒత్తిడి తగ్గేది. పది స్కోర్ స్లూయిజ్‌ల గేట్లకు బిగించి ఉన్న గొలుసులను తీసేయడం ద్వారా అవి పనిచేయకుండా చేయడం వెనుక కుట్ర కోణం దాగి ఉందనే జల వనరుల శాఖ ఇంజనీరింగ్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. స్కోర్ స్లూయిజ్‌లకు గొలుసులు తీసేసి ఉండటాన్ని అధికారులు ఇంజనీర్ ఇన్ చీఫ్ దృష్టికి తీసుకువెళ్లారు. స్లూయిజ్ గొలుసులు గురించి, వాటిని ప్రాధాన్యం గురించి సాంకేతికంగా తెలిసినవారే .. ఈ పని చేసి ఉంటారని జల వనరుల శాఖ భావిస్తోంది. "ఇది ప్రమాదమో, యాదృచ్ఛికమో కాదు. పొరపాటు జరిగితే... ఏదో ఒకటి రెండు గేట్ల గొలుసులు ఊడిపోవచ్చు. కానీ, మొత్తంగా పది గొలుసులు దెబ్బతినవు. దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తే అసలు విషయం బయటపడుతుంది" అని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

జగన్ హయాంలో అమరావతిని ముంచేసే కుట్రపన్నారు

- ఇప్పుడు ప్రకాశం బ్యారేజీని పడవలతో గుద్దించి బెజవాడను ముంచాలనుకున్నారు
- రాజధాని అమరావతి రైతు జేఏసీ ధ్వజం

తుళ్లూరు, సెప్టెంబరు 8: జగన్ హయాంలో అమరావతిని ముంచేసేలా కుట్ర పన్నారని, ఇప్పుడు ప్రకాశం బ్యారేజీని పడవలతో గుద్దించి బెజవాడను ముంచేయాలనుకున్నారని రాజధాని అమరావతి రైతు జేఏసీ ధ్వజమెత్తింది. వైసీపీ పాలనలో కృష్ణానదికి వరద వచ్చినప్పుడు ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తలేదని, తద్వారా రాజధానిని ముంచాలని చూశారని కమిటీ సభ్యులు ఆరోపించారు. ఇప్పుడు కృష్ణానదికి వరద వస్తే అమరావతి ముంపునకు గురైందని ప్రచారం చేస్తూ మరోసారి విషం చిమ్ముతున్నారని నిప్పులు చెరిగారు. పాకిస్థాన్ ఉగ్రవాదులకన్నా ఘోరంగా వైసీపీ నేతల ప్రవర్తన ఉందని మండిపడ్డారు. రాజధానిలోని తుళ్లూరు ఎత్తిపోతల పథకం భవనంలో ఆదివారం సమన్వయ కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడారు. అమరావతిని వరద నీరు చుట్టుముట్టిందంటూ గత నాలుగు రోజులుగా వైసీపీ పేటీఎం బ్యాచ్ విష ప్రచారం చేస్తోందని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ మునిగిందో చూపించాలని, క్షేత్రస్థాయిలో తమతో పర్యటనకు రావాలని వైసీపీ నేతలకు, మాజీ సీఎం జగన్‌కు వారు సవాల్ విసిరారు. మరో సభ్యుడు అనుమోలు బాలమురళీకృష్ణ మాట్లాడుతూ.. పడవలతో ప్రకాశం బ్యారేజ్ గేట్లను గుద్దించి విజయవాడను ముంచేయాలని వైసీపీ నాయకులు కుట్ర చేశారని తెలిపారు.

మరో ముప్పు!

(మొదటి పేజీ తరువాయి)

విజయనగరం, మన్యం జిల్లాలకు రెడ్ అలర్ట్, అల్లూరి, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఏపీ-ఒడిశా తీరంలో కేంద్రీకృతమైన వాయుగుండం తీవ్రరూపం దాల్చనుండటంతో కోస్తాంధ్ర జిల్లాల్లో కలకలం రేగుతోంది. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో వాగులు, వంకలు, కాలువలు, చెరువులు పూడిక తీయడం కానీ, కనీస మరమ్మతులు కానీ చేయలేదు. పైగా గత వైసీపీ ప్రభుత్వ అండతో వాగులు, చెరువులు కూడా కబ్జాకు గురయ్యాయి. దీని ఫలితమే బుడమేరులో వరద పోటెత్తడానికి కారణం. అందుకే వాయుగుండం అనగానే ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఇటీవల విజయవాడను ముంచెత్తిన వరద ఇంకా వారి కళ్ల ముందు మెదులుతూనే ఉంది. విజయవాడ వరదలతో పెద్ద ఎత్తున ఆస్తి, పంట నష్టం జరిగింది. భారీ వర్షాలు, వరదలతో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 45 మంది చనిపోయారు. ఎన్టీఆర్ జిల్లాల్లో 35 మంది వరదల కారణంగానే మృతి చెందారు. ఇద్దరు గల్లంతయ్యారు. 16 జిల్లాల్లో 5.15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కృష్ణానదికి రికార్డు స్థాయిలో దాదాపు 11.50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. వర్షాలు, వరదలకు ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఈ నేపథ్యంలో ఇలాగే భారీ వర్షాలు, వరదలు కురిస్తే.. ఏ వాగు పొంగుతుందో.. ఏ చెరువు కట్ట తెగుతుందో.. ఏ ఊరుని, ఏ పట్టణాన్ని వరదలు ముంచెత్తుతాయోననే ఆందోళన సర్వత్రా నెలకొంది. వారం క్రితం కురిసిన భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా 6.44 లక్షల మంది వరద ప్రభావితులయ్యారు. బుడమేరు ఉప్పొంగి విజయవాడను వరద ముంచెత్తడంతో.. ఇప్పటికీ జనం ఆ షాక్ నుంచి తేరుకోలేదు. గత ప్రభుత్వంలా జనాన్ని గాలికి వదిలేయకుండా, కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున సహాయ కార్యక్రమాలు చేపట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలో మకాం వేసి స్వయంగా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాగా, ఇప్పుడు మళ్లీ భారీ వర్షాలు కురిస్తే.. తమ పరిస్థితి ఏమిటి..? అనే ఆందోళన విజయవాడ నగర ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఓవైపు కృష్ణానదికి వరద తగ్గి, మళ్లీ పెరిగింది. మరోవైపు గోదావరికి వరదలొస్తున్నాయి. ఈ సమయంలో ఉత్తరాంధ్రలోనూ భారీ వర్షాలు కురిస్తే.. ఏలేరు రిజర్వాయర్‌కు వరద ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, వంశధార, నాగావళి నదులకు వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉత్తరాంధ్ర ఏజెన్సీ ప్రాంతాల్లోనూ వాగులు, వంకలు పొంగి ప్రవహించే సూచనలున్నాయి. ఈ నేపథ్యంలో విజయవాడలో వరద సహాయ చర్యల్లో తలమునకలైన చంద్రబాబు ఆదివారం సాయంత్రం అత్యవసరంగా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

ఉత్తరకోస్తాకు వాయు'గండం'

- ఉత్తరాంధ్రలో ఎడతెరిపి లేకుండా వానలు
- బంగాళాఖాతంలో బలపడిన తీవ్ర అల్పపీడనం

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మరో ముప్పు ముంచుకొస్తోంది. పది రోజుల వ్యవధిలో బంగాళాఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడనం.. ఇప్పుడు ఉత్తరాంధ్రకు వాయు 'గండం'గా మారింది. గతవారం అతలాకుతలమైన విజయవాడ ఇంకా తేరుకోక ముందే.. మరో వాయుగుండం ఉత్తర కోస్తాను కలవరపెడుతోంది. ఈ వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో శనివారం నుంచి బలమైన ఈదురుగాలులతో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ, కొన్నిచోట్ల కుంభవృష్టిగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది.

పూరి, డిఘా మధ్య తీరం దాటొచ్చు..

ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడనం శనివారం తీవ్ర అల్పపీడనంగా మారింది. ఆదివారం ఉదయానికల్లా మరింత బలపడి వాయుగుండంగా మారి పశ్చిమ మధ్య వాయవ్య బంగాళాఖాతంలో ప్రవేశించింది. ఇది ఉత్తర వాయవ్యంగా పయనించి ఆదివారం మధ్యాహ్నానికి కళింగపట్నానికి తూర్పుగా 270 కి.మీ., ఒడిశాలోని గోపాలపూర్‌కు తూర్పు ఆగ్నేయంగా 210 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర వాయవ్యంగా పయనించి పశ్చిమబెంగాల్, ఉత్తర ఒడిశా తీరాల వైపు చేరుకునే క్రమంలో సోమవారం ఉదయానికి తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. సోమవారం మధ్యాహ్నానికల్లా ఉత్తర ఒడిశాలోని పూరి, పశ్చిమబెంగాల్‌లోని డిఘా మధ్య తీరం దాటనుంది. తర్వాత రెండు రోజుల్లో పశ్చిమ వాయవ్యంగా పయనించి ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ మీదుగా జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ వైపు పయనిస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. వాయు గుండం వలన సముద్రం నుంచి భారీగా వస్తున్న తేమ ప్రభావంతో శనివారం సాయంత్రం నుంచి ఉత్తర కోస్తా జిల్లాల్లో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర కోస్తాలో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. సముద్రం అల్లకల్లోలంగా మారడంతో కోస్తాలో తీరం వెంబడి గంటకు 50 నుంచి 60 కి.మీ., అప్పుడప్పుడూ 70 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీస్తున్నాయి. ఇంకా కోస్తాకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో గాలుల వేగం పెరిగింది. కళింగపట్నం, భీమిలీ, విశాఖ, గంగవరం, కాకినాడ రేవుల్లో మూడో నంబరు, కోస్తాలో మిగిలిన రేవుల్లో ఒకటో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. రానున్న 24 గంటల్లో కోస్తాలో మత్స్యకారులు, ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఉత్తరాంధ్రలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. కాగా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎక్కువగా మేఘాలు ఆవరించాయి. ప్రధానంగా వంశధార, నాగావళి నదులకు వరద పెరుగుతుందని వాతావరణ నిపుణుడొకరు హెచ్చరించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న దీపక్ నెక్స్‌జెన్ ఎండీ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ చైతన్య వాసు

మానవత్వం పరిమళించగ..

- సీఎంఆర్ఎఫ్‌కు నిధుల ప్రవాహం
- పోలీస్ అధికారుల సంఘం 11.12 కోట్ల విరాళం

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల కన్నీటి వ్యథలు మానవత్వాన్ని తట్టి లేపుతున్నాయి. చలించిన మనసులు ఇతోధికంగా సాయం చేస్తున్నాయి. శని, ఆదివారాల్లో పలు రాజకీయ పార్టీల నేతలు, వ్యాపారవేత్తలు, ఉద్యోగ సంఘాలు, అనేక మంది ప్రముఖులు సీఎం చంద్రబాబును కలసి విరాళాల చెక్కులు అందించారు. ఏపీ పోలీస్ అధికారుల సంఘం తరఫున రూ.11 కోట్ల 12 లక్షల 50 వేలు అందజేశారు. విశ్వసముద్ర ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.2 కోట్లు, వరుణ్ గ్రూప్ డైరెక్టర్ వల్లూరిపల్లి లక్ష్మీ కిరణ్, ఎండీ వల్లూరిపల్లి వరుణ్‌దేవ్ కలసి రూ.2 కోట్లు, ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున డైరెక్టర్ శర్నాల గణేష్ రూ.1 కోటి, దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్, బొమ్మలూరు (బాపులపాడు మండలం) ఎండీ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ చైతన్య వాసు కలసి రూ.కోటి, వాటర్ సప్లై కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రూ.50 లక్షలు, రాష్ట్రానికి చెందిన డాక్టర్ ఎండ్లూరి ఆంజనేయులు, గుత్తా బాలాజీ, ఖైనేని శ్రీనివాస్, వల్లేపల్లి సూర్య కలిసి రూ.31 లక్షలు, ఏపీ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఉద్యోగుల సంఘం రూ.25 లక్షలు, శిద్దా రాఘవరావు రూ.25 లక్షలు, శిద్దా సూర్యప్రకాష్‌రావు, శిద్దా హనుమంతరావు రూ.25 లక్షలు, సిబార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ తరఫున డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ రూ.10 లక్షలు, వై రాజారావు రూ.10 లక్షలు, ఒంగోలుకు చెందిన హర్షిణి కాలేజ్ చైర్మన్ గోరంట్ల రవికుమార్ రూ.10 లక్షలు, సుదనగుంట వెంకట నరసింహారావు, భగీరథ కెమికల్స్ ఎండీ సింగవరపు చంద్రశేఖర్ రూ.10 లక్షలు, ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా - విజయవాడ చాప్టర్ తరఫున ఎస్ఎన్ పూర్ణిమ రూ.5 లక్షలు, కే సాంబశివరావు రూ.5 లక్షలు, సీహెచ్ పూర్ణ బ్రహ్మయ్య రూ.5 లక్షలు, డాక్టర్ శరత్‌బాబు రూ.5 లక్షల చెక్కు అందజేశారు.

మంత్రి లోకేశ్‌కు...

శని, ఆదివారాల్లో మంత్రి లోకేశ్‌ను కలసి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారి నాగశ్రవణ్ రూ.5 లక్షలు, దాచేపల్లి లక్ష్మిగాయత్రి హాస్పిటల్స్ అధినేత కామాటి వరలక్ష్మి రూ.5 లక్షలు, వల్లభనేని గిరిబాబు రూ.5 లక్షలు అందజేశారు.

కోటి చెక్‌ను సీఎంకు అందించిన డిప్యూటీ సీఎం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వరద సాయం కింద ప్రకటించిన రూ.కోటి చెక్‌ను శనివారం సీఎం చంద్రబాబుకు అందించారు. వరద సాయం కింద పంచాయతీలకు రూ.4 కోట్లు, సీఎంఆర్ఎఫ్‌కు రూ.1 కోటి ఆయన ప్రకటించారు. సీఎంఆర్ఎఫ్ చెక్‌ను సీఎం చంద్రబాబుకు అందించేందుకు విజయవాడ కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తెలంగాణ సీఎంకు విరాళం చెక్కును అందజేస్తున్న వీఐటీ వ్యవస్థాపక చాన్సలర్ డాక్టర్ కె. విశ్వనాథన్, ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్

తెలంగాణ వరద బాధితులకు వీఐటీ విరాళం రూ.1.50 కోట్లు

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన వర్షం, వరద బాధితులను ఆదుకోవాలని తమిళనాడులోని వేలూరుకు చెందిన వీఐటీ సాంకేతిక విశ్వవిద్యాలయం నిర్వాహకులు సంకల్పించారు. ఆ మేరకు విశ్వవిద్యాలయం వ్యవస్థాపక చాన్సలర్ డాక్టర్ కె. విశ్వనాథన్, ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుసుకుని రూ.1.50 కోట్ల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి

నవ్య

కుటుంబ కదంబం

సోమవారం • 9 సెప్టెంబరు 2024

features@andhrajyothy.com

కిట్ టిప్‌టాప్‌గా..

మేకప్



మేకప్ కోసం ఉపయోగించే సాధనాలు నాణ్యంగా ఉన్నప్పుడే, సౌకర్యంగా మేకప్ వేసుకోవడం సాధ్యపడుతుంది. మేకప్ ఉత్పత్తులతో ముఖ చర్మం దెబ్బ తినకుండా ఉండాలన్నా, వేసుకున్న మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలన్నా కొన్ని నాణ్యమైన సాధనాలకు తప్పనిసరిగా మేకప్ కిట్‌లో చోటు కల్పించాలి.

• **క్రయో స్టిక్స్:** చర్మం నునుపుగా, బిగుతుగా ఉంటే, మేకప్ ముఖం మీద సమంగా పరుచుకుంటుంది. కాబట్టి చర్మపు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి, మృదువుగా, బిగుతుగా మార్చే క్రయో స్టిక్స్‌తో మేకప్‌కు ముందు చర్మాన్ని మర్దన చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మీది సన్నని గీతలు తొలగిపోయి, ముడతలు లేని నున్నని చర్మం సొంతమవుతుంది.

• **మేకప్ అప్లికేటర్:** అప్లికేటర్ మేకప్ ఉత్పత్తిని పీల్చుకునేలా ఉండకూడదు. మేకప్‌ను ముఖ చర్మం మీద బ్లెండ్ చేసేలా ఉండాలి. కాబట్టి కాంపాక్ట్ అద్దుకోవడం కోసం సాధారణ స్పాంజ్‌కు బదులుగా మేకప్ అప్లికేటర్‌ను ఎంచుకోవాలి. నాణ్యమైనదాన్ని ఎంచుకుంటే ఎక్కువ కాలం మన్నడంతో పాటు ఫలితం కూడా మెరుగ్గా ఉంటుంది.

• **ఫౌండేషన్ బ్రష్:** ఫౌండేషన్ అద్దుకోవడానికి డ్యుయల్ ఎండెడ్ బ్రష్‌ను ఉపయోగించడం వల్ల ఫౌండేషన్ ముఖమంతా సమంగా పరుచుకుంటుంది. రెండు పరిమాణాల్లో ఉండే ఈ బ్రష్‌ను అవసరాన్ని బట్టి ముఖంలోని వేర్వేరు ప్రదేశాల్లో ఉపయోగించుకోవచ్చు. బుగ్గల మీద బ్లషర్ కోసం పెద్ద బ్రష్‌నూ, కనురెప్పల మీద ఐషాడో అప్లికేషన్ కోసం చిన్న బ్రష్‌నూ వాడుకోవాలి.

• **ఐల్యాష్ కర్లర్:** కనురెప్పలు వింజామరల్లా ఒత్తుగా మారాలంటే ఐల్యాష్ కర్లర్‌ను తప్పక ఉపయోగించాలి. కనురెప్పల్లోని వెంట్రుకలన్నీ సమంగా వంపు తిరగడానికి ఈ పరికరం ఉపయోగపడుతుంది.

• **బాడీ బ్రష్:** బాడీ బ్రాంజర్ అద్దుకోడానికి స్పాంజ్, సాధారణ బ్రష్‌లకు బదులుగా బాడీ బ్రష్‌ను ఉపయోగించాలి. ఇలా చేస్తే బ్లష్‌తో చర్మం సహజసిద్ధ మెరుపును సంతరించుకుంటుంది.

• **బ్లాటింగ్ పేపర్స్:** మేకప్ చెదిరిపోకుండా అదనపు మేకప్ మెరుపును తొలగించడానికి బ్లాటింగ్ పేపర్లు అద్భుతంగా ఉపయోగపడతాయి. వీటినెప్పుడూ వెంట ఉంచుకోవాలి.

- **మేకప్ రిమూవర్ ప్యాడ్స్:** రీయూజబుల్ మైక్రోఫైబర్‌తో తయారైన మేకప్ రిమూవర్ ప్యాడ్స్‌తో చర్మ రంధ్రాల్లో ఇంకిపోయిన మేకప్ సైతం చక్కగా తొలగిపోతుంది.



మదురై శుభశ్రీకి ఔషధ మొక్కల పెంపకమంటే కాలక్షేపం కాదు. ప్రాచీన వైద్య సంప్రదాయాల్ని పరిరక్షించే ఒక యజ్ఞం. ఐదువందలకు పైగా అరుదైన జాతులకు నెలవైన ఆమె ఔషధ వనం ఇప్పుడు పరిశోధనా విద్యార్థులకు అధ్యయన కేంద్రంగా మారింది.

ఔషధ మొక్కల టీచర్!

అది తమిళనాడులోని మదురైకి దగ్గర్లోని వరిచియూర్‌లో ఉన్న తోట. యాభై అయిదేళ్ళ మహిళ.. ఒక్కొక్క మొక్క దగ్గరా ఆగుతూ... వాటి విశిష్టతను వివరిస్తూ ఉంటే... స్టడీ టూర్‌లో భాగంగా అక్కడికి వచ్చిన విద్యార్థులు శ్రద్ధగా వింటున్నారు. చాలా సాధికారికంగా వాటి గురించి ఆమె చెప్పడం చూసి ఆశ్చర్యపోతున్నారు. "వృత్తి రీత్యా నేను టీచర్‌ని. ఎవరికి ఎలా చెబితే అర్థమవుతుందో నాకు తెలుసు" అంటారామె నవ్వుతూ. ఆమె పేరు బి.శుభశ్రీ. ఆ తోటలోని ప్రతి మొక్క ఆమె చేతుల మీదుగా పెరిగిందే. అపురూపమైన ఈ తోట... ఆమె అకుంఠిత దీక్షకు ప్రతిరూపం.

ఆ అనుభవంతోనే...

"ఔషధ మొక్కల మీద నా ఆసక్తి ఈనాటిది కాదు. దాదాపు నలభయ్యేళ్ళ క్రితం మా నాన్నను పాము కరిచింది. అప్పట్లో ఇన్ని వైద్య సౌకర్యాలు లేవు. పాము కాటును నయం చేసే ఒక మొక్క గురించి తెలిసి... దాని కోసం చుట్టుపక్కల ప్రాంతాలన్నీ గాలించాం. చివరికి సంపాదించాం. మా నాన్న ప్రాణం దక్కింది. ఈ అనుభవమే... వైద్యానికి ఉపయోగపడే మొక్కల గురించి ఇంకా తెలుసుకోవాలనే తపన పెరిగింది. వాటిని సేకరించి, పెంచడం ప్రారంభించాను" అని గుర్తు చేసుకున్నారు శుభశ్రీ. చదువు పూర్తి చేసుకొని ఆమె ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. ఉద్యోగ బాధ్యతల్లో, కుటుంబ బాధ్యతల్లో తీరికలేకుండా ఉన్నా... మొక్కలను సంరక్షించే పని మాత్రం వదిలిపెట్టలేదు. అలా కొన్ని వందల మొక్కలకు తన పెరట్లో ఆమె ఆశ్రయం కల్పించారు. "అయితే వాటి గురించి నా పరిచయస్తులకు తప్ప మరెవరికీ పెద్దగా తెలీదు. నేనూ పెద్దగా ప్రచారం చేసుకోలేదు. కానీ కొవిడ్ మహమ్మారి విజృంభించడంతో ఆయుర్వేదం ప్రయోజనాలను చాలామంది గుర్తించారు. ప్రత్యేకించి సిద్ధ ఔషధమైన 'కబాసుర కుడినీర్'ను ఇమ్యూనిటీ పెరుగుదల కోసం తమిళనాడు ప్రభుత్వం ప్రోత్సహించింది. ఇది నేను కొత్త దిశలో ఆలోచించేలా చేసింది" అంటారు శుభశ్రీ. మదురైకి పదిహేడు కిలోమీటర్ల దూరంలోని వరిచియూర్‌లో... తమ నలభై సెంట్ల భూమిలో ఔషధ మొక్కల వనాన్ని ఆమె ప్రారంభించారు. సాగునీటి కోసం బోర్‌వెల్, మొక్కల రక్షణ కోసం ఇనుప కంచె ఏర్పాటు లాంటివాటికి చాలా ఖర్చుచేశారు. దానికి ఆమె భర్త, పిపిఎఫ్‌టి మాజీ ఉద్యోగి బి.బాబు పూర్తి సహాయసహకారాలు అందించారు. ప్రస్తుతం ఆ తోటలో 500కు పైగా అరుదైన, విశిష్టమైన ఔషధ మొక్కలు ఉన్నాయి. ప్రతి దాని స్థానిక పేరును, శాస్త్రీయ నామాన్ని, ప్రయోజనాలను శుభశ్రీ చాలా వివరంగా నమోదు చేశారు. ఆమెను అందరూ 'ఔషధ మొక్కల టీచర్' అని ఆప్యాయంగా పిలుస్తారు.

సంప్రదాయానికి కొనసాగింపు

అయితే అపురూపమైన ఔషధ మొక్కల కోసం తను సాగిస్తున్న అన్వేషణ అంత సజావుగా సాగడం లేదంటారు శుభశ్రీ. "ఆయుర్వేద వైద్యుల ద్వారా, వృక్షశాస్త్ర నిపుణుల ద్వారా, పెద్దల ద్వారా, పుస్తకాల ద్వారా గొప్ప మొక్కల గురించి తెలుసుకుంటూ ఉంటాను. వాటి కోసం ప్రయత్నిస్తాను. కొన్ని నర్సరీలు నకిలీ మొక్కల్ని లేదా ఎదగడానికి అవకాశం లేని నాసిరకం మొక్కల్ని అంటగడుతూ ఉంటాయి. కొన్ని మొక్కల్ని సంపాదించడం చాలా కష్టం. ఒకసారి ఒక నర్సరీలో జలుబు నివారణతో పాటు క్యాన్సర్ రోగులకు స్వస్థత కలిగించే ఒక మొక్క ఉందని తెలిసింది. అక్కడికి వెళ్ళాను. తమ దగ్గర అవి లేవని యజమాని చెప్పాడు. మూడు నెలల తరువాత అతను నాకు కాల్ చేసి... ఆ మొక్క ఉంది. రమ్మన్నాడు. అది కొనడానికి వెళ్తే... స్టాక్ అయిపోయిందన్నాడు. నాకు కోపం, నిరాశ కలిగాయి. వెనక్కి వస్తూ ఉంటే... అక్కడ పని చేస్తున్న ఒక పెద్దాయన నా దగ్గరకు వచ్చారు. నేను పడుతున్న తాపత్రయాన్ని అర్థం చేసుకున్నానని చెబుతూ... నా ఫోన్ నెంబర్ తీసుకున్నారు. "అది వస్తే నేను కొని, నా దగ్గర ఉంచుతాను. మీకు సమాచారం ఇస్తాను. వచ్చి తీసుకోండి" అన్నారు. రెండు వారాల తరువాత ఆయన మాట నిలబెట్టుకున్నారు" అని చెప్పారు శుభశ్రీ. ఇప్పుడు ఆమె గార్డెన్ విద్యార్థులకు, పరిశోధకులకు, వృక్ష ప్రేమికులకు ఒక రిసోర్స్ సెంటర్‌గా మారింది. అనేక ప్రాంతాల నుంచి విద్యార్థులు స్టడీ టూర్ల కోసం అక్కడికి వస్తున్నారు. ప్రతి మొక్క ప్రాధాన్యత గురించి వారికి శుభశ్రీ వివరిస్తారు. వారు విశ్రాంతి తీసుకోవడం కోసం చిన్న కుటీరం లాంటి ఏర్పాట్లను కూడా చేశారు. అంతేకాదు... ఔషధ మొక్కల విలువ, అవసరం, సంరక్షణ గురించి ప్రజలకు తెలియజెయ్యడానికి వర్క్‌షాపులను, అవగాహన తరగతులను నిర్వహిస్తున్నారు. ఆ చుట్టుపక్కల ఔషధ మొక్కలు పెంచాలనుకొనేవారికి తనవంతు సాయం చేస్తున్నారు. "ఇది కేవలం మొక్కల సేకరణ మాత్రమే కాదు. ఇది సంప్రదాయ విజ్ఞాన సంప్రదాయానికి కొనసాగింపు. ప్రాచీన వైద్యవిధానాల పట్ల అవగాహనను పెంపొందించే ప్రయత్నం. ఈ గార్డెన్ లక్ష్యం... కేవలం సేంద్రియంగా ఔషధ మొక్కలను పెంచడం మాత్రమే కాదు... వాటికి సంబంధించిన అమూల్యమైన విజ్ఞానాన్ని పదిలపరచి, భవిష్యత్ తరాలకు అందించడం, ఇంటింటా ఒక హెర్బల్ గార్డెన్ ఏర్పాటును ప్రోత్సహించడం కూడా" అంటున్నారు శుభశ్రీ.

మైసూరు రోడ్ల మీద బిచ్చమెత్తుకున్న ఆమె... ఇప్పుడు తన కూతుర్ని జాతీయ స్థాయి కిక్‌బాక్సర్‌గా తీర్చిదిద్దింది. సమాజంలో తనకు దక్కని గౌరవాన్ని తన బిడ్డకు అందించింది. ఒకప్పుడు కన్నవారికే భారమై... అవమానాలు, అవహేళనలే జీవితమై... గడిపిన ఆమె నేడు ఎందరో తల్లులకు ఆదర్శంగా నిలిచింది. 65 ఏళ్ల ట్రాన్స్‌జెండర్ మహిళ షబనా అంతరంగం ఇది.

సంకల్పం



కూతురు కలే తనదిగా..!



"పుట్టినప్పుడు మా అమ్మానాన్నలు నాకు పెట్టిన పేరు అక్రమ్ పాషా. కానీ పెరిగే క్రమంలో నాలో ఏవో విభిన్న భావాలు. చుట్టుపక్కల పిల్లల్లో నేను ప్రత్యేకంగా కనిపించేదాన్ని. అందరూ నన్ను వింతగా చూడడం మొదలుపెట్టారు. ఇది మా ఇంట్లోవాళ్లకు ఇబ్బందిగా మారింది. నేనేమిటో నాకు అర్థమయ్యేసరికి ఇంటికి దూరమయ్యాను. చెప్పాలంటే ట్రాన్స్‌జెండర్‌నని తెలిసి కన్నవారే నన్ను తరిమేశారు. దిక్కు తోచని స్థితిలో మైసూరు రోడ్లే నాకు దిక్కయ్యాయి. దీనికితోడు అవమానాలు, అవహేళనలు. ఆకతాయిలు ఆట పట్టించేవారు. సమాజంలో నాకంటూ ఒక చోటు లేదు. ఎక్కడికి వెళ్లినా పని దొరకలేదు. అన్నిటినీ భరించాను. అలా కొన్నేళ్లు గడిచాక పలు స్వచ్ఛంద సంస్థలు నన్ను చేరదీశాయి. ఆ సంస్థల సహకారంతో అక్కడా ఇక్కడా పని చేసుకొంటూ జీవించడం మొదలుపెట్టాను. నాతోపాటు నాలాంటి మరికొందరి జీవితాలకు కూడా ఆసరా చూపే ప్రయత్నం చేశాను.

ఆడపిల్లల్ని దత్తత తీసుకుని...

సమాజం నన్ను వెలివేసినా... కొందరి చేయూతవల్ల నేను స్వతంత్రంగా నిలబడగలిగాను. కానీ నా కష్టాలకు తోడు అనుకోని బరువు నా భుజాలపై పడింది. నా కజిన్‌కు నలుగురు ఆడపిల్లలు. పోషించే స్తోమత లేక వారిని రోడ్డుపాలు చేశాడు. సరైన నీడ, తిండి దొరక్క అవస్థలు పడుతున్న ఆ పిల్లల్ని చూసి నా గుండె బరువెక్కింది. మరో ఆలోచన లేకుండా ఆ నలుగురు ఆడపిల్లల్నీ నేను దత్తత తీసుకున్నాను. నాకు తెలుసు... నా జీవితం గడవడమే కష్టంగా ఉంది. అయినా నేను కాకపోతే ఆ చిన్నారులకు దిక్కెవరు? అందుకే ఆ సమయంలో నేను మరేమీ ఆలోచించలేదు. ఎలాగో వారిని పోషించుకొంటూ వచ్చాను.

ఆటపై మక్కువ చూసి...

నా నలుగురు అమ్మాయిల్లో బీబీ ఫాతిమా కాస్త భిన్నంగా కనిపించింది. ఇరవయ్యేళ్ల కిందట తను మా ఇంటికి వచ్చింది. తనకు కిక్‌బాక్సింగ్ అంటే చాలా ఇష్టం. ఒక దృశ్యం నన్ను బాగా కదిలించింది. అప్పుడు ఫాతిమాకు పన్నెండేళ్లు. ఒక రోజు తన కిడ్డీ బ్యాంక్ పగులగొట్టి, అందులో దాచుకున్న నాణేలు తీసుకుని, స్థానిక 'ఎలైట్ కిక్‌బాక్సింగ్ అకాడమీ'కి వెళ్లింది. ఆ డబ్బును వారి చేతిలో పెట్టి... తనకు కిక్‌బాక్సింగ్ నేర్పమని అడిగింది. అది చూసి నా కళ్లు చెమర్చాయి. అంత చిన్న వయసులో ఆట నేర్చుకోవాలన్న తన పట్టుదల నా ఆలోచనల్ని మార్చేసింది. రోజు గడవడం కష్టంగా ఉన్నా సరే... ఫాతిమాను అత్యున్నత క్రీడాకారిణిగా తీర్చిదిద్దాలనుకున్నా. ఆ రోజు నుంచి తన కలను నా కలగా మార్చుకున్నా.

నాకే దక్కినంత ఆనందం...

ఫాతిమాను రోజూ వెంటబెట్టుకుని అకాడమీకి తీసుకువెళ్లేదాన్ని. తను లోపల శిక్షణ తీసుకొంటుంటే... నేను బయట కూర్చొనేదాన్ని. ఒక్కోసారి ఉండబట్టలేక లోపలకు వెళ్లి తన సాధన చూసేదాన్ని. నా మనసు ఉప్పొంగిపోయేది. నా కష్టాన్ని నా బిడ్డ అర్థం చేసుకుంది. తన కోసమే కాదు... నా కళ్లల్లో మెరుపు కోసం కూడా తను కష్టపడింది. కోచ్ జస్వంత్, 'కర్ణాటక కిక్‌బాక్సింగ్ అసోసియేషన్' కార్యదర్శి రవి ఫాతిమాకు అండగా నిలిచారు. చక్కని మార్గదర్శనం చేసి... నైపుణ్యానికి పదును పెట్టారు. కోచ్‌లు ఫాతిమాను ప్రశంసిస్తుంటే... అవి నాకే దక్కినంత సంతోషించేదాన్ని.

> **అమ్మే నా బలం...**
>
> "ఇవాళ కిక్‌బాక్సర్‌గా ఇంతటి కీర్తి గడిస్తున్నానంటే అది మా అమ్మ గొప్పతనమే. తను నా కోసం ఎన్నో త్యాగం చేసింది. అవమానాలు భరించింది. కష్టాలు అనుభవించింది. చిన్నప్పుడే నాలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించింది. ఆఖరికి నా కలను తన లక్ష్యంగా మలుచుకుని ఇన్నేళ్లుగా అవసరమైనవన్నీ సమకూర్చింది. ఇప్పుడు నా విజయాన్ని తనదిగా ఆస్వాదిస్తోంది. నా బలం మా అమ్మే. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి అమ్మ గర్వపడేలా చేయడమే నా లక్ష్యం." అంటుంది ఫాతిమా.



కలలకు ప్రతిరూపం...

ఇప్పుడు ఫాతిమాకు ఇరవయ్యేళ్లు. పసిబిడ్డగా నా ఇంటికి వచ్చిన తను... ఎంతో ఎత్తుకు ఎదిగింది. నా కలలకు ప్రతిరూపమైంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో రాణించి ఎన్నో పతకాలు గెలుచుకుంది. ఇటీవలే ముగిసిన 'కర్ణాటక స్టేట్ క్యాడెట్ 46 కేజీల మహిళల లైట్ వెయిట్ విభాగంలో జూనియర్, సీనియర్, మాస్టర్ కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు సాధించింది. అంతేకాదు... ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఓపెన్ చాంపియన్‌షిప్‌లో కూడా అద్భుత విజయాలు నమోదు చేసింది. ప్రస్తుతం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే జాతీయ కిక్‌బాక్సింగ్ పోటీలకు సన్నద్ధమవుతోంది.

అవమానాలు దాటి...

ఫాతిమా నా బిడ్డ మాత్రమే కాదు... నా గౌరవం కూడా. ఆమె విజయాలు నాకు గర్వకారణం. తననే కాదు... మిగిలిన పిల్లల్ని కూడా ఉన్నంతలో చదివిస్తున్నా. వారికి నచ్చిన రంగంలో ప్రోత్సహిస్తున్నా. అయితే నాలాంటివారి పట్ల ఈ సమాజం వివక్ష చూపుతుంది. ఏదో అపరాధం చేసినట్టు పరిగణిస్తుంది. కానీ మేమూ మనుషులమే. మాలోనూ ప్రేమ, వాత్సల్యం, సమాజం పట్ల బాధ్యత ఉన్నాయి. ఈ లోకం మమ్మల్ని చూసే దృష్టి మారాలి. ఆ దిశగా నావంతు ప్రయత్నం చేస్తున్నాను. నాలాంటివారికి స్ఫూర్తిగా నిలిచి, వారి అభ్యున్నతికి బాటలు వేయాలనే సంకల్పంతో ముందుకు వెళుతున్నాను."

నవ్య | చిత్రజ్యోతి



వెల్‌కమ్ బేబీ గర్ల్

రణ్‌వీర్ సింగ్, దీపిక పదుకొణే దంపతులు తల్లిదండ్రులయ్యారు. ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆదివారం ఉదయం దీపిక ఆడబిడ్డకు జన్మనిచ్చారు. 'వెల్‌కమ్ బేబీ గర్ల్' అని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టి వారి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ దంపతులకు పలువురు సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలిపారు.

దృశ్యకావ్యంలా...



మలయాళ నటుడు టొవినో థామస్ నటించిన 50వ చిత్రం 'ఏ.ఆర్.ఎమ్' (అజాయంతే రండం మోషణం). కృతిశెట్టి, ఐశ్వర్య రాజేశ్, సురభి లక్ష్మీ హీరోయిన్స్‌గా నటించిన ఈ చిత్రాన్ని జితిన్ లాల్ తెరకెక్కించారు. లిస్టిన్ స్టీఫెన్ నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతున్న సందర్భంగా టొవినో థామస్ మీడియాతో ముచ్చటించారు. "ఇదో విభిన్న తరహా చిత్రం. ఇందులో నేను మూడు రకాల పాత్రలు పోషించాను. ఈ సినిమా కోసం యుద్ధవిద్యలు నేర్చుకున్నాను. దర్శకుడు జితిన్ సినిమాను అనుకున్నదానికంటే గొప్పగా తెరకెక్కించాడు. ఇందులో యాక్షన్ సన్నివేశాలు అధికంగా ఉంటాయి. దర్శకుడు ఈ కొత్తదనం కోరుకునే ప్రేక్షకుల కోసం ఈ సినిమాను ఓ దృశ్యకావ్యంలా మలిచారు. మంచి కథ దొరికితే తెలుగులోనూ స్ట్రయిట్ చిత్రం చేస్తాను" అని చెప్పారు.



రెండింతల వినోదం

శ్రీసింహ కోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా నటించిన చిత్రం 'మత్తు వదలరా 2'. నితేష్ రాణా దర్శకత్వంలో చిరంజీవి, హేమలత నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. ఆదివారం మేకర్స్ సినిమా ట్రైలర్‌ను ప్రభాస్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నితేష్ రాణా మాట్లాడుతూ "మర్డర్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ ఇది. అందరినీ విపరీతంగా నవ్విస్తుంది. మొదటి భాగం కంటే రెండింతల వినోదంతో వస్తున్నాం" అని చెప్పారు.

భిన్న ప్రపంచాలు



నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహనరావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో నాగార్జున, ధనుశ్ పాత్రలకు సంబంధించిన రెండు విభిన్న ప్రపంచాలను మేకర్స్ పరిచయం చేశారు.

కొత్తగా..

మాస్ లుక్‌లో



డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా 'గేమ్ చేంజర్'. కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మిస్తున్నారు. ఎస్.జే.సూర్య, శ్రీకాంత్, సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం నుంచి ఓ కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేసి ఫ్యాన్స్‌ను ఖుషీ చేశారు. మాస్ లుక్‌లో రామ్‌చరణ్ అలరించారు. త్వరలోనే రెండో పాటను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

వినాయకన్‌పై కేసు



రజనీకాంత్ హీరోగా నటించిన 'జైలర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు మలయాళ నటుడు వినాయకన్. శనివారం కొచ్చి నుంచి ఇండిగో విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న వినాయకన్ తోటి ప్రయాణికులతో వాగ్వాదానికి దిగారు. వారు సీఐఎస్ఎఫ్ సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో అదుపులోకి తీసుకునేందుకు వచ్చిన భద్రతా సిబ్బందిపైనా ఆయన దురుసుగా ప్రవర్తించాడు. దాంతో వినాయకన్‌ను అదుపులోకి తీసుకొని ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఆయనపై న్యూసెన్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఆర్జీఏఐ సీఐ బాల్‌రాజ్ తెలిపారు. అనంతరం వినాయకన్‌ను అక్కడి నుంచి పంపించగా.. గోవా వెళ్లారు.

- శంషాబాద్ రూరల్ (ఆంధ్రజ్యోతి)

యూట్యూబర్‌పై ఫిర్యాదు



మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌ను, మంచు విష్ణును, ఇతర నటీ నటులను టార్గెట్ చేసి, విద్వేష పూరితంగా, అసభ్య పదజాలంతో కూడిన కంటెంట్‌తో అసత్యాలను సోషల్ మీడియాలో, తన యూట్యూబర్ చానల్స్ ద్వారా ప్రచారం చేస్తున్నాడని, విజయ్ చంద్రహాసన్ దేవరకొండపై 'మా' సంస్థ కోశాధికారి, నటుడు శివబాలాజీ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టెక్నికల్ ఎవిడెన్స్‌ను శివబాలాజీ పోలీసులకు అందజేశారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ముధులత నిందితుడిపై కేసు నమోదు చేసి, నోటీసులు జారీ చేశారు.

- హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

మీడియా ముందుకెళ్లొద్దు

లైంగిక వేధింపుల గురించి నటీనటులు మీడియా ముందుకు వెళ్లొద్దని నడిగర్ సంఘం (దక్షిణ భారత సినీ కళాకారుల సంఘం)లోనే ఫిర్యాదు చేయాలని ఆ సంఘం ఆధ్వర్యంలో లైంగిక వేధింపులపై విచారణ జరిపేందుకు ఏర్పాటైన విశాఖ కమిటీ అధ్యక్షురాలు, నటి రోహిణి సూచించారు. ఇటీవల మాలీవుడ్‌లో హేమకమిటీ సృష్టించిన కలకలం నేపథ్యంలో నడిగర్ సంఘంలో అలాంటి సంచలనాలకు తావుండకూడదని ఆమె పేర్కొన్నారు.

ఐదేళ్ల నిషేధం..

ఆదివారం జరిగిన నడిగర్ సంఘం సర్వసభ్యమండలి సమావేశంలో లైంగిక వేధింపుల ఆరోపణకు గురైన నటులపై ఐదేళ్ల నిషేధం విధించాలని తీర్మానించారు. ఈ తీర్మానాన్ని సినీ నిర్మాతల సంఘానికి కూడా ప్రతిపాదించారు. లైంగిక వేధింపులకు గురయ్యే బాధితులు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయడానికి నడిగర్ సంఘం అండగా ఉంటుందని తీర్మానంలో పేర్కొన్నారు. బాధితులు ఫిర్యాదు చేయడానికి ప్రత్యేక ఫోన్ నెంబర్లు, ఈమెయిల్ కూడా ఏర్పాటు చేసినట్లు నడిగర్ సంఘం పేర్కొంది.

- చెన్నై (ఆంధ్రజ్యోతి):



సెన్సార్ ఆమోదం



కంగనా రనౌత్ నటించి, స్వీయ దర్శకత్వం వహించిన లేటెస్ట్ చిత్రం 'ఎమర్జెన్సీ'. వివాదాల్లో చిక్కుకున్న ఈ సినిమాకు ఎట్టకేలకు సెన్సార్ ఆమోదం లభించింది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు యు/ఎ సర్టిఫికేట్ జారీ చేసింది. అయితే కొన్ని అభ్యంతరకర సీన్స్ సినిమాలో నుంచి తొలగించాలని లేదా వాటి స్థానంలో ఇతర సన్నివేశాలు జతచేయమని చిత్రబృందానికి సెన్సార్ బోర్డు సూచించింది. ఈ నెల 6న సినిమా విడుదల కావాల్సి ఉండగా.. సిక్కు సంఘాల అభ్యంతరాల నేపథ్యంలో సినిమాకు సెన్సార్ ఆలస్యమయ్యింది. త్వరలోనే చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించనుంది.